అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 11-07-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 142 | Published from Rangareddy, Hyderabad, Khammam, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు

భరణానికి అర్హులే



సుప్రీం తీర్పు

భరణం దాతృత్వం కాదు...

దానికి మతంతో సంబంధం లేదు

మహిళలందరికీ సీఆర్‌పీసీ

సెక్షన్ 125 వర్తింపు

వివరాలు 11లో..



పార్టీ విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు

సంకీర్ణమైనా

సరళీకరణ విధానాలే

చంద్రబాబు, నితీశ్ వాటికి అనుకూలమే

- కార్పొరేట్ శక్తుల సేవకుడిగా మోడీ
- పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి శృంగభంగం
- ప్రజల్లో భరోసా కల్పించిన ఇండియా బ్లాక్
- దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించడమే మా లక్ష్యం
- ఫెడరల్ వ్యవస్థను నాశనం చేస్తున్న కేంద్రం
- సెస్ వసూళ్లలో రాష్ట్రాలకూ వాటా ఇవ్వాలి
- రేవంత్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే ఉద్యమిస్తాం
- అవకాశవాద రాజకీయాలను బీఆర్ఎస్ వీడాలి
- మతోన్మాదంపై విశాల ప్రాతిపదికన పోరాడాలి : విస్తృత సమావేశంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పిలుపు వివరాలు 12లో

బీజేపీని నిలువరించటమే మా కర్తవ్యం



ఆ పోరాటంలో ఎవరు కలిసొస్తే వారిని కలుపుకునిపోతాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

వివరాలు 12లో

హక్కుల కోసం కేంద్రంపై పోరాడాలి...



విభజన అంశాలపై మోడీ సర్కారుపై ఒత్తిడి తేవాలి : రేవంత్ సర్కారుకు ఎస్ వీరయ్య సూచన

వివరాలు 12లో

సహకార బలోపేతానికి కొత్త అవకాశాలు

ఆస్ట్రియా చాన్సలర్‌తో మోడీ భేటీ

ఉక్రెయిన్, పశ్చిమాసియా ఘర్షణలపై సుదీర్ఘంగా చర్చ

యుద్ధానికి సమయం కాదంటూ మోడీ పునరుద్ఘాటన



వియన్నా : భారత్, ఆస్ట్రియాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు గల కొత్త అవకాశాలను గుర్తించినట్టు ప్రధాని మోడీ తెలిపారు. రాబోయే దశాబ్ద కాలంలో సహకారానికి బ్లూ ప్రింట్‌ను సిద్ధం చేసినట్టు తెలిపారు. ఈ సంబంధాలకు వ్యూహాత్మక దిశా నిర్దేశాన్ని ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. మాస్కోలో రెండు రోజుల పర్యటన ముగించుకుని మంగళవారం రాత్రి వియన్నా చేరుకున్న మోడీ, ఆస్ట్రియా ఛాన్సలర్ కర్ల్ నెహమర్‌తో చర్చలు జరిపారు. అనంతరం నెహమర్‌తో కలిసి మోడీ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. తమ చర్చలు అర్థవంతంగా సాగాయని మోడీ చెప్పారు. ఉక్రెయిన్‌లో యుద్ధం, పశ్చిమాసియాలో పరిస్థితులతో సహా ప్రపంచంలో ప్రస్తుతం నెలకొన్న వివాదాలన్నింటిపై సవివరంగా చర్చించినట్టు చెప్పారు. యుద్ధానికి ఇది సమయం ...11లో

రైతులతో నేరుగా మాట్లాడండి

భూసేకరణలో మానవీయత ఉండాలి

ట్రిబుల్ ఆర్ అంతటికీ ఒకే నెంబర్

అటవీ భూములకు ప్రత్యామ్నాయం : కలెక్టర్లకు సీఎం ఆదేశాలు



జాతీయ రహదారుల నిర్మాణాలపై సమీక్ష

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

జాతీయ రహదారులకు భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం ఎంత ఎక్కువ పరిహారం వస్తుందో ఆమేరకు రైతులకు దక్కేలా చూడాలని చెప్పారు. బుధవారం రాష్ట్రంలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలపై డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నా, భూసేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని సీఎం ప్రశ్నించారు. భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువగా ఉండడం, మార్కెట్‌లో ధరలు అధికం కావడంతోనే భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని సీఎం ప్రశ్నకు కలెక్టర్లు బదులిచ్చారు. ఇందుకు స్పందించిన సీఎం తరతరాలుగా వస్తున్న భూములను రైతులు శాశ్వతంగా కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్లు రైతులను పిలిచి నేరుగా మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం, ఉత్తర భాగం వేర్వేరుగా చూడొద్దనీ, ఆ రెండింటికి కలిపి ఒకే నెంబర్ కేటాయించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరగా, ఆయన సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్టు సీఎం తెలిపారు. ఆ ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ఎన్‌హెచ్‌ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. వెంటనే దానిని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూసేకరణలో ఉన్న ఆటంకాలపై సీఎం ఆరా తీశారు. అలైన్‌మెంట్ విషయంలో పొరపడి కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారనీ, దాంతో హైకోర్టు స్టే ఇచ్చిందని యాదాద్రి-భువనగిరి కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. స్టే తొలగింపునకు వచ్చే శుక్రవారం నాటికి కౌంటర్ దాఖలు చేయాలని కలెక్టర్‌కు, సీఎం సూచించారు. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో ఖమ్మం జిల్లాలో భూ సేకరణ పరిస్థితి ఏమిటని సీఎం అడిగారు. ఖమ్మం సమీపంలోని విలువైన భూముల గుండా రహదారి పోతుందనీ, పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ ...2లో

డీజీపీగా జితేందర్

హోంశాఖ ప్రత్యేక కార్యదర్శిగా రవిగుప్తా


బాధ్యతలు స్వీకరించిన ఇరువురు అధికారులు

నేర రహిత రాష్ట్రమే లక్ష్యం : డీజీపీ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(డీజీపీ)గా జితేందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ప్రస్తుత డీజీపీ డాక్టర్ రవిగుప్తాను రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ చేసింది. రాష్ట్ర డీజీపీగా ఆరు నెలల కిందట రవిగుప్తాను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అప్పటి డీజీపీ అంజన్‌కుమార్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆయన్ను ఆ పదవి నుంచి ఈసీ తప్పించిన సంగతి విదితమే. ఆయన స్థానంలో రవిగుప్తా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పుడు ఆయన స్థానంలో జితేందర్ డీజీపీగా నియమితు లయ్యారు. ఆయన బుధవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో డీజీపీ కార్యాలయానికి చేరుకుని డాక్టర్ రవిగుప్తా నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన డీజీపీ జితేందర్‌కు సీనియర్ ఐపీఎస్ అధికారులు సంజయ్‌కుమార్ జైన్, షికాగోయల్, శివధర్‌రెడ్డి, వి.వి.శ్రీనివాసరావు, అభిలాష బిస్త్, స్వాతిలక్రా, సుమతితో పాటు నగర పోలీసు కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్‌జోషి, తదితర అధికారులు అభినందనలు తెలిపారు. 1992 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన జితేందర్ పంజాబ్ రాష్ట్రం జలంధర్‌కు చెందిన వారు. ఐపీఎస్ శిక్షణ పూర్తయ్యాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు ఎంపికయ్యారు. నిర్మల్ ...11లో



10లో..

రాష్ట్రంలో 15 మంది ఐపీఎస్‌ల బదిలీలు

శాంతి భద్రతల అదనపు డీజీగా మహేశ్ భగవత్

సాగుదారులకే భరోసా

రైతుభరోసా అమలుపై మెజార్టీ అభిప్రాయం


ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా విస్తృత సమావేశం

క్యాబినెట్ సబ్‌కమిటీ నేతృత్వంలో అభిప్రాయ సేకరణ

హాజరైన కన్వీనర్, డిప్యూటీ సీఎం భట్టి, సభ్యులు తుమ్మల, పొంగులేటి

రైతులు, రైతు సంఘాల నాయకులు వందలాది మంది అభిప్రాయాలు వెల్లడి

పూర్తిస్థాయి బడ్జెట్ సమయంలో విధివిధానాలు : భట్టి



రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, వేదికపై మంత్రులు తుమ్మల,పొంగులేటి

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఎవరైతే భూమి సాగు చేస్తున్నారో.. ఎన్ని ఎకరాలు సేద్యం చేస్తున్నారో.. అంత మొత్తానికి 'రైతుభరోసా' ఇవ్వాలని.. కౌలు రైతా? పట్టేదారా? అనేదానితో నిమిత్తం లేకుండా పంట పెట్టుబడి సహాయం చేయాలని మెజార్టీ అభిప్రాయం ...2లో



లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్

డిమాండ్స్ డేలో పాల్గొన్న కార్మికులు.. రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు

నవతెలంగాణ - ముషీరాబాద్/విలేకరులు

కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, గ్రామపంచాయతీ, మున్సిపల్, భవన నిర్మాణ రంగం తదితర రంగాల కార్మికులు తమ హక్కులు, సమస్యలపై ధర్నాలు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ...10లో

నాట్కో పరిశ్రమలో ప్రమాదం

ఒకరు మృతి, మరొకరికి గాయాలు



(ఫైల్)


నవతెలంగాణ కొత్తూరు

నాట్కో పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేక గూడా గ్రామ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెంజర్ల గ్రామానికి చెందిన రవి (19) అదే గ్రామానికి చెందిన అర్బాజ్ అనే కాంట్రాక్టర్ వద్ద రెండు నెలలుగా నాట్కో పరిశ్రమలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం విధుల్లో ఉండగా బూమ్ లైట్ యంత్రంలో ఆయిల్ లీకేజీ ఉండటంతో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా మరమ్మత్తులు చేయిస్తుండగా ఒక్కసారిగా యంత్రం పై నుంచి అతనిపై పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రవి మృతిచెందాడు. గాయాలైన మరో వ్యక్తి.. మహేష్ ప్రస్తుతం స్టార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుని తల్లి వీర్లపల్లి సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

లీకు వీరుడు బేడీ రామ్

నీట్ లీక్ ఆరోపణలు, యూజీసీ-నెట్ రద్దు నేపథ్యంలో వినిపిస్తున్న పేరు

- ఈయన యూపీలో బీజేపీ మిత్రపక్షం ఎస్‌బీఎస్‌పీ ఎమ్మెల్యే
- గతంలో రైల్వే నుంచి రాష్ట్ర రిక్రూట్‌మెంట్ల వరకు హస్తం
- బేడీ రామ్‌పై అనేక పరీక్షా పత్రాల లీక్ ఆరోపణలు
- పలు రాష్ట్రాల్లో కేసులు.. కొట్టి పారేసిన ఎస్‌బీఎస్‌పీ



దేశంలో నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలు, నీట్-పీజీ, యూజీసీ-నెట్ వంటి పరీక్షల రద్దు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. 'నీట్-(అండర్ గ్రాడ్యుయేట్)యూజీ' లీక్‌కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. ఈ నేపథ్యంలో గతంలోనూ జరిగిన పలు పరీక్షలకు సంబంధించిన లీక్ ఆరోపణలు దేశంలో చర్చకు వస్తున్నాయి ఇందులో భాగంగా యూపీలో బీజేపీ మిత్రపక్షం సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్‌బీఎస్‌పీ)కి చెందిన ఎమ్మెల్యే బేడీ రామ్ పేరు మళ్లీ తెర పైకి వచ్చింది.

న్యూఢిల్లీ : "నేను వివిధ రాష్ట్రాలలో 40-50 మందిని రిక్రూట్ చేయిస్తాను. నేను ఇతర రాష్ట్రాలతో పాటు రాజస్థాన్, బీహార్, తెలంగాణ, ఎంపీలో రిక్రూట్‌మెంట్‌లను పూర్తి చేస్తున్నాను. దాని(పేపర్) రద్దుతో సంబంధం లేకుండా ఫలితాలు వచ్చే వరకు మాత్రమే నా బాధ్యత" అని బేడీ రామ్ చెప్పిన మాటలకు సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

బేడీ రామ్.. యూపీలోని ఘాజీపూర్ జిల్లాలో ఉన్న జఖానియన్ ఎమ్మెల్యే. ఆయన బీజేపీ మిత్రపక్షమైన ఎస్‌బీఎస్‌పీ సభ్యుడు. ఆ పార్టీ 2024 లోక్‌సభ ఎన్నికలతో పాటు 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని పోటీ చేసింది. ఎస్‌బీఎస్‌పీ అధినేత ఓం ప్రకాష్ రాజ్‌భర్.. యోగి తొలి క్యాబినెట్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. నీట్-యూజీ మెడికల్ ప్రవేశ పరీక్షలో ప్రశ్నపత్రం లీకైందన్న ఆరోపణలు, యూజీసీ-నెట్ పరీక్ష రద్దుపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణంలోనే బేడీ రామ్‌కు సంబంధించిన ఈ వీడియో బయటకు వచ్చింది. అయితే బేడీరామ్ 2009 నుంచి వ్యాపారంలో ఉన్నట్టు తెలుస్తున్నది. రైల్వే రిక్రూట్‌మెంట్ పరీక్షలతో పాటు మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్



కమిషన్ (ఎంపీపీఎస్సీ) నియామకాల్లో ప్రశ్న పత్రాలను లీక్ చేయటం, అక్రమమైన పద్ధతులను అభ్యసించినట్టు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. కొన్ని వార్త కథనాల ప్రకారం.. మోసం చేయటం, ప్రశ్నపత్రాలను లీక్ చేయటం వంటి ఇతర ఆరోపణలతో ఆయనపై తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇంతకీ బేడీ రామ్ ఎవరు? ఆయనపై ఉన్న అభియోగాలు ఏమిటి? నిశితంగా పరిశీలిద్దాం.

మూడు రాష్ట్రాల్లో తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు

యూపీలోని జౌన్‌పూర్‌వాసి అయిన బేడీ రామ్(62) ఓం ప్రకాష్ రాజ్‌భర్ పార్టీ ఎస్‌బీఎస్‌పీలో ప్రముఖ దళిత నాయకుడు. ఆయన మాట్లాడుతున్నట్టుగా చెప్పబడుతున్న వీడియో వైరలైన తర్వాత.. యోగితో పాటు యూపీ ఉపముఖ్యమంత్రులు ...11లో

అభివృద్ధి పేరిట బతుకులు చిన్నాభిన్నం

- ప్రజ్ఞాపూర్ రహదారిపై రైతుల రాస్తారోకో
- ప్రాజెక్టుల పేరిట గత ప్రభుత్వం ప్రాణాలు తీస్తే.. మళ్లీ ట్రిబుల్ ఆర్ పేరుతో మా బతుకులు ఆగం
- అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు..
- భూమికి నష్టపరిహారం డబ్బు వద్దు..
- భూమికి భూమి ఇప్పించండి



నవతెలంగాణ- గజ్వేల్ రూరల్

"పదేండ్లుగా ప్రాజెక్టుల పేరుతో గత ప్రభుత్వం రైతుల బతుకులు రోడ్డుపాలు చేసింది.. ప్రస్తుతం ప్రజల ప్రభుత్వం అని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి.. రైతుల బతుకుల్లో చీకటి నింపొద్దు.. ట్రిబుల్ ఆర్ నిర్మాణానికి మేం వ్యతిరేకం కాదు.. పదేండ్లలో దగాపడ్డ జీవితాలు ఇప్పుడిప్పుడే దారికి వస్తున్నాయి.. అభివృద్ధి పేరిట మా బతుకులు చిన్నాభిన్నం చేయొద్దు" అంటూ గజ్వేల్ నియోజకవర్గ రైతులు ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై ట్రిపుల్ అర్ భూ నిర్వాసితులు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. అనంతరం రాజీవ్ రహదారిపై మోకాళ్లపై బైటాయించి, సాష్టాంగ నమస్కారం చేస్తూ ధర్నా చేపట్టారు. ట్రిబుల్ ఆర్ నిర్మాణం వల్ల గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా 4750 ఎకరాల భూములను కోల్పోతున్నామని బాధితులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి పేరిట ఇప్పటికే మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులు, ఔటర్ రింగ్ రోడ్డు పేరిట రైతుల భూములు ప్రభుత్వం గుంజుకుందని, ఉన్న కొద్దిపాటి భూములను ఇప్పుడు ట్రిబుల్ ఆర్ పేరిట ప్రభుత్వం గుంజుకోవాలని చూస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. భూములు కోల్పోయిన రైతులు.. మనస్తాపం చెంది గుండెపోటుతో కొంతమంది, పురుగుల మందు తాగి కొంతమంది మృతిచెందారని గుర్తుచేశారు. భూమి ఉంటేనే గ్రామంలో అవసరాలకు షావుకారులు డబ్బులు ఇస్తారని, భూమి లేకుంటే ఆపద సమయంలో



ఎవరూ ఆదుకోరని తెలిపారు. ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడానికి వీలు కాకపోతే ప్రభుత్వం ఇచ్చే ఏ ప్యాకేజీలు తమకు వద్దన్నారు. రైతుల దగ్గర ఎంత భూమి తీసుకుంటే అంతే భూమి మరెక్కడైనా రైతులకు అందజేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ ఇస్తే.. తమ సమస్యను విన్నవించుకుంటామని తెలిపారు. దీనిలో ఎటువంటి రాజకీయ ఉద్దేశం లేదని, కేవలం రైతులమే ధర్నా చేస్తున్నామని స్పష్టంచేశారు.

భూ నిర్వాసితుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకొని రైతుల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ ధర్నాలో గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జరిగిన బోనాల వేడుకల్లో తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు.

ఎ. పద్మనాభన్ మృతికి ఏఐఏడబ్ల్యూయూ సంతాపం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేరళ రాష్ట్ర వ్యవసాయ కార్మికుల ఉద్యమ వ్యవస్థాపక నాయకులలో ఒకరు ఎ.పద్మనాభన్ మృతి పట్ల అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం ఏఐఏడబ్ల్యూయూ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. విజయరాఘవన్, బి. వెంకట్ ప్రకటన విడుదల చేశారు. "జనరల్ కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి ఎ. పద్మనాభన్ సభ్యుడు. కేంద్ర కార్యవర్గ సభ్యుడుగా ఉన్నారు. ఆయన కేరళలోని కేఎస్ కేటీయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కూడా ఉన్నారు. కనీస వేతనాలు, నిర్ణీత పని గంటలు, కార్మికుల హక్కులు, వరి పొలాల రక్షణ కోసం అనేక ఉద్యమాల్లో అగ్రగామిగా నిలిచారు. ఆయన ఎమర్జెన్సీ సమయంలో జైలు పాలయ్యారు.

సాగుదారులకే భరోసా

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడైంది. రైతుభరోసాపై ఉమ్మడి ఖమ్మం జిల్లా విస్తృత సమావేశం ఖమ్మం ఐడీవోసీలో బుధవారం నిర్వహించారు. 'రైతుభరోసా' క్యాబినెట్ సబ్ కమిటీ కన్వీనర్, ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సభ్యులు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం మూడు గంటలపాటు కొనసాగింది. వందలాది మంది రైతులు, రైతుసంఘాల నేతలు, రైతు ప్రతినిధులు, లాయర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, జర్నలిస్టులు, వివిధ వర్గాలకు చెందిన అనేక మంది ఈ సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించారు.

సాగుదారులందరికీ 'భరోసా' ఇవ్వాలి

ఎవరైతే సేద్యం చేస్తున్నారో.. ఎంత మొత్తం సాగు చేస్తున్నారో.. అన్ని ఎకరాలకూ 'రైతుభరోసా' పంట పెట్టుబడి సహాయం అందించాలని మెజార్టీ రైతులు, రైతుసంఘాల నేతలు తదితరులు అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు 2011లో కౌలుదారీ చట్టాన్ని అమలు చేశారని, దాన్ని యథాతథంగా అమలు చేయాలని తెలంగాణ రైతుసంఘం నాయకులు కోరారు. ఆ తర్వాత పది ఎకరాలకు కటాఫ్ విధిస్తే మంచిదని మెజార్టీ రైతులు అభిప్రాయపడ్డారు. ఇవేవీ లేకుండా పంట ఉత్పత్తులపై బోనస్, గతంలో లాగా మెరుగైన పంట దిగుబడి సాధించేందుకు ప్రోత్సాహకంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఇరిగేషన్, పైపులైన్లు, వ్యవసాయ యంత్ర పరికరాలకు సబ్సిడీ ఇవ్వాలని కోరారు. రైతుభరోసా, రైతుబీమాతో పాటు పంటనష్ట పరిహారం కూడా చెల్లించాలని కొందరు అడిగారు.

కౌలుదారులకు ఎలా చెల్లించాలి: ప్రశ్నించిన భట్టి

కౌలు రైతులకు ఎలా చెల్లించాలని మల్లు భట్టివిక్రమార్క రైతులను ప్రశ్నించారు. 2011 కౌలుదారీ చట్టాన్ని ఆచరణలో పెడితే ఇది సాధ్యమని తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు సూచించారు. కౌలుదారునికి పంటలపై బోనస్ ఇవ్వాలని కొందరు, ఎరువులు, క్రిమిసంహారక మందులకు సహాయం చేయాలని మరికొందరు వివరించారు. ఏడాది కాలపరిమితితో కౌలు రాయించుకునే విధానాన్ని అమలు చేయాలని ఇంకొందరు అభిప్రాయపడ్డారు.

ఆంధ్రా రైతులకు ఇక్కడ ఇవ్వొద్దు..

ఆంధ్రా రైతులకు తెలంగాణలో భూములుంటే 'రైతుభరోసా' ఇస్తున్నారని, తెలంగాణ రైతులకు ఆంధ్రాలో ఉంటే మాత్రం ఎలాంటి సహాయం అక్కడి ప్రభుత్వాలు ఇవ్వట్లేదని గుర్తుచేశారు. కాబట్టి ఆంధ్రా రైతులకు ఇచ్చే పెట్టుబడి సహాయాన్ని నిలిపివేయాలని కోరారు. అలాగే రెవిన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయలోపం కారణంగా కన్వర్షన్ కాకుండా ఉన్న రియల్ ఎస్టేట్ భూములు, ఆర్ఎస్ఆర్ పెరిగి డబుల్ ఎంట్రీలున్న భూములు, సాగు చేయని ఇతరత్ర భూములకూ రైతుభరోసా కట్ చేయాలని దాదాపు అందరూ అభిప్రాయపడ్డారు.

పూర్తిస్థాయి బడ్జెట్ సమయంలో రైతుభరోసా విధివిధానాలు: భట్టి

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి వచ్చిందని భట్టి గుర్తుచేశారు. కేంద్రం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రానికి వచ్చే నిధులకు అనుగుణంగా త్వరలోనే పూర్తిస్థాయి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతుందన్నారు. దీనికి ముందే విధివిధానాల రూపకల్పనపై ప్రభుత్వం క్యాబినెట్ సబ్‌కమిటీని తాను (భట్టి) కన్వీనర్‌గా, మంత్రులు తుమ్మల, పొంగులేటి, శ్రీధర్‌బాబు సభ్యులుగా ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ నాటికి రైతుభరోసా విధివిధానాల రూపకల్పనకు ఈ అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్టు వివరించారు.

ఐటీ పేయర్స్‌కు మాత్రమే 'భరోసా' ఉండదు: మంత్రి తుమ్మల

ఐటీ రిటర్న్స్, రేషన్‌కార్డు లేనివారికి రైతుభరోసా ఇవ్వరనే చర్చ నేపథ్యంలో పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు, విదేశాలకు వెళ్లాలన్నా.. ఇండ్ల నిర్మాణ రుణాల కోసం రైతులు ఐటీ రిటర్న్స్ కలిగి ఉంటారని వివరించారు. దీనిపై మంత్రి తుమ్మల స్పందించారు. ఐటీ పేయర్స్‌కు మాత్రమే భరోసా వర్తించదని సమాధానం ఇచ్చారు. రేషన్‌కార్డుతో నిమిత్తం లేదన్నారు. పేద రైతులకు భరోసా ఇవ్వడానికి ప్రభుత్వం విశాల దృక్పథంతో వ్యవహరిస్తుందని స్పష్టంచేశారు. గతంలో లోపాలు, ఆర్థిక నష్టాలు తలెత్తకుండా చిన్న, సన్నకారు రైతులకు చేయూతనివ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని తెలిపారు.

ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయీ ప్రజలదే: మంత్రి పొంగులేటి

రాష్ట్రప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయి వివిధ రూపాల్లో ప్రజలు చెల్లించిందేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ఏ పథకం చేపట్టినా నాలుగు గోడల మధ్య నిర్ణయాలు తీసుకున్నదని, ఎక్కడా ప్రజాభిప్రాయానికి చోటివ్వలేదని విమర్శించారు. ప్రతి పైసాపై లెక్కలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలోని మిగతా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లోనూ ఇదే రకంగా అభిప్రాయం తీసుకుంటామన్నారు. ఎవరికి సాయం చేస్తే రైతులు ఆనందంగా ఉంటారో వివరాలు సేకరించి అమలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, తెల్లం వెంకట్రావు, మాలోత్ రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వ్యవసాయ అధికారులు విజయనిర్మల, బాబూరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సన్నచిన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- భాగం హేమంతరావు, రైతుసంఘం నాయకులు

త్వరితగతిన ధరణి పెండింగ్ ఫైల్స్‌ను క్లియర్ చేసి వీలైనంత ఎక్కువ మంది సాగుదారులకు ఈ ఖరీఫ్ సీజన్ నుంచే లబ్ది చేకూర్చాలి. గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో అన్ని సబ్సిడీలు ఎత్తివేసింది. 0శాతం రుణాలను పూర్తిగా తీసి వేశారు. పంటల బీమా పథకాన్ని త్వరితగతిన అమలు చేయాలి. 25 లక్షలకు పైగా ఉన్న రియల్ ఎస్టేట్ భూములను రైతుభరోసా కింద తొలగించాలి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏ రకంగానైతే కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారో అదే విధంగా ఇప్పుడు కూడా ఇచ్చి 'భరోసా' కల్పించాలి. ఆర్బీఐ విధానం ప్రకారం 25 ఎకరాలకు పైబడిన రైతులు పెద్ద రైతుల కిందకు వస్తారు. కాబట్టి సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

పట్టాతో నిమిత్తం లేకుండా సాగు భూములకు ఇవ్వాలి..

మాదినేని రమేష్, బొంతు రాంబాబు, తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పట్టాతో నిమిత్తం లేకుండా సాగు భూములన్నింటికీ, సాగుదారులందరికీ భరోసా, బోనస్ ఇవ్వాలి. 2018 డిసెంబర్ 12కు ముందున్న పంట రుణాలను మాఫీ చేయాలి. గత ప్రభుత్వం మాఫీని సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల ఖమ్మం జిల్లాలో 9వేల మంది, కొత్తగూడెం జిల్లాలో 1600 మంది నష్టపోయారు. కాబట్టి రాష్ట్ర ఏర్పడిన నాటి నుంచి 2023 డిసెంబర్ 9కి ముందున్న రుణాలన్నింటినీ మాఫీ చేయాలని కోరుతున్నాం.

తాకట్టులో ప్రభుత్వ భూములా !

- పరిశ్రమలకేమిస్తారు? యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయి?: కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ భూములను ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీలకు తాకట్టు పెడితే పరిశ్రమలకు భూములెలా కేటాయిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ప్రశ్నించారు. బుధవారం ఆయన ఎక్స్ వేదికగా కాంగ్రెస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలకు భూములు కేటాయించకపోతే యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రేవంత్ సర్కారుకు రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం చేత కావడం లేదని విమర్శించారు. నిధుల సమీకరణకు ప్రమాదకరమైన మార్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర పరిశ్రమల శాఖకు చెందిన రూ.20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల భూములను తనఖా పెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించాలని కాంగ్రెస్ సర్కార్ భావిస్తున్నట్టు సమాచారం ఉందని చెప్పారు.. ఇందుకోసం మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను ఉపయోగించుకుని రూ.100 కోట్లు కమిషన్ ఇచ్చేందుకు సిద్ధపడిందని తెలిపారు. హస్తం నాయకుల మతిలేని చర్యల కారణంగా రాష్ట్ర ప్రగతి శాశ్వతంగా కుంటుపడుతుందని తెలిపారు. కొత్త పెట్టుబడులు, పరిశ్రమలు రాకుండా యువత ఉద్యోగావకాశాలు కోల్పేయే ప్రమాదముందని హెచ్చరించారు. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తుంటాయనీ కేటీఆర్ గుర్తుచేశారు. అలాంటి చోట 400 ఎకరాలు ప్రయివేటు సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య అని ఆక్షేపించారు. గత ఏడు నెలలుగా పారిశ్రామిక రంగం స్తబ్దుగా మారి, పెట్టుబడులు రాక, సరైన ప్రోత్సాహం లేక కంపెనీలు కూడా పక్కచూపులు చూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నేపథ్యంలో ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం పరిశ్రమలకు ఇచ్చే భూములు తాకట్టు పెట్టడం తగదని కేటీఆర్ హితవు పలికారు.

రైతులతో నేరుగా మాట్లాడండి

(మొదటిపేజీ తరువాయి)

శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. తల్లాడ-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్న కారణంగా, ప్రస్తుత ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు కోరుతున్నారని చెప్పారు. దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదన్నారు. జాతీయ రహదారిగానే దానిని కొనసాగించాలని మంత్రి తుమ్మల అభిప్రాయపడ్డారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న రహదారిలో పెద్ద గ్రామాలున్న చోట సర్వీసు రోడ్లు నిర్మించాలని సూచించారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా అవసరమైన చోట్ల అండర్‌పాస్‌లు నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్‌చౌదరి బదులిచ్చారు. జాతీయ రహదారుల వెంట రైతుల వాహనాలు, రైతులు వినియోగించుకునేలా మట్టి(గ్రావెల్) రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదన ప్రస్తావనకు వచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్‌చౌదరి తెలిపారు. మట్టి రోడ్లు నిర్మించడం వలన రైతులకు ఉపయోగపడడంతో పాటు భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు ఉండవని సీఎం అభిప్రాయపడ్డారు.

'సమన్వయంతో ముందుకు సాగండి'

ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల, విజయవాడ-నాగ్‌పూర్ కారిడార్ రహదారులకు సంబంధించి అటవీశాఖ భూముల బదలాయింపు సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి అధికారులు తెచ్చారు. దీనికి సీఎం స్పందిస్తూ అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని నిజామాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ విషయంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను అటవీ శాఖకు బదలాయించి అటవీ శాఖ భూములను తీసుకొని రహదారుల నిర్మాణానికి ఉన్న ఆటంకాలను తొలగించాలని సీఎం సూచించారు. వివిధ శాఖల పరిధిలోని యుటిలిటీస్ తొలగింపునకు సంబంధించి చెల్లింపులు వేగవంతం చేయాలనీ, ఏవైనా సమస్యలుంటే ఎన్‌హెచ్ఏఐతో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్-మన్నెగూడ రహదారి పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. అందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు అంగీకరించారు.

రెండు నెలల్లో హైదరాబాద్-విజయవాడ విస్తరణ పనులు

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల విస్తరణ పనులకు భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో వెంటనే పనులు చేపట్టాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్‌చౌదరిని కోరారు. రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన ఇందుకు బదులిచ్చారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ఓఎస్డీలు వి.శేషాద్రి, మాణిక్‌రాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసిం, మౌలిక వసతుల సలహాదారు కె.ఎస్ శ్రీనివాసరాజు, ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి రజాక్, పీసీసీఎఫ్ డోబ్రియల్, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీష్, మెదక్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నిజామాబాద్ కలెక్టర్లు పాల్గొన్నారు.

నేటినుంచి ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 అభ్యర్థులకు రీలింక్విష్‌మెంట్

- టీజీపీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మెడికల్ ఎడ్యుకేషన్‌లో ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులకు గురువారం నుంచి రీలింక్విష్‌మెంట్ (ఒక పోస్టును ఉంచుకుని మిగిలిన పోస్టులను వదులుకోవడం) సౌకర్యం ఇస్తున్నట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ తెలిపారు. ఈనెల 14న సాయంత్రం ఐదు గంటల వరకు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందుకు సంబంధించి www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో లింకు అందుబాటులో ఉందని వివరించారు. 200 ల్యాబ్‌టెక్నీషియన్ (గ్రేడ్-2 పోస్టుల భర్తీకి 2017, డిసెంబర్ 18న నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే.

అది ధృతరాష్ట్ర కౌగిలి !

న్యూఢిల్లీ : బీజేపీది ధృతరాష్ట్ర కౌగిలి అన్న నానుడి ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో మరోసారి రుజువైంది. పలు భాగస్వామ్య పక్షాలు కనుమరుగైపోగా, మరికొన్ని ప్రాభవాన్ని కోల్పోయాయి. రాష్ట్రాల్లో బీజేపీని వ్యతిరేకిస్తూ, కేంద్రంలో కొమ్ముకాసిన పార్టీలూ మట్టికరిచాయి. అవసరార్థం చేతులు కలిపిన టీడీపీ, జేడీయూ, ఎల్జేపీ పార్టీలే కమలదళాన్ని ఆదుకున్నాయి. అవి కూడా గతంలో బీజేపీపై కత్తులు నూరినవే. వివిధ రాష్ట్రాల నుండి వస్తున్న ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్లు ఇప్పుడు మోడీ-షా ద్వయానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

2014లో నరేంద్ర మోడీ తొలిసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు బీజేపీకి 24 మిత్రపక్షాలు ఉండేవి. ఆ తర్వాత వాటిలో పలు పార్టీలు ఎన్డీఏతో సంబంధాలు తెంచుకున్నాయి. మోడీ తన అవసరార్థమే పొత్తులు పెట్టుకుంటారని, అవసరం తీరిన తర్వాత కరివేపాకులా వదిలేస్తారని మిత్రపక్షాలు భావించడమే దీనికి కారణం.

నాడు సంకీర్ణ ధర్మాన్ని పాటించారు

అంతకుముందున్న ప్రభుత్వాలన్నీ సంకీర్ణ ధర్మాన్ని పాటించేవి. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కొద్దికాలమే అధికారంలో ఉన్నప్పటికీ కనీస ఉమ్మడి కార్యక్రమం ప్రకారం పాలన సాగించింది. భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయ కమిటీ ఉండేది. ఆ తర్వాత యూపీఏ కోసం వామపక్ష నేతలు, పి.చిదంబరం కలిసి కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కూటమికి కూడా సమన్వయ కమిటీ ఉండేది. అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో ఏర్పడిన తొలి ప్రభుత్వానికి పరిపాలనకు సంబంధించి జాతీయ అజెండా ఉంది. దీనిని జస్వంత్ సింగ్ రూపొందించారు. 1999లో ఈ అజెండాను సవరించారు. సమాఖ్య సామరస్యాన్ని కాపాడతామని, మైనారిటీలకు పూర్తి రక్షణ కల్పిస్తామని అందులో హామీ ఇచ్చారు. వాజ్‌పేయి రెండోసారి అధికారాన్ని చేపట్టినప్పుడు సమన్వయ కమిటీని ఏర్పాటు చేయలేదు. అయితే తరచూ మిత్రపక్షాలతో సమావేశమై వారి డిమాండ్లపై చర్చించే వారు.

అదే మోడీ తరహా పాలన

2014లో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమన్వయ కమిటీ ఊసే లేదు. భాగస్వామ్య పక్షాలతో కానీ, పార్టీ సహచరులతో కానీ చర్చించిన దాఖలాలూ లేవు. ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను ఆయనే నిర్ణయించారు. నిపుణుల కమిటీ రూపొందించిన విధానాలు, కార్యక్రమాలను ప్రభుత్వం తరఫున ఆయనే ప్రకటించే వారు. చివరికి అదే ఎన్డీఏ విధానమై పోయింది. భాగస్వామ్య పక్షాలు, చివరికి పార్టీ ఎంపీల మాటకు విలువే లేకుండా పోయింది. వారందరూ మోడీ చెప్పిన దానినే ప్రభుత్వ విధానంగా ఆమోదించే వారు. 2002లో గుజరాత్ మారణహోమం జరిగినప్పటి నుండి ఇదే మోడీ తరహా పాలన అయింది.

ఆయన వైఖరే కారణం

ఎన్డీఏను భాగస్వామ్య పక్షాలు విడిచిపెట్టడానికి మోడీ వైఖరే ప్రధాన కారణమని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడ్డారు. 2014, 2019లో మిత్రపక్షాల డిమాండ్లను మోడీ పెడచెవిన పెట్టారు. ఆయనకు సభలో పూర్తి మెజారిటీ ఉండడమే దీనికి కారణం. తమ మనుగడే ప్రశ్నార్థకం అవడంతో మిత్రపక్షాలు అనేక ఎన్డీఏకు గుడ్‌బై చెప్పాయి.



(ఫైల్)

బాబు వర్సెస్ షా

స్నేహబంధం చెడిపోయిన తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా, చంద్రబాబు కొన్ని నెలల పాటు పరస్పరం విమర్శలు, ఆరోపణలు చేసుకున్నారు. 2019లో షా మాట్లాడుతూ చంద్రబాబుకు ఎన్డీఏ తలుపులను శాశ్వతంగా మూసేశామని చెప్పారు. చంద్రబాబు త్వరలోనే ఎన్డీఏ గూటికి చేరతారని షా అంచనా వేశారు కానీ అది జరగలేదు. షా మాటకు ప్రతిగా చంద్రబాబు 'దక్షిణాదిన ఖాతా తెరిచేందుకు బీజేపీని ఎన్నటికీ అనుమతించం' అని భీషణ ప్రతిజ్ఞ చేశారు. చంద్రబాబు కంటే అతి పెద్ద అవకాశవాది మరొకరు ఉండరని షా ఎద్దేవా చేశారు. ఆయన పెద్ద అవినీతిపరుడని ఆరోపించారు. తన కుమారుడికి పదవులు కట్టబెట్టడం పైనే చంద్రబాబుకు ఆసక్తి ఎక్కువ అని విమర్శించారు. '2014కు ముందు ఈ అమిత్ షా ఎక్కడున్నారు? ఆయన చరిత్ర ఏమిటి? నేను చాలా మాట్లాడగలను. సరైన సమయంలో మాట్లాడతా' అని చంద్రబాబు ప్రతి సమాధానం ఇచ్చారు. ఇలా వారిద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఇప్పుడు ఇరు పక్షాలు మరోసారి చెట్టాపట్టాలు వేసుకొని తిరుగుతున్నాయి.

నాడు మోడీపై చంద్రబాబు విమర్శలు

ఇప్పుడు ఎన్డీఏతో జట్టు కట్టిన తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు 2018లో ఆ కూటమిని వదిలి పెట్టారు. మిత్రపక్షాలతో సమావేశం కావడానికి కూడా మోడీకి సమయం దొరకడం లేదని అప్పుడు చంద్రబాబు ఆరోపించారు. అంతేకాదు...మోడీ గర్విష్టి అని, నిరంకుశుడని నిందించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ ఎప్పటి నుండో డిమాండ్ చేస్తోంది. అందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. అప్పుడు చంద్రబాబు ఏమన్నారంటే 'మోడీ మిత్రపక్షాలకు హామీలు ఇస్తారు. ఆ తర్వాత వాటిపై వెనకడుగు వేస్తారు'.

దారుణంగా దెబ్బతిన్నాయి

సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ మాదిరిగానే దాని విధేయులైన మిత్రపక్షాలు కూడా ఎదురు దెబ్బలు తిన్నాయి. విశ్లేషణ కోసం బీజేపీ మిత్రపక్షాలను నాలుగు గ్రూపులుగా విభజిద్దాం. మొదటి గ్రూపులో బీజేపీతో సంవత్సరం, అంతకంటే ఎక్కువ కాలం స్నేహం చేసిన ఎన్సీపీ (అజిత్), శివసేన (షిండే), అసోం గణపరిషత్, తమిళనాడులోని మూడు అన్నా డీఎంకే వర్గాలు. ఈ పార్టీలన్నీ దారుణంగా దెబ్బతిన్నాయి.

ఈ మూడు పార్టీలే ఆదుకున్నాయి

రెండో గ్రూపులో ఉన్న పార్టీలు జేడీయూ, చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ, తెలుగుదేశం. ఈ మూడు పార్టీలు గతంలో ఎన్డీఏ మిత్రపక్షాలే. ఆ తర్వాత వివిధ కారణాలతో ఎన్డీఏకు గుడ్‌బై చెప్పాయి. ఈ మూడు పార్టీలతో ఎన్నికలకు ముందే బీజేపీ పొత్తు పెట్టుకుంది. ఈ పొత్తు సత్ఫలితాలను ఇచ్చింది. జేడీయూకు 12, టీడీపీకి 16, చిరాగ్ పార్టీకి ఆరు స్థానాలు లభించాయి. ఈ మూడు పార్టీల మద్దతు కారణంగానే బీజేపీ మ్యాజిక్ ఫిగర్‌ను దాటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

రాష్ట్రంలో కుస్తీ... ఢిల్లీలో దోస్తీ

ఇక మూడో గ్రూపులో వైఎస్సార్‌సీపీ, బిజూ జనతాదళ్, బీఆర్ఎస్ ఉన్నాయి. ఇవి ఆయా రాష్ట్రాల్లో అధికార పార్టీలు. అవి స్థానికంగా బీజేపీతో పోరాడినప్పటికీ పార్లమెంటులో కీలక సమయాలలో ఆ పార్టీకే కొమ్ము కాశాయి. ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూకాశ్మీర్‌కు లభించిన స్వయం ప్రతిపత్తి రద్దు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్ట సవరణలు, పౌరసత్వ సవరణ చట్టం ఓటింగుకు వచ్చినప్పుడు, అవిశ్వాస తీర్మానాల సమయంలో ఎన్డీఏకు మద్దతు తెలిపాయి. నవీన్ పట్నాయక్, జగన్ రెడ్డి, చంద్రశేఖర్ రావు ఏమి ఆశించి ఎన్డీఏకు మద్దతు ఇచ్చారో తెలియడం లేదు. ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలకు భయపడ్డారా? అధికార పక్షం వైపు ఉంటే సురక్షితమని భావించారా? కారణమేదైనా ఈ మూడు పార్టీలూ ఎన్డీఏకు మద్దతు ఇచ్చాయి. అయితే ఈ మూడింటినీ ఓటర్లు తిరస్కరించడం గమనార్హం. బీఆర్ఎస్, బీజేడీ పార్టీలకు లోక్‌సభలో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ కేవలం నాలుగు స్థానాలకే పరిమితమైంది. లోక్‌సభలో ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ ప్రతిపక్షం వైపే ఉంటానని పట్నాయక్ ఇప్పుడు చెబుతున్నారు. బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని కార్యకర్తలకు ఆయన ఉద్బోధించారు.

బీజేపీతో జట్టు కట్టి దారుణంగా దెబ్బతిన్న పార్టీలు

- పరోక్షంగా మద్దతు ఇచ్చిన పార్టీలకూ అదే గతి
- మట్టి కరిచిన మాజీ మిత్రులు
- ఆదుకున్నది ఆ మూడు పార్టీలే

ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్లతో తలనొప్పులు

ఇప్పుడు మళ్లీ చంద్రబాబు దగ్గరకు వద్దాం. ఆయన చాంతాండంత డిమాండ్ల చిట్టా పట్టుకొని రాజధానికి వచ్చారు. ప్రధానిని, మంత్రులను కలిసి విజ్ఞాపనలు అందించారు. ముఖ్యంగా ఆర్థికంగా దెబ్బతిన్న రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇవే రకమైన డిమాండ్లు వస్తున్నాయి. బీహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని జేడీయూ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. జేడీయూ డిమాండ్‌కు చిరాగ్ కూడా మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పాలనలోని కర్నాటక, వామపక్షాల ఏలుబడిలో ఉన్న కేరళ కూడా ప్రత్యేక ప్యాకేజీ కోసం డిమాండ్ చేస్తున్నాయి. 2020 నుండే ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, పంజాబ్, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ప్రత్యేక ప్యాకేజీని కోరుతున్నాయి. మోడీ-షా ద్వయానికి ఇప్పుడు ఈ ప్రత్యేక ప్యాకేజీ డిమాండే తలనెప్పి తెచ్చి పెడుతోంది.

ఈ పార్టీలూ మట్టి కరిచాయి

ఇక్కడ నాలుగో కేటగిరీ గురించి చెప్పుకుందాం. ఒకప్పుడు బలమైన అనుయాయులుగా ఉండి, ఆ తర్వాత అప్పుడప్పుడు మద్దతు ఇచ్చిన వారు ఈ కేటగిరీ కిందికి వస్తారు. 1996 నుండి శిరోమణి అకాలీదళ్ పార్టీ బీజేపీకి మిత్రపక్షంగా ఉంటోంది. 24 సంవత్సరాల పాటు బీజేపీకి మద్దతు ఇచ్చిన ఆ పార్టీ 2020 సెప్టెంబరులో రైతుల ఆందోళన నేపథ్యంలో దోస్తీ కటీఫ్ చెప్పింది. కానీ అప్పటికే ఆలస్యమైంది. బీజేపీతో సుదీర్ఘ కాలం చెలిమి చేయడంతో ఆ పార్టీ స్థానాన్ని వేరే పార్టీలు ఆక్రమించాయి. ఇప్పుడు వంద సంవత్సరాల నాటి ఆ పురాతన పార్టీ అంతర్గత కుమ్ములాటలతో విలవిలలాడుతోంది. తమిళనాట అన్నా డీఎంకే పరిస్థితి కూడా అలాగే ఉంది. ఆ పార్టీ చాలా కాలం పాటు బీజేపీ మిత్రపక్షంగా ఉంది. మోడీ అవలంబించిన విభజన రాజకీయాలు అన్నా డీఎంకే పునాదిని కదిలించాయి. ఈ పార్టీలోని కొన్ని చిన్న చిన్న గ్రూపులు ఇప్పటికీ బీజేపీకి మద్దతు ఇస్తుండగా ఎడపాడి పళనిస్వామి నేతృత్వంలోని బలమైన గ్రూపు గత సెప్టెంబరులో కమలదళంతో సంబంధాలు తెంచుకుంది. జమ్మూకాశ్మీర్‌లో ప్రభుత్వ ఏర్పాటు కోసం మహబూబా ముఫ్తి నేతృత్వంలోని పీడీపీ కమలదళంతో పొత్తు పెట్టుకుంది. కానీ అది ఎంతో కాలం సాగలేదు. 2018 జూన్‌లో ఆ సంకీర్ణానికి తెర పడింది.

సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ పూర్తిగా కనుమరుగు కావడానికి వేరే కారణాలు ఉన్నాయి. ఈడీ, సీబీఐ భయంతో ప్రతిపక్షాల ఓట్లు చీల్చి, బీజేపీకి లబ్ది చేకూర్చేందుకు బీఎస్పీ అధినేత్రి మాయావతి అభ్యర్థులను నిలిపారు. ఫలితంగా ఒకప్పుడు యూపీలో అధికార పార్టీగా ఉన్న బీఎస్పీ 2.04 శాతం ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆ పార్టీకి దిగువసభలో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. హర్యానాలో బీజేపీకి చాలా కాలం నుండి మిత్రపక్షంగా ఉన్న దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జేజేపీ పార్టీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది.

అనసూయ కాదు..

ఇక అనుకతిర్ సూర్య

- లింగమార్పిడి చేయించుకున్న సివిల్స్ అధికారి
- ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్




తెలంగాణ క్యాడర్‌కు చెందిన సివిల్ సర్వీస్ అధికారి ఎం.అనసూయ తన పేరును ఎం. అనుకతిర్ సూర్యగా మార్చుకున్నారు. లింగమార్పిడి ఆపరేషన్ చేయించుకున్న తర్వాత తన పేరును అనుకతిర్ సూర్యగా మార్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం ఎదుట తన అభ్యర్థన ఉంచారు. దీనికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇక నుంచి ఆమె మిస్ కాకుండా మిస్టర్ కానున్నారు. ప్రస్తుతం అనుకతిర్ సూర్య హైదరాబాద్‌లోని కస్టమ్స్ ఎక్సైజ్‌తో పాటు సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి సర్టిఫికేట్‌లోనూ మిస్ బదులు మిస్టర్‌గా మార్చుకోవాల్సి ఉంటుంది. తమిళనాడుకు చెందిన ఈ ఐఆర్ఎస్ అధికారి అనుకతిర్ సూర్య చెన్నైలోనే విద్యాభ్యాసం పూర్తి చేశారు. మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. భోపాల్‌లోని నేషనల్ లా ఇనిస్టిట్యూట్ యూనివర్సిటీ నుంచి సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్‌లో పీజీ డిప్లొమా పూర్తి చేశారు. ఆ తరువాత సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సీ అండ్ ఐటీలో తొలిసారి తన వృత్తిలోకి అడుగు పెట్టారు. కెరీర్ ప్రారంభంలో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత 2018లో డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. 2023లో అనుకతిర్ హైదరాబాద్‌లోని సీఈఎస్‌టీఏటీ (కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్)లో పదవీ బాధ్యతలు స్వీకరించి ప్రస్తుతానికి అందులోనే కొనసాగుతున్నారు. సివిల్ సర్వీసెస్ అయిన ఆమె లింగమార్పిడి చేయించుకుని కొత్త చరిత్ర సృష్టించారు.

యూరోపియన్ పార్లమెంట్‌లో గణనీయ శక్తిగా

కొత్త మితవాద గ్రూపు

- ఈయూ దిశను ప్రభావితం చేస్తుందంటున్న నిపుణులు

బ్రస్సెల్స్ : యురోపియన్ పార్లమెంట్‌లో కొత్తగా ఏర్పడిన మితవాద పేట్రియాట్స్ ఫర్ యూరప్ అలయన్స్‌కు యురోపియన్ యూనియన్ పంథాను ప్రభావితం చేసేంత సామర్థ్యం వుందని నిపుణులు పేర్కొంటున్నారు. అధికారికంగా సోమవారం ఏర్పడిన ఈ అలయన్స్ 10వ యూరోపియన్ పార్లమెంట్‌లో మూడవ అతిపెద్ద రాజకీయ గ్రూపుగా మారింది. వచ్చే వారం ఈ గ్రూపు మొదటి ప్లీనరీ సమావేశం జరగనుంది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడిగా ఉర్సులా వాన్ డెర్ లేయన్ తిరిగి రెండో పదవీ కాలానికి ఎన్నికవుతారా లేదా అనే అంశంపై ఈ సమావేశంలో ఓటింగ్ జరగనుంది. ఈ గ్రూపులో 12 ఇయు సభ్య దేశాల నుండి 84మంది యూరోపియన్ పార్లమెంట్ సభ్యులున్నారు.



విక్రమ్

బంగారం కోసం వేట..

విక్రమ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. ఈ చిత్రాన్ని దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్నారు. నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్థ ఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా త్వరలోనే వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. బుధవారం ఈ చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

'బ్రిటీష్ పాలనా కాలంలో కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో బంగారం కోసం వేట మొదలుపెడతారు బ్రిటీష్ అధికారులు. స్థానిక తెగల వారిని బంగారం వెలికి తీసేందుకు పనిలో పెట్టుకుంటారు. ఒక తెగ నాయకుడిగా విక్రమ్‌ను చూపించారు. ఈ బంగారం వేటలో రెండు తెగల మధ్య పోరు మొదలవుతుంది. తన వారిని కాపాడుకునేందుకు ఎంతటి సాహసానికైనా వెనకడుగు వేయని నాయకుడిగా విక్రమ్ చూపించిన భావోద్వేగాలు ఆకట్టుకుంటున్నాయి. విక్రమ్ ఈ పాత్ర కోసం మారిపోయిన తీరు కూడా ఆశ్చర్యపరుస్తోంది. విక్రమ్ బ్లాక్ పాంథర్‌తో చేసిన ఫైట్స్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చరిత్రలోని వాస్తవ ఘట్టాలను దర్శకుడు పా రంజిత్ తన సినిమాటిక్ యూనివర్స్‌లో ఆసక్తికరంగా తెరకెక్కించినట్లు ట్రైలర్‌తో తెలుస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు త్వరలోనే ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది అని చిత్ర బృందం తెలిపింది.

పొలిమేర 3



టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ హర్రర్ థ్రిల్లర్ 'పొలిమేర 3' అనౌన్స్‌మెంట్ వచ్చేసింది. ఈ చిత్రానికి అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించనున్నారు.

నిర్మాత భోగేంద్ర గుప్తాతో కలిసి వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై వంశీ నందిపాటి దీన్ని నిర్మించనున్నారు.

ఈ సిఇనమా అనౌన్స్‌మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన వీడియో అందరిలోనూ ఆసక్తి కలిగిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తయ్యింది. ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభించబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఇందులో సత్యం రాజేష్, బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, చిత్రం శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటించనున్నారు. 'మా ఊరి పొలిమేరకి వచ్చిన రెస్పాన్స్‌తో సీక్వెల్‌గా 'పొలిమేర2' రూపొందించారు. ఈ సినిమా సైతం విశేష ఆదరణ పొందడంతో మేకర్స్ 'పొలిమేర 3'ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. నిర్మాత ఐ.భరత్



రవికృష్ణ, భరత్

వాస్తవ సంఘటనతో..

స్ట్రాంగ్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రం 'ద బర్త్‌డే బాయ్'. రవికృష్ణ, సమీర్ మళ్ల, రాజీవ్‌కనకాల ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో పలువురు నూతన నటీనటులు నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని బొమ్మ బొరుసా పతాకంపై ఐ.భరత్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి విస్కి దర్శకుడు.

ఈనెల 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ట్రైలర్ విడుదల వేడుక బుధవారం వినూత్నంగా ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ,'యదార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్ర కథ రాసుకున్నాను. నా జీవితంలో తొమ్మిది సంవత్సరాల క్రితం జరిగిన ఓ సంఘటనకు కథ రూపం ఇది' అని తెలిపారు. 'ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతి పాత్ర ఎంటర్‌టైన్ చేస్తుంది. ప్రతి సన్నివేశం కొత్తగా ఉంటుంది. ఎం.ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లినప్పుడు ఐదుగురు చిన్ననాటి స్నేహితులకు జరిగిన సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఐదుగురు స్నేహితులకు ఎదురైన అనుభవాలు, వాటి పర్యవసానాలు చాలా ఆసక్తికరంగా వుంటాయి.ఈ సినిమా సహజత్వం కోసం సింక్ సౌండ్ వాడాం. కంటెంట్‌తో పాటు మంచి టెక్నికల్ వాల్యూస్‌తో ఈ చిత్రం ఉండబోతుంది' అని నిర్మాత ఐ.భరత్ చెప్పారు.

నవచిత్రం

క.. భారీ పీరియాడిక్ థ్రిల్లర్




చింతా గోపాలకృష్ణారెడ్డి, కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. బుధవారం ఈ సినిమాకు 'క' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ అనౌన్స్ చేశారు. టైటిల్ అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో కిరణ్ అబ్బవరం మేకోవర్ ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమాను శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దీన్ని రూపొందిస్తున్నారు.

ఈ సినిమా చిత్రీకరణ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో ఈ సినిమాను తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురాబోతున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ - సుధీర్ మాచర్ల, సినిమాటోగ్రఫీ - విశ్వాస్ డానియేల్, మ్యూజిక్ - సామ్ సీఎస్, దర్శకత్వం - సుజీత్, సందీప్.

కేస్ నెం.15 రిలీజ్‌కి రెడీ



అజయ్

అజయ్, రవిప్రకాశ్, హర్షిణి, మాండవియా సెజల్, చమ్మక్ చంద్ర, చిత్రం శ్రీను ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'కేస్ నెం.15'. బీజీ వెంచర్స్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో తడకల వంకర్ రాజేశ్ రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఈ సందర్భంగా తడకల వంకర్ రాజేశ్ మాట్లాడుతూ, 'సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ ఇది. బలమైన కథాంశంతో తెరకెక్కించిన ఈ చిత్రంలోని సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి. అజయ్‌కి మంచి పేరు వస్తుంది. రవిప్రకాశ్ ఓ డిఫరెంట్ పోలీసాఫీసర్ పాత్ర చేశారు. జాన్ మంచి సంగీతం ఇచ్చారు. సినిమాలో ఉన్న ఒకే ఒక్క పాటకు మంచి స్పందన లభించింది. ఆనం వెంకట్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ ఇచ్చారు. ఎక్కడా రాజీపడకుండా నిర్మించిన ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చే విధంగా ఉంటుంది' అని తెలిపారు.

ఆలోచనల నేపథ్యంలో

ఆపరేషన్ రావణ్



రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్

రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'ఆపరేషన్ రావణ్'. ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట సత్య రూపొందిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆగస్టు 2న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ వస్తోంది.

ఈ సందర్భంగా బుధవారం ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ వేడుకను మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీపాల్ చొల్లేటి మాట్లాడుతూ, 'ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేయడం హ్యాపీగా ఉంది. సినిమా బాగా వచ్చింది' అని తెలిపారు.

'ట్రైలర్ మీకు నచ్చిందని ఆశిస్తున్నా. ఇందులో నేను టీవీ రిపోర్టర్ పాత్రలో కనిపిస్తా. మీ అందర్ని మెప్పించే సినిమా ఇది' అని హీరోయిన్ సంగీర్త విపిన్ చెప్పారు.

డైరెక్టర్ వెంకట సత్య మాట్లాడుతూ, 'మన ఆలోచనల ప్రభావం వల్లే మనం మంచి వాళ్లా లేక చెడ్డ వాళ్లా అనేది నిర్ణయించడం జరుగుతుంది. ఆ పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించాను. ఫస్ట్ టైమ్ ఆలోచనలను విజువల్‌గా తెరపై చూపించబోతున్నా. మా అబ్బాయిని డైరెక్ట్ చేస్తున్నా అనే విషయం నన్ను పెద్దగా ప్రభావితం చేయలేదు. రక్షిత్ బాగా నటించాడు' అని తెలిపారు. "పలాస' తర్వాత మా ప్రొడక్షన్‌లోనే సైకో థ్రిల్లర్ మూవీ చేద్దామని స్టోరీ లైన్ అనుకున్నాం. అప్పుడు నాన్న ఈ సినిమాకు డైరెక్షన్ చేయాలని డిసైడ్ అయ్యారు. ఈ సినిమాతో మేం సక్సెస్ అందుకోబోతున్నాం. అని హీరో రక్షిత్ అట్లూరి చెప్పారు.

ఈ సినిమా ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది. హీరో రక్షిత్ వాళ్ళ నాన్న వెంకట సత్య చాలా ప్యాషన్‌తో ఈ సినిమాకి డైరెక్ట్ చేశారని తెలుస్తోంది. 'పలాస' సినిమాతో రక్షిత్‌కి మంచి పేరొచ్చింది. ఈ సినిమాతో మరోసారి రిస్క్ చేస్తున్నారు. రిస్క్ చేసినప్పుడే సక్సెస్ మన దగ్గరికి వస్తుందనేది నా నమ్మకం. ఆ నమ్మకం ఈ సినిమా విషయంలో నిజం కావాలని ఆశిస్తున్నా.

- హీరో విశ్వక్‌సేన్



ప్రతి ఇంటి కథ

రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో సాయిజా క్రియేషన్స్ పతాకంపై చల్లపల్లి చలపతి రావు దివ్య ఆశీస్సులతో ఉమాదేవి, శరత్ చంద్ర నిర్మాతలుగా పద్మారావు అబ్బిశెట్టి (అలియాస్ పండు) దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'సారంగ దరియా'.

ఈ సినిమాను ఈనెల 12న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు హీరో నవీన్ చంద్ర ముఖ్య అతిథిగా విచ్చేసి బిగ్ టికెట్‌ను కొనుగోలు చేశారు. రాజా రవీంద్ర మాట్లాడుతూ,' మా డైరెక్టర్ సినిమా గురించి ట్రైలర్‌లోనే మొత్తం చెప్పేశాడు. ఫెయిల్యూర్ అనేది చాలా డేంజర్ అని చూపించాడు. ఈ చిత్రంలో నాకు ముగ్గురు కొడుకులుంటారు. ఒక్కొక్కరికి ఒక్కో సమస్య ఉంటుంది. కాలేజ్ లెక్చరర్‌గా పని చేసి అందరికీ నీతులు చెబుతాను. కానీ నా ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతాను. సోషల్ మీడియా, ప్రస్తుత బిజీ లైఫ్‌లో తల్లిదండ్రులు, పిల్లల మధ్య రిలేషన్ సరిగ్గా ఉండటం లేదు. కలిసి కూర్చుని మాట్లాడుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి టైంలో పిల్లలు చెడు బాట పట్టొచ్చు. పిల్లలకు తల్లిదండ్రులు మోరల్ సపోర్ట్ ఇస్తే కచ్చితంగా విజయం సాధిస్తారు' అని అన్నారు.

'మా డైరెక్టర్ పండు వచ్చాకే ఈ సినిమా టీమ్ ఫామ్ అయింది. ఈ చిత్రానికి మహేష్ చాలా కష్టపడ్డాడు. మా మ్యూజిక్ డైరెక్టర్ ఎపి చాలా మంచి సంగీతాన్ని ఇచ్చారు. డీఓపీ సిద్దు పీసీ శ్రీరామ్ వద్ద పని చేశారు. రాంబాబు, కడలి అద్భుతమైన లిరిక్స్ ఇచ్చారు. రాజా రవీంద్ర చాలా సపోర్ట్ చేస్తున్నారు' అని నిర్మాత శరత్ చంద్ర చల్లపల్లి చెప్పారు.

దర్శకుడు పండు మాట్లాడుతూ, 'సమానత్వం అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రాబోతోంది. నన్ను నమ్మి చిత్రాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చిన నిర్మాతలు శరత్‌కి, ఉమాదేవీకి థ్యాంక్స్. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా ఉంటుంది' అని తెలిపారు. 'నాకు ఈ చిత్రంలో పండు మంచి పాత్రను ఇచ్చారు.

మేనేజర్ అయిన నన్ను మా నిర్మాత ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా మార్చారు. మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని ఎగ్జిక్యూటివ్ నిర్మాత మహేష్ చెప్పారు.

సంపాదకీయం

రష్యా పర్యటనపై పశ్చిమ దేశాల అక్కసు!



ప్రధాని నరేంద్రమోడీ సోమ, మంగళవారాల రష్యా పర్యటన ముగిసింది. రక్షణ ఒప్పందంతో సహా పూర్వపు సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైనా నాడు ఏర్పడిన బంధం తరువాత రష్యాతో కూడా జయప్రదంగా కొనసాగుతున్నది. పాకిస్థాన్‌కు ఆధునిక ఆయుధాలు ఇచ్చి మన మీద ఉసికొల్పిన అమెరికాకు పోటీగా మనకు అవసరమైన మిలిటరీ సాయంతో పాటు అంతరిక్ష ప్రయోగాలలో కీలకమైన క్రయోజెనిక్ ఇంజన్ల పరిజ్ఞానంతో సహా అనేక రంగాలలో రష్యాతో మన అనుబంధం కొనసాగుతోంది. ఉక్కు, ఔషధ, ఇతర రంగాలలో మనం పొందిన సాయం కూడా తక్కువేమీ కాదు. ఇప్పటికీ మిలిటరీ ఆయుధాలు, పరికరాల అంశంలో రష్యాపైనే ప్రధానంగా ఆధారపడుతున్నాము. ప్రపంచ శ్రేణి క్షిపణి బ్రహ్మోస్ తయారీలో రష్యా భాగస్వామిగా ఉంది. ఎకె రకం మరతు పాకుల తయారీలో భాగ స్వామ్యం గురించి... ఇలా చెప్పుకుంటూపోతే పెద్ద గ్రంథమే అవుతుంది. ఇంతగా పెనవేసుకుపోయిన రెండు దేశాలనూ విడదీయాలని, తన ఆయుధాలను మనకు అంటగట్టాలని గడచిన మూడు దశాబ్దాలుగా అమెరికా చేయని ప్రయత్నం లేదు. ఈ పూర్వరంగంలో మోడీ పర్యటనకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ పర్యటన ద్వారా పశ్చిమ దేశాల పాటలకు అనుగుణంగా భారత్ నృత్యం చేసేందుకు సిద్ధంగా లేదన్న సందేశం పంపినట్లుగా చెప్పవచ్చు. దీని అర్థం వాటి నుంచి దూరంగా జరిగిందని భావించకూడదు.

> నాటో కూటమి 75వ సమావేశాలు వాషింగ్టన్‌లో జరుగుతున్న తరుణంలో మూడవసారి అధికారానికి వచ్చిన నరేంద్ర మోడీ తన తొలి విదేశీ పర్యటనకు రష్యాను ఎంచుకోవటాన్ని పశ్చిమదేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. భారత్-రష్యా-చైనా సంబంధాలను దెబ్బతీసేందుకు తంపులు పెట్టాలని చూస్తోందని, అమెరికా, ఇతర పశ్చిమదేశాల వలలో పడొద్దని చైనా సూచిస్తోంది. ఉక్రెయిన్ సమస్య నాటో విస్తరణతో లింకు అయి ఉందన్న విషయం గమనంలో పెట్టుకుని, రష్యా-ఉక్రెయిన్ సమస్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పడం సబబే.

గడచిన ఏడున్నర దశాబ్దాల చరిత్రను చూసినపుడు కొన్ని సందర్భాలలో ఏదో ఒక శిబిరం వైపు మొగ్గుచూపినట్లు కనిపించినా, ఆమేరకు కొన్ని చర్యలున్నా భారత పాలకవర్గాలు అలీన విధానం పాటిస్తూ అటు సోషలిస్టు శిబిరం, ఇటు పెట్టుబడిదారీ కూటమి నుంచి కూడా లబ్ధిపొందేందుకు చూడటం తెలిసిందే. ఉదాహరణకు చైనాకు వ్యతిరేకంగా అమెరికా మనలను తన వైపు లాగేందుకు చూస్తున్నది. దానిలో భాగంగానే అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన కూటమి, క్వాడ్ (చతుష్టయం)లో భారత్‌ను కూడా చేర్చుకున్నారు. అయితే 2020లో గాల్వన్ సరిహద్దు ఘర్షణ తరువాత చైనాతో శాశ్వత శత్రుత్వంలో ఉంటుందనుకున్నవారి ఆశలు ఫలించలేదు. చైనా నుంచి దిగుమతుల అంశంలో నరేంద్రమోడీ తన రికార్డులను తానే బద్దలు కొట్టారు. పెట్టుబడులను అడ్డుకొనేందుకు చూసినా తాజాగా విద్యుత్ వాహనాల రంగంలో చైనా పెట్టుబడులను కూడా అనుమతించేందుకు వైఖరిని మార్చుకున్న సంగతి తెలిసిందే. ఇది మన కార్పొరేట్ల ప్రయోజనాల కోసమని వేరే చెప్పనవసరం లేదు. ఇదే విధంగా ఉక్రెయిన్ సంక్షోభంలో తటస్థంగా ఉన్నప్పటికీ పశ్చిమ దేశాల ఆంక్షలు, బెదిరింపులను ఖాతరు చేయకుండా రష్యా నుంచి చౌకధరలకు మనదేశం చమురు కొని పరోక్షంగా రష్యాను ఆర్థికంగా ఆదుకున్నది. దీన్ని పశ్చిమ దేశాలు మింగా కక్కలేకుండా ఉన్నాయి. మన కార్పొరేట్లు రష్యా చమురు ఉత్పత్తులను చౌకధరలకు ఐరోపా దేశాలకు విక్రయించి లబ్ధిపొందుతున్నాయి.

అమెరికాతో వ్యూహాత్మకంగా, రష్యాతో రక్షణ భాగస్వామిగా సంబంధాలు కలిగిన ఏకైక దేశం మనదేశమే. అంతర్జాతీయ రాజకీయాల్లో అటు అమెరికా, ఇటు రష్యా తమవైపు తిప్పుకొనేందుకు రెండూ ప్రయత్నిస్తున్నాయి. కొన్ని అంశాల్లో గత యుపిఏ, ప్రస్తుత మోడీ సర్కార్ అమెరికాతో అంటకాగేందుకు కొన్ని ఒప్పందాలు చేసుకున్నప్పటికీ కొన్ని సందర్భాలలో దాని ఒత్తిడికి లొంగటం లేదు. ఉక్రెయిన్ సంక్షోభంలో తమవైపునకు రానందుకు మన మీద అమెరికాకు పీకల దాకా కోపం ఉన్నప్పటికీ కొన్ని అంశాలలో తనకు అనుకూలంగా ఉన్నందున అది బయటపడకుండా తమాయించుకుంటున్నది. ఎక్కడ రష్యా వైపు మొగ్గుతామోనన్న భయంతో లేదా ఇతర కారణాలతో గానీ ఉక్రెయిన్ సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతల విషయంలో ఐరాస నిబంధనలకు భారత్ కట్టుబడి ఉండాలని మోడీ రష్యా పర్యటన సందర్భంగా అమెరికా బహిరంగంగానే వినతి పూర్వక హెచ్చరిక చేసింది. రష్యాతో సంబంధాలపై తమకున్న ఆందోళనలతో సహా అనేక అంశాలపై ఎలాంటి శషభిషలు లేకుండా భారత్‌తో చర్చించినట్లు అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. రష్యాతో వ్యవహరించే ఏదేశానికైనా తాము ఇదే చెబుతామన్నాడు.

నాటో కూటమి 75వ సమావేశాలు వాషింగ్టన్‌లో జరుగుతున్న తరుణంలో మూడవసారి అధికారానికి వచ్చిన నరేంద్ర మోడీ తన తొలి విదేశీ పర్యటనకు రష్యాను ఎంచుకోవటాన్ని పశ్చిమదేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. భారత్-రష్యా-చైనా సంబంధాలను దెబ్బతీసేందుకు తంపులు పెట్టాలని చూస్తోందని, అమెరికా, ఇతర పశ్చిమదేశాల వలలో పడొద్దని చైనా సూచిస్తోంది. ఉక్రెయిన్ సమస్య నాటో విస్తరణతో లింకు అయి ఉందన్న విషయం గమనంలో పెట్టుకుని, రష్యా-ఉక్రెయిన్ సమస్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పడం సబబే. అంతమాత్రం చేత రష్యా నుండి మన దేశానికి అవసరమైన ఒప్పందాలు చేసుకోవడాన్ని తప్పుపట్టలేము.

‘నీరో’ రాజ్యంలో మణిపూర్



(సమయం: జూలై 1, అర్ధరాత్రి 11.49 గంటలు.
స్థలం: లోక్‌సభ, ఢిల్లీ.
ప్రసంగిస్తున్నది : ఇన్నర్ మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్)

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్: మిస్టర్ చైర్‌పర్సన్ సర్, ఇప్పుడు సమయం ఇచ్చినందుకు ధన్యవాదాలు... (అంతరాయం) భారతదేశ చరిత్రలో కష్ట కాలాన్ని గురించి మాట్లాడేటందుకు- ఇలా గతంలో ఎప్పుడూ జరిగి ఉండలేదు - దానిని మణిపూర్ విషాదం అని పిలవచ్చు, నేను ప్రసంగించడానికి లేవగానే ప్రభుత్వం నా నోరు నొక్కేందుకు చూస్తున్నది...(అంతరాయం) ఇంతటి ప్రాముఖ్యంవున్న విషయాన్ని నిశ్శబ్దంలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తుంటే, అర్ధరాత్రి సమీపిస్తుండగా దానిపై ప్రసంగించేందుకు అవకాశం రావడం ఒక ఎగతాళి. నా స్వరాష్ట్రంలోని ప్రజలు ఢిల్లీలో ఉన్న కాలం కంటే రెండు గంటలు ముందు ఉంటారన్న విషయం గుర్తుకొస్తున్నది.

ఢిల్లీ పాటకు మేము డాన్స్ చేస్తున్నాము, సమయం ఇప్పుడు (రాత్రి) 12 గంటలకు దగ్గరగా వుంది..

జాహ్ను బారువా, అతని లాంటి ఇతరులు ఎన్నో ఏళ్లగా ఈశాన్యానికి ప్రత్యేకమైన టైమ్‌జోన్ కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే, అప్పుడు మాత్రమే మేము గౌరవంగానూ, క్షేమంగానూ ఉండగలం. అయితే, నేను మాట్లాడటానికి అవకాశం ఉన్నదని గ్రహించగలగటమే ఈ క్షణాన నాకున్న ప్రాధాన్యత.

మిస్టర్ చైర్మన్, రాష్ట్రపతి ప్రసంగంలో మణిపూర్ లేదన్న విషయం మీ దృష్టికి తెస్తున్నాను. ఇదేదో పొరపాటున తప్పిపోవటం కాదు. ప్రజలను మినహాయించే జాతీయ స్వఅహతో ఇది జరిగిందని గుర్తు చేస్తున్నాను. గతేడాది కాలంగా దుర్భరమైన పరిస్థితుల్లో 60 వేల మంది ప్రజలు దైన్య, దీన స్థితిలో ఉన్నారని మీరు తెలుసుకోవాలి. నేను ఒక పరిశోధన అంశానికి సహాయపడుతుండే వాడిని. 1947 విభజన సమయంలో బతికి బట్టకట్టిన 1500 మందిని మేము ఇంటర్వ్యూ చేశాం. అటువంటి పరిస్థితుల్లోనే ఇప్పుడు ఇక్కడ బతుకుతున్నారని మేము చూశాము. వాటిని అన్ని నేను ఇక్కడ పేర్కొనలేను. సర్, 60 వేల మంది ప్రజలు నిర్వాసితులుగా మారారు అంటే అది తేలికగా తీసుకునే విషయం కాదు. 200 మందికి పైగా చనిపోయారు. అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. తమ గ్రామాల రక్షణ కోసం ప్రజల ఆయుధాలు పట్టుకొని తిరుగుతున్నారు, ఒకరితో ఒకరు పోట్లాడుకుంటున్నారు. గతేడాదిగా ఉన్న ఈ విషాదానికి భారత రాజ్యం మౌన ప్రేక్షకుడిలాగా వుంటున్నది.

> మణిపూర్‌లోని ప్రతి సెంటీమీటర్‌లో సాయుధ బలగాలు కేంద్ర మోహరించి ఉన్నాయని ఈ సభకు గుర్తు చేస్తున్నాను. దేశంలో అత్యధిక సైనికీకరణ జరిగిన ప్రాంతాల్లో ఇది ఒకటి. సాయుధ బలగాలే కాక, ఇక్కడ సివిల్ పోలీసులకన్నా, ఎక్కువమంది సాయుధ పోలీసులు ఉన్నారు. ఇంతమంది ఉన్నప్పటికీ, 60 వేల మంది ఎలా నిరాశ్రయులు అయ్యారు? పల్లెలు, ఇండ్లు ఎలా ధ్వంసమయ్యాయి?ఇప్పటికీ ప్రధానమంత్రి మౌనముద్రలో ఉన్నారు. ఆయననోటి నుంచి ఒక్క మాట కూడా రాలేదు. దేశ అధ్యక్షుల వారి ప్రసంగంలో కూడా దీని సంగతి లేదు. ఈ మౌనం మామూలుది కాదని నేనంటాను. వలసపాలన నుంచి వలస అనంతర పాలనకు మధ్య కొనసాగింపు ఇది అని అనేకమంది మేధావులు చెప్పిన విషయం గుర్తు చేస్తున్నది.

మణిపూర్‌లోని ప్రతి సెంటీమీటర్‌లో సాయుధ బలగాలు కేంద్ర మోహరించి ఉన్నాయని ఈ సభకు గుర్తు చేస్తున్నాను. దేశంలో అత్యధిక సైనికీకరణ జరిగిన ప్రాంతాల్లో ఇది ఒకటి. సాయుధ బలగాలే కాక, ఇక్కడ సివిల్ పోలీసులకన్నా, ఎక్కువమంది సాయుధ పోలీసులు ఉన్నారు. ఇంతమంది ఉన్నప్పటికీ, 60 వేల మంది ఎలా నిరాశ్రయులు అయ్యారు? పల్లెలు, ఇండ్లు ఎలా ధ్వంసమయ్యాయి? ఇప్పటికీ ప్రధానమంత్రి మౌనముద్రలో ఉన్నారు. ఆయననోటి నుంచి ఒక్క మాట కూడా రాలేదు. దేశ అధ్యక్షుల వారి ప్రసంగంలో కూడా దీని సంగతి లేదు. ఈ మౌనం మామూలుది కాదని నేనంటాను. వలసపాలన నుంచి వలస అనంతర పాలనకు మధ్య కొనసాగింపు ఇది అని అనేకమంది మేధావులు చెప్పిన విషయం గుర్తు చేస్తున్నది.

ఈరోజు వలసపాలన కాలం నాటి వారసత్వాన్ని వదిలించుకొని కొత్త క్రిమినల్ చట్టాలను తెచ్చుకున్న రోజు. కానీ, అశీష్ నంది చెప్పినట్టు, వలసవాదం అనేది బుద్ధికి సంబంధించింది, ఇది ఒక మానసిక ధోరణి, అదొక దృక్కోణం,ప్రజలను అర్థం చేసుకునే దృష్టి, ప్రపంచం ఏమిటో తెలుసుకునే దృష్టి. సత్యం ఏమిటంటే,19వ రాష్ట్రంగా వున్న (మణిపూర్)రాష్ట్ర విషాదం పట్ల నిర్లక్ష్య ప్రదర్శన కొనసాగిస్తూ, మణిపూర్ రాష్ట్రం స్వదేశీ పౌరులకు ఈ తిరస్కరణ వలన వారికి కలిగిన ఆగ్రహాన్ని ఆవేదాన్ని నడిరాత్రి సమీపిస్తుండగా చెప్పే అవకాశం నాకు కలగటం మహాద్భుతం.

ఈ సభను గట్టిగా ప్రశ్నిస్తున్నాను. భారతదేశ రాష్ట్రాలకు సంబంధించి మీరు మాకు అవసరం లేదని ఈ మూగ సమాచారం ద్వారా ఈశాన్య రాష్ట్ర ప్రజలకు, మరీ ముఖ్యంగా మణిపూర్ ప్రజలకు చెప్పాలనుకుంటున్నారా? ఆత్మాహుతి బాంబర్‌తో పెనుగులాడిన, అశోక చక్ర అవార్డు గ్రహీత మేజర్ లయిష్ రామ్ మణిపూర్‌వాడు. అతను అశోక్ చక్ర అవార్డు పొందాడు. మీరు అతని రాష్ట్రాన్ని అవమాన పరుస్తున్నారు. శ్రీలంకలో శాంతి దళంలో ఈ దేశం తరపున పని చేస్తూ కర్తవ్య నిర్వహణలో ప్రాణం కోల్పోయిన మేజర్ ఎన్గంగోమ్ జాయ్ దత్తా వీర చక్ర అవార్డు పొందాడు. మీరు అతన్ని అగౌరవ పరుస్తున్నారు. మేరికోమ్, సరితా కుంజారాణి, మీరాబాయి చాను లాంటి వారిని, మీరు ఈ దేశానికి అవసరం లేదని, మీ రాష్ట్రం మాకు అవసరం లేదని చెప్తున్నారు. ఈ దేశ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన రతన్ థియమ్, అరిబామ్ శ్యామ్‌శర్మ దేశానికి ఏమీ కారని కూడా మీరు చెబుతున్నారు... (అంతరాయం) మీకు ఈ రాష్ట్రం పట్ల లేశమంత బాధ వున్నా ఈ సభలో ఈ మౌనం, రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావన లేకపోవటం జరిగేది కాదు. దీనిని స్పష్టంగా గుర్తించండి.

గా!! చైర్ పర్సన్ (శ్రీకృష్ణ ప్రసాద్ తెన్నేటి): దయచేసి మీ పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఏమిటి?

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్ (ఇన్నర్ మణిపూర్) : దీనిని స్పష్టంగా గుర్తించండి. ఈ రాష్ట్ర ప్రజల జాతీయత,దేశభక్తి పట్ల మీరు సందేహించదలిస్తే, ఈ దేశం కోసం ఈ ప్రజలు పోరాడారని తెలుసుకోండి. ఈ దేశం కోసం ఈ ప్రజలు త్యాగాలు చేశారు. దయచేసి గుర్తుపెట్టుకోండి.

డా.నిశికాంత్ దూబే (గొడ్డా): సభాపతిజీ, ఇది పొరపాటు మాట. నా పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఏమిటంటే... (అంతరాయం) గౌరవనీయులైన సభ్యుడు మేరీకోమ్ పేరు తీసుకొచ్చారు. మేరీ కోమ్‌కి మేము గౌరవం ఇవ్వటం లేదని అంటున్నారు.... (అంతరాయం) ఎంత మాట ఇది. మేరీకోమ్‌ని పార్లమెంటు సభ్యురాలు చేసాము, భారతీయ జనతా పార్టీ ఆమెను ఎంపీ చేసింది...(అంతరాయం) ఏ విధంగా మేము మణిపూర్‌కి గౌరవం ఇవ్వలేదు? మణిపూర్‌కి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఇచ్చాం. నా మామకు మణిపూర్‌లో తుపాకీ గుండు దెబ్బ తగిలింది. అతను సిఆర్‌పిఎఫ్ లో డిఐజి గా ఉండేవారు...(అంతరాయం) ఇతనికి అమరవీరులు అంటే అర్థం తెలియదు. 1956వ సంవత్సరానికి ముందు మణిపూర్‌లో ఆర్మ్‌డ్ పోలీస్ (స్పెషల్ పవర్స్) ఎఎఫ్ఎస్‌పిఎ అమల్లో ఉండేది, ఇంకా 1956 నుంచి ఇప్పటిదాకా...(అంతరాయం) కాంగ్రెస్ వల్ల ఈ పరిస్థితి ఉంది.

> ఈ సభను గట్టిగా ప్రశ్నిస్తున్నాను. భారతదేశ రాష్ట్రాలకు సంబంధించి మీరు మాకు అవసరం లేదని ఈ మూగ సమాచారం ద్వారా ఈశాన్య రాష్ట్ర ప్రజలకు, మరీ ముఖ్యంగా మణిపూర్ ప్రజలకు చెప్పాలనుకుంటున్నారా? ఆత్మాహుతి బాంబర్‌తో పెనుగులాడిన, అశోక చక్ర అవార్డు గ్రహీత మేజర్ లయిష్ రామ్ మణిపూర్‌వాడు. అతను అశోక్ చక్ర అవార్డు పొందాడు. మీరు అతని రాష్ట్రాన్ని అవమాన పరుస్తున్నారు. శ్రీలంకలో శాంతి దళంలో ఈ దేశం తరపున పని చేస్తూ కర్తవ్య నిర్వహణలో ప్రాణం కోల్పోయిన మేజర్ ఎన్గంగోమ్ జాయ్ దత్తా వీర చక్ర అవార్డు పొందాడు. మీరు అతన్ని అగౌరవ పరుస్తున్నారు. మేరికోమ్, సరితా కుంజారాణి, మీరాబాయి చాను లాంటి వారిని, మీరు ఈ దేశానికి అవసరం లేదని, మీ రాష్ట్రం మాకు అవసరం లేదని చెప్తున్నారు.

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్(ఇన్నర్ మణిపూర్): నీవు మణిపూర్‌ని మినహాయిస్తున్నావు. దానిని కాదనగలవా?... (అంతరాయం) 75 ఏళ్ల తర్వాతి ఈశాన్య చరిత్రను గురించి మేము మాట్లాడుతున్నాం. మీరు చేస్తున్నది శుద్ధ మినహాయింపు. వలసవాద శక్తుల దృష్టిలో భారతదేశం చరిత్రకు సంబంధించిన విషయం కాదు, మానవ సంబంధిత విషయం... (అంతరాయం) ఈరోజు భారతదేశ చరిత్రకు సంబంధించిన పాఠ్య పుస్తకాలలో ఈశాన్యం చరిత్రకు వెలుపల ఉంది. అందువల్లనే మీరు వారిని ఇతరులుగా చూస్తున్నారు. ఆ మౌనం, ఏపూరి విషాదం మీద నెలకొన్న నిశ్శబ్దం విశేషమైనది కాదు. వలస పాలనా కాలం తర్వాత సాధారణ కొనసాగింపునకు ప్రతిరూపం ఇది...(అంతరాయం)

గౌ. చైర్ పర్సన్ (శ్రీకృష్ణ ప్రసాద్ తెన్నేటి): సర్, మీ పాయింట్‌ను తెలియజేశారు.(అంతరాయం)

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్ (ఇన్నర్ మణిపూర్): మణిపూర్ విషాదం పట్ల ఈ మౌనం బీజేపీలాంటి జాతీయ పార్టీకి సౌకర్యవంతంగా ఉందని చూడటం దుఃఖం కలిగిస్తున్నది.... (అంతరాయం) మీ గుండెల మీద చేతులు పెట్టుకుని ఆలోచించండి, 60 వేలమంది ప్రజలు కోణార్క్ శిబిరాల్లో అల్లాడుతున్నారు... (అంతరాయం) వారి తల్లుల గురించి ఆలోచించండి, భర్తలు కోల్పోయిన వారిని గురించి ఆలోచించండి, ఆ తర్వాతే జాతీయవాదాన్ని గురించి మాట్లాడండి...(అంతరాయం)

గౌ. చైర్‌పర్సన్: అతను విషయాన్ని చెప్పాడు.

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్(ఇన్నర్ మణిపూర్): అప్పుడు మాత్రమే ఈ విషాదం అంటే ఏమిటో అర్థం చేసుకోగలం...(అంతరాయం)మిస్టర్ చైర్మన్, బీజేపీ క్యాబినెట్ మంత్రిని ఓడించి, ప్రజాస్వామ్య దేవాలయాల్లో భాగమైన నన్ను ఎవరో అన్నట్టు తోసివేయటం బాధను, కోపాన్ని కలిగిస్తున్నది. నా బాధను ఊహించండి. నా గొంతు నుంచి వచ్చిన ఆవేదనను, బాధను మీరు వినండి. వెనక్కి పరికించి ఆ విషయాలు చూడండి... (అంతరాయం) 60 వేల మంది జనం శరణార్థ శిబిరాల్లో అల్లాడుతున్నారు... (అంతరాయం) దీనిని గెలిచేదాకా (దేశ) విభజన గురించి మాట్లాడవద్దు... (అంతరాయం) ప్రధానమంత్రి నోరు తెరిచి మాట్లాడినప్పుడు, జాతీయవాద పార్టీ మణిపూర్ భారత దేశంలో భాగమని అన్నప్పుడు, మేము ఆ ప్రజల రక్షణ చూస్తామని చెప్పినప్పుడు నేను నిశ్శబ్దంగా ఉంటాను... (అంతరాయం) అప్పుడు మాత్రమే మన దేశం యొక్క జాతీయవాదాన్ని అంగీకరిస్తాను... (అంతరాయం) ఈ మాటలతో నా ప్రసంగం ముగిస్తున్నాను.

- అనువాదం: కర్లపాలెం

సామం!

లోలోపల..
వివేకినన్న భ్రమలున్నప్పుడు
కండ్లు నెత్తిలకెక్కుతయి !

నాల్కె తిమతిమ..
అతి నోటి దురద..
మాటలు కోటలు దాటుతయ్ !
తోపు,సిపాయి పదాలు
పల్లవులై మారుమోగుతయ్ !!



దృష్టి సరిగా లేనప్పుడు
గ్రహణ సంక్లిష్టత సహజం !
నువ్వెంత ఏకాగ్రత పెట్టి
కట్టెల మంట పెట్టినా..
గాలివాటం ఎటుంటదో సెప్పలేం!?

ఒక ఇంటికి
రెండు ప్రవేశద్వారాలున్నప్పుడు
ఒకవైపు తలుపులు మూసేస్తే
రెండోవైపో గొళ్ళెం వుండే ఉంటది!

మీతిమీరిన..
మాటకారితనం వెకిలిప్రక్రియ !
సింప్లిసిటీ..
అగ్ర శిఖరాగ్ర సమానం !!

నిప్పులు..
ఎగదోసుకోవడం ఎంతసేపు!
కలుపుకుపోవడమే
జీవనది అంతిమ పరమార్థం!!

కనీస సహ,ఎరుకలేని
ప్రగల్భ సందర్భాలు
శవాలమీద పేలాల లెక్క !
మనిషిని పురుగులెక్క సూత్తయ్ !!
పరిణతి,పరిగణన పూరకాలు!

తపన,తండ్లాట మంచిదే
పొయ్యి,పొగ,దర్ప శపథాలు..
మాటైనా,సేతైనా..
నవ్వైనా,నడకైనా
నలుగురు నొచ్చుకోవద్దు కదా!

సామం..
సర్వమోద మాధుకరం !
భేదం ఎదలకు ఖేదం !!

-అశోక్ అవారి,
సెల్: 9000576581

నూతన నేర చట్టాలు నిలిపివేయాలి

గత లోక్‌సభ చిట్టచివరి సమావేశాల్లో అత్యంత నిర్లక్ష్యంగా అప్రజాస్వామిక పద్ధతిలో ఆమోదించిన మూడు నూతన చట్టాలు జులై 1 నుంచి దేశమంతటా అమలులోకి వచ్చేలా బీజేపీ గట్టి చర్యలు తీసుకున్నది. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ అనే మూడు గత చట్టాల స్థానాన్ని భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినయం అనే ఈ మూడు చట్టాలు ఆక్రమించాయి. ఎలాంటి సన్నాహాలు, చర్చ, వాదనలు లేకుండానే మొత్తం న్యాయ వ్యవస్థ ప్రధాన మార్పులకు లోనుకావడం చూస్తే బుర్ర తిరిగే వ్యవహారం తప్ప మరొకటి కాదు. బీజేపీ పని తీరు పైన విధానాల పైన ఓటర్లు తీర్పు ఇచ్చిన తర్వాత, పార్లమెంటులో మెజార్టీ రాకుండా పోయిన తర్వాత కూడా ఆ పార్టీలో ఏ మార్పు లేదని దీన్నిబట్టి స్పష్టమవుతుంది. హిందీలో మాత్రమే నామకరణం చేయబడిన ఈ మూడు చట్టాలపై లోక్‌సభలో లోతైన చర్చ జరిగిందే లేదు. ఏదో మొక్కుబడి కోసం వాటిని సెలెక్ట్ కమిటీకి పంపి సభ ముందు పెట్టి క్షణాల మీద ఆమోదించేశారు. అసలు ఆ సమయంలో సభలో ప్రతిపక్ష సభ్యులు వుండే అవకాశమే లేకుండా చేయబడింది. ఎందుకంటే వారిలో 148 మందిని సస్పెండ్ చేసినందున సభలో పాల్గొనే అవకాశం లేదు. న్యాయవ్యవస్థ అన్ని స్థాయిల్లోనూ వుండే న్యాయవాద బఅందాలు, సభ్యులు, ఆఖరుకు పోలీసులు కూడా ఈ కొత్త చట్టాలను గురించి పెద్దగా తెలియలేదు. అందువల్ల వాటి అమలు సహజంగానే వాటికి ఏ విధమైన వ్యాఖ్యానమివ్వాలి, అమలు చేయాలి అనే తీవ్రమైన సమస్యలు తెచ్చిపెడుతుంది. ఈ చట్టాలను అమలులోకి తేవడంతో పాటు దానికి సమాంతరంగా మరో నేర న్యాయవ్యవస్థ కూడా ఉనికిలోకి వస్తుంది. ఏమంటే జులై ఒకటవ తేదీకి ముందు ఏదైనా నేరం చేసిన ఒక వ్యక్తికి అప్పుడున్న విస్తారమైన నేర చట్టాల ప్రకారమే విచారించవలసి వుంటుంది. అదే నేరం గనక జులై 1 తర్వాత జరిగినట్టయితే ఈ సరికొత్త విస్తారమైన చట్టాల మేరకు విచారించవలసి వస్తుంది. అంటే దీని అర్థం ఏమంటే ఒక సమాంతర న్యాయవ్యవస్థ ఏర్పరచడం, ఒకే సమయంలో రెండు రకాల చట్టాలు అమలులోకి రావడం జరుగుతుందన్నమాట. దాంతో ఏ చట్టాన్ని వర్తింపచేయాలనే వివాదం రావడం సహజంగా జరుగుతుంది. ఉదాహరణకు జులై ఒకటవ తేదీ ముందు ఎఫ్ఐఆర్‌లో నేరారోపణకు గురైన వారు తమను పాత చట్టాల ప్రకారం విచారించాలిన కోరవచ్చు. కానీ ప్రాసిక్యూషన్ వారిని కొత్త చట్టాల ప్రకారం విచారణకు పెట్టడానికి ప్రయత్నించవచ్చు. వాజ్యాలు కూడా చాలా సంక్లిష్టంగా మారి పోతాయి.



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

మరో యాభై ఏళ్ల అస్పష్టత

చట్టాలకు సుప్రీంకోర్టు భాష్యం చెబుతూ వచ్చింది. సిఆర్‌పిసికి 1973లో చేసిన సవరణలు ఇప్పుడే కొంత నిశ్చిత రూపం సంతరించుకున్నాయి. ఈ కొత్తచట్టాలకు ఆ విధమైన స్థిరత్వం రావాలంటే మరో యాభై ఏళ్ల పడుతుంది. దేశంలోని వేలాది మంది మేజిస్ట్రేట్లు ఈ కొత్త చట్టాలకు వేర్వేరు పద్ధతుల్లో తమవైన వ్యాఖ్యానాలు చేసినప్పుడు ఏది నిలబడుతుందో ఊహించుకోవచ్చు. ఈ రకరకాల వ్యాఖ్యానాలు, ఆలస్యాల వల్ల నిందితులు విపరీతమైన సమస్యలకు గురవడం తథ్యం. ఆ నిందితులు గనక కస్టడీలో వుండేటట్టయితే అతడు లేక ఆమె సమస్యలు మరింత జటిలంగా పరిణమిస్తాయి. చట్టం నిర్దేశించే పద్ధతి వల్ల తప్ప మరే విధంగానూ ఒక పౌరుడి ప్రాణాలకు, స్వేచ్ఛకు ఆటంకం రాకూడదని 21వ అధికరణం హామీనిస్తుంది. కాని ఇక్కడ అసలు చట్టం ఏమిటి అన్నదే వివాదమైనప్పుడు దాన్ని అమలు చేయడం కూడా కష్టతరమవుతుంది. ఈ కొత్త చట్టాలు ఏం చెబుతున్నాయనే దానిపైనే అనిశ్చితిని, అస్పష్టతను తెచ్చిపెడతాయి. ఈ నూతన చట్టాలు వచ్చిన తర్వాత నేర కేసులు 30 శాతం ఎక్కువగా జాప్యం జరుగుతుందని సీనియర్ లాయర్లు చెబుతున్నారు. వేల మందికి, ప్రత్యేకంగా వనరులు లేని వారికి న్యాయం నిరాకరించబడటానికి ఇది దారితీస్తుంది. అసలు కేసుల పెండింగుపై దీని ప్రభావం ఏమిటనేది లెక్క కట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించిన దాఖలాలే కనిపించవు. ఎందుకంటే దాన్ని సర్కారు ఖాతరు చేయదల్చుకోలేదు. అనువాదం చేయడానికి, అమలు చేయడానికి సంబంధించిన సమస్యలు ఎలాగూ తప్పవు గనక అనివార్య చిక్కులుగా వదిలేయవచ్చు. కాని ఈ నూతన చట్టాలలో కొన్ని సెక్షన్లు అత్యంత నిరంకుశమైనవి, మరికొన్ని సెక్షన్లు న్యాయం అందించడంలో అవరోధాలు సృష్టించేవిగా వున్నాయి.

> ఈ నూతన చట్టాలలో అత్యంత ప్రమాదకరమైన మరో అంశమేమంటే 124 ఎ మరో రూపంలో ప్రత్యక్షం కావడం. రాజద్రోహాన్ని నిర్వచించే ఐపిసి 124 ఎ సెక్షన్‌ను సుప్రీం కోర్టు ఇప్పటికే కొట్టివేసింది. కానీ భారతీయ న్యాయసంహితలో 152వ సెక్షన్ మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంతకు ముందట మూల చట్టం 124ఎలో లేని విధంగా ఇందులో భారత సార్వభౌమత్వం, సమగ్రత అనే ప్రస్తావనలు అదనంగా చేర్చబడ్డాయి. సీనియర్ లాయర్లు చెప్పే ప్రకారం చట్టంలో ఇదివరకు లేని 'జాతి వ్యతిరేక చర్య' అనే అంశం కొత్తగా జొప్పించబడింది. సహజంగానే ఇది వాక్ స్వాతంత్రాన్ని భావ వ్యక్తీకరణను అసమ్మతి హక్కును తీవ్ర స్థాయిలో దెబ్బతీస్తుంది. వాటికి వ్యతిరేకంగా పని చేస్తుంది. ఈ కొత్త చట్టాలు తీసుకురాక ముందే ఈ ప్రభుత్వం అసమ్మతిదారుల పట్ల వ్యవహరించిన తీరు చాలా దూకుడుగా అన్యాయంగా వుండింది.

పోలీసులకు నిరంకుశాధికారాలు

న్యాయాన్ని చేరుకోవడంలో మొదటి అడుగు ఎఫ్ఐఆర్. ఈ కొత్త చట్టాల కింద మూడు నుంచి ఏడేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశమున్న ఏదైనా నేరానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ 14రోజుల వరకూ జాగు చేయొచ్చు. ఈ విషయానికి సంబంధించిన వివిధ కోణాలను అధ్యయనం చేయడంలో స్టేషన్ హౌస్ అధికారి ఆలోచనలు కొనసాగించవచ్చు. బాధితులైన అతడు/ఆమె తమ ఫిర్యాదును ఉపసంహరించాలంటూ ఈ కాలంలో ఒత్తిడి తీసుకురావచ్చు. ఇది పోలీసులలోనూ అవినీతిని దారితీయొచ్చు. తమను తాము కాపాడుకోవడానికి రకరకాలైన పద్ధతులకు పాల్పడే అవకాశం అతడు/ ఆమెకు లభించవచ్చు. ఈ కొత్త చట్టాలు తీసుకొచ్చిన మార్పుల వల్ల పేదలు బలహీనులు న్యాయం పొందే హక్కుకు అత్యంత తీవ్రమైన హాని కలుగుతుంది. వారిప్పటికే అనేక విధాల న్యాయం పొందే హక్కును ఉపయోంచుకోలేకపోతున్నారు. అలాగే ఈ కొత్త చట్టాల ప్రకారం పోలీసులు గత చట్టంలో పేర్కొన్న 15 రోజుల కాలపరిమితిని మించి అధికకాలం పాటు రిమాండులో వుంచాలని కోరవచ్చు. తరచూ నేరాలు చేసేవాళ్లకు (ఇదో కొత్త తరహా విభజన) ఈ కొత్త చట్టం ప్రకారం సంకెళ్లు కూడా వేయొచ్చు. పేదలు, బలహీనులకూ, అణచివేయబడిన వారికి, ప్రభుత్వ ప్రయోజనాలకు హాని కలిగించేవారుగా పోలీసులు భావించేవాళ్లకు న్యాయాన్ని నిరాకరించే అధికారం మరింత పెరుగుతుంది.

124 ఎ మరింత తీవ్రరూపంలో

ఈ నూతన చట్టాలలో అత్యంత ప్రమాదకరమైన మరో అంశమేమంటే 124 ఎ మరో రూపంలో ప్రత్యక్షం కావడం. రాజద్రోహాన్ని నిర్వచించే ఐపిసి 124 ఎ సెక్షన్‌ను సుప్రీం కోర్టు ఇప్పటికే కొట్టివేసింది. కానీ భారతీయ న్యాయసంహితలో 152వ సెక్షన్ మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంతకు ముందట మూల చట్టం 124ఎలో లేని విధంగా ఇందులో భారత సార్వభౌమత్వం, సమగ్రత అనే ప్రస్తావనలు అదనంగా చేర్చబడ్డాయి. సీనియర్ లాయర్లు చెప్పే ప్రకారం చట్టంలో ఇదివరకు లేని 'జాతి వ్యతిరేక చర్య' అనే అంశం కొత్తగా జొప్పించబడింది. సహజంగానే ఇది వాక్ స్వాతంత్రాన్ని భావ వ్యక్తీకరణను అసమ్మతి హక్కును తీవ్ర స్థాయిలో దెబ్బతీస్తుంది. వాటికి వ్యతిరేకంగా పని చేస్తుంది. ఈ కొత్త చట్టాలు తీసుకురాక ముందే ఈ ప్రభుత్వం అసమ్మతిదారుల పట్ల వ్యవహరించిన తీరు చాలా దూకుడుగా అన్యాయంగా వుండింది. ఇక ఈ కొత్త చట్టాలతో పరిస్థితి ఇంకా దిగజారుతుంది. అంతేగాక ప్రస్తుతం ఉపా చట్టం కింద వున్న అనేక నేరాలను ఈ కొత్త నేరచట్టంలో పొందుపరిచారు. అంటే నిందితుడు వాస్తవంలో కొత్తనేర చట్టంలో ఉపా కింద ఎన్ఐఎ, కొత్త నేర చట్టం కింద పోలీసులు పెట్టే రెండు రకాల చార్జిషీట్లు ఎదుర్కొనవలసి వుంటుంది. చివరకు ఒకే శిక్ష విధించినా ఈ ఈ మొత్తం ప్రక్రియే తీవ్ర శిక్షలా నడుస్తుంది. పైగా ఉపా కింద దర్యాప్తు చేసేది స్థానిక పోలీసు కన్నా పై స్థాయి అధికారి కాగా కొత్త చట్టంలో మామూలు పోలీసు స్టేషన్‌కే టెర్రరిజంపై దర్యాప్తు చేసే హక్కు వుంటుంది. ఉపా కింద విచారణ జరిపేందుకు ప్రభుత్వ అనుమతి అవసరం కాగా కొత్త చట్టంలో ఒక సాధారణ పోలీసు అధికారి కూడా ఎవరినైనా టెర్రరిజం పేరిట దర్యాప్తు జరిపే అధికారం పొందడం ఇంకా ఆందోళన కలిగించే విషయం.

నిలిపేవరకూ పోరాటం

ఈ నూతన చట్టాలపై గట్టిగా పోరాడాల్సి వుంది. దేశ వ్యాపితంగా న్యాయవాద సంఘాలు నిరసనలు, కోర్టుల బహిష్కరణకు సన్నాహాలు చేస్తున్నాయి. సుప్రీం కోర్టును ఉద్దేశించి పిటిషన్లపై వేలాది మంది సంతకాలు చేసి పంపారు. ఈ చట్టాల గురించిన సమాచారం మరింత విస్తృతంగా తెలిసేకొద్దీ నిరసనలూ వ్యతిరేకత పెరుగుతూనే వుంటాయి. ప్రజాభిప్రాయం నిర్మించడం ద్వారా ఎన్‌డిఎ సర్కారుపై ఒత్తిడి తెచ్చి ఈ కొత్త చట్టాల అమలును నిలుపు చేయవలసిన పరిస్థితి తీసుకు రావాలి. వాటిని తాజాగా మరోసారి సమీక్షించాలి. ఎందుకంటే ఈ చట్టాలు దేశంలోని పౌరులందరి జీవితాలకూ స్వేచ్ఛకు ప్రమాదకరంగా పరిణమించనున్నాయి. వాటిని ఇప్పుడున్న రూపంలో ఆమోదించే ప్రసక్తే వుండకూడదు.

(జులై3 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
రంగారెడ్డి
గురువారం | జులై 11 2024 | www.navatelangana.com

ఇద్దరు నిందితులకు 10 ఏండ్ల జైలు శిక్ష

- విකారాబాద్ జిల్లా ఎస్పీ

కె. నారాయణరెడ్డి



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు 10 ఏండ్ల కారాగార శిక్ష రూ. 2 వేల జరిమానా కోర్టు విధించిందని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి తెలిపారు. 2013 సంవత్సరంలో యాలాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్యాయత్నం నేరంలో ఇద్దరు నిందితులకు పదేండ్ల జైలు, రూ. 2 వేలు జరిమానను కోర్టు విధించినట్టు తెలిపారు.

మరికల్ గ్రామంలో ఘనంగా పోచమ్మ బోనాలు

నవతెలంగాణ-చౌడాపూర్



చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రామంలోని మహిళలు బోనాన్ని ఎత్తుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నరసింహారెడ్డి,దామోదర్ రెడ్డి, శివకుమార్, నరేందర్ ప్రసాద్, రవి, నర్సింలు, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం బాక్స్‌లను తొలగించాలంటూ వినతి

- నార్సింగి కౌన్సిలర్ ఉషారాణి



నవతెలంగాణ-గండిపేట్

నార్సింగి వార్డు కార్యాలయంలో పెట్టిన ఈవీఎం బాక్స్‌లను వేంటనే తొలగించాలని నార్సింగి కౌన్సిలర్ కె.ఉషారాణి కోరారు. బుధవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. నార్సింగి వార్డు ఆఫీసుల్లో ఏర్పాటు చేసిన ఈవీఎం బాక్స్‌లను తొలగించాలని గతంలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించినట్టు తెలిపారు. కానీ ఈ విషయం పట్ల జిల్లా ఎన్నికల అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వార్డు ఆఫీసును ప్రజా అవసరాల కోసం కేటాయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవా లన్నారు. తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించిన ఎన్నికల అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయం పట్ల జిల్లా అధికారులు వేంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

'కార్మికుల హక్కులను అణిచివేయాలని బీజేపీ సర్కారు కుట్ర'



నవతెలంగాణ-గండిపేట్

కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కారు కార్మికుల హక్కులను అణచివేసే కుట్ర చేస్తుందని సీఐటీయూ మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీలోని ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తూ రాజ్యాంగంతో కల్పించిన హక్కులను బీజేపీ సర్కారు నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్మికుల హక్కులను అణిచి వేసే కుట్రను మోడి సర్కారు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ రంగాల్లో పని చేస్తున్న కార్మికులందరికి వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టిచర్లకు కనీసం రూ.26వేలు వేతనాలను చెల్లించాలన్నారు. ఇన్సూరెన్స్, ఉద్యోగ భద్రతా కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వేతనాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంల్లో అంగన్‌వాడీలు, అశ వర్కర్లు, ఆటో కార్మికులు, మున్సిపల్ కార్మికులు సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు శాశ్వత పరిష్కారం

- మేయర్ లతా ప్రేంగౌడ్



నవతెలంగాణ-గండిపేట్

హిమాయత్ సాగర్ జలశయం నుంచి కార్పొరేషన్‌కు నీటి సరఫరా చేసి శాశ్వత పరిష్కారం చూపుతామని మేయర్ మద్దెల లతా ప్రేంగౌడ్ అన్నారు. బుధవారం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని హిమాయత్‌సాగర్ ప్రాజెక్టుకు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ ప్రెషర్, ఫిల్టర్స్ గ్రిడ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బండ్లగూడ కార్పొరేషన్‌కు నీటి సరఫరాను చేయాలని ఆదేశించారు. అధికారులు పూర్తి స్థాయిల్లో శ్రద్ద చూపు నీటి ఎద్దడి రాకుండ చర్యలు తీసుకోవాలని కోరారు. నీటి సరఫరా చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిల్లో చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో మణికొండ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసి వాటర్ ప్రెసర్ ఫిల్టర్స్‌ను సందర్శించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

- టీఆర్‌టీఎఫ్ జిల్లా కార్యదర్శి జామ కుశాల్



నవతెలంగాణ-గండిపేట్

విద్యార్థులకనుగుణంగా ఉపాధ్యాయులను వేంటనే సర్దుబాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జామ కుశాల్ డిమాండ్ చేశారు. బుధవారం నార్సింగి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల్లో ఆయన టీఆర్‌టీఎఫ్ జిల్లా ఉపాధ్యాయ నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, విద్య శాఖ అధికారులు బదిలీ అయిన ఉపాధ్యాయులను వేంటనే ఛార్జీ తీసుకుని వీధులకు వేళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొంత మంది ఉపాధ్యాయులు బదిలీలు అయిన పోస్టింగ్ తీసుకోకుండ అలస్యం చేస్తున్నట్టు ఆరోపించారు. దీంతో విద్యార్థులకు నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. ప్రమేషన్ల కోసం బదిలీ అయిన ఉపాధ్యాయులు ఛార్జీ తీసుకోవడం లేదన్నారు. ఛార్జీ తీసుకోకపోవడంతో జిల్లాలో చాలా చోట్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు విద్యశాఖ పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను వేంటనే భర్తీ చేసేందుకు విద్య శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలను గుర్తించి వేంటనే వాలంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలస్యం చేస్తే టీఆర్‌టీఎఫ్ తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కమ్యూనిటి హాల్ భవన పనులు పరిశీలన

నవతెలంగాణ-గండిపేట్



నార్సింగి మున్సిపాలిటీలోని ఆరోవ వార్డు బీజెఆర్ కమ్యూనిటి హాల్ భవన నిర్మాణ పనులను కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావ్ పరిశీలించారు. బుధవారం కమ్యూనిటీ హాల్ భవనం స్లాబ్ పనులను ప్రారంభించి మాట్లాడారు. పనుల్లో నాణ్యతను పాటించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. త్వరల్లో పూర్తి చేసేందుకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ కమ్యూనిటి భవనాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు, నాయకులు, కాంట్రాక్టర్ దుడ్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-గండిపేట్



విద్యుత్ సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని వైస్ చైర్మెన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మణికొండ మున్సిపాలిటీలోని శివాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం కృషి చేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ అధికారులతో మాట్లాడి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం పట్ల సంతోషమన్నారు. మణికొండ ఏఈ జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, అలయ కమిటీ చైర్మెన్ రాజేందర్ గౌడ్, కౌన్సిలర్, వసంత ఛౌహాన్, మాజీ సర్పంచ్ వై, నరేష్, మాజీ ఎంపీటీసీ రాఘవరెడ్డి, బీరప్ప, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజేష్, గంగధర్, దేవేందర్, సత్యం, శ్రీనివాస్, చౌదరీ, కాంట్రాక్టర్ శ్రీనివాస్, మల్లికార్జున శర్మ తదితరులు పాల్గొన్నారు.





'నిర్ణయాలు ముందు..తర్వాత సమావేశం'

నవతెలంగాణ-గండిపేట్

నిర్ణయాలను ముందు చేసి మరుసటి రోజున కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఆనవాయితీగా మారింది. అధికారులు కౌన్సిలర్ల భర్తలు, వారి కుటుంబ సభ్యులతో అధికారులు మిని కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసుకున్ని ఏ జెండా తీర్మానాలను మున్సిపల్ అధికారులతో కలిసి చక్కపెడతారు. బుధవారం నార్సింగి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పేరుకే అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్ని అధికారులు, అధికార పక్ష సభ్యులు చేతులు దులుపుకుంటారు. ఎప్పుడు చూసిన మున్సిపల్ అధికారులు తప్ప ఇతర శాఖ అధికారులు డుమ్మా కొడతారు. అధికారులతో పాటు ప్రతిపక్ష సభ్యులు సమావేశానికి రాకుండ దూరంగా ఉన్నారు. కొంతమంది సభ్యులు సమావేశం మధ్యలో వచ్చి మార్కులు వేసుకుని మామా అనిపించుకుంటున్నారు. అత్యవసర కౌన్సిల్ సమావేశంలో కొన్ని వార్డులకే నిధులను కేటాయించి చేతులు దులుపుకుంటున్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ సభ్యులు సమావేశానికి దూరంగా ఉండటంతో కొన్ని వార్డులకే అత్యవసర నిధులను తీర్మాణం చేసి సమావేశాన్ని ముగించారు. అంకెల గారడిని చూపుతూ సమావేశాన్ని దాట వేశారు. అర్భాటాలతో మొదలైన సమావేశాన్ని బడ్జెట్‌ను అంకెలు చేప్పి సమావేశాన్ని ముగించారు. సమావేశం అనంతరం మున్సిపల్ కార్మికులకు శానిటేషన్ సమాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మెన్ విజయ్‌బాబు, డీఇ నర్సింహారాజు, కౌన్సిలర్లు శివారెడ్డి, ఉషారాణి, ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్, గున్నాల అమరేందర్‌రెడ్డి, సునీతాగణేష్, లక్ష్మిప్రవళిక, నరేష్, మేనేజర్ యోగేష్, ఆర్ఐ అఖిల్, జలమండలిమేనేజర్ స్ఫూర్తిరెడ్డి, వైద్య శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ డిసీజెస్ నియంత్రణకు చర్యలు

- వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి పాల్వాన్ కుమార్



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్ ప్రోగ్రాం ఆఫీసర్స్, పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో సీజనల్ డిసీజెస్ నియంత్రణకు తీసుకోవలసిన చర్యల గురించి వివరించడం ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ, ఇతర అంటువ్యాధుల నియంత్రణకు, ఫీవర్ సర్వే చేయడం ద్వారా జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారి రక్త పూతలు సేకరించి టి– డైగ్నోస్టిక్స్ ల్యాబ్ ద్వారా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ ఐన వారికి తగు చికిత్స అందే విధంగా జాగ్రత్త పడటం, దోమకాటుకు గురి కాకుండా ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రతి పీహెచ్‌సీలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేయడం, అత్యవసర కేసులకు చికిత్స చేయడానికి సరిపడా బెడ్స్ రిసర్వ్ చేసుకోవడం, అన్ని పీహెచ్‌సీలలో ఆంటీ స్నేక్ వీనం వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవడం, తగినంత ఓఆర్‌ఎస్ పాకెట్స్ నిల్వలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉంచుకోవాలని ఆదేశించారు. వ్యాధుల నియంత్రణకు వివిధ శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న అన్ని లెప్రసీ కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణులకు అన్ని రకాల సేవలు అందించి సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. రేపు జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ర్యాలీలు నిర్వహించి కుటుంబ నియంత్రణ, పిల్లల మధ్య ఎడం గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అధిక బీపీ, మధుమేహము, మానసిక సమస్యలు ఉన్న వారిని గుర్తించి వారికి ఇంటి దగ్గరే మందులు అందే విధంగా జాగ్రత్తపడాలి. ప్రతి గురువారం పాఠశాలలలో ఐరన్ ఫోలిక్ మాత్రలు విద్యార్థుల చేత మింగించాలి. జులై 25 నుంచి ఆగస్టు 15 వరకు పాఠశాల విద్యార్థులకు బడి బయట పిల్లలకు మెదడు వాపు వ్యాధి నియంత్రణకు ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుంది అందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్లను సిద్ధం చేసుకోవాలని, ప్రస్తుతం జరుగుతున్న స్టాప్ డయేరియా క్యాంపియన్‌లో ఓఆర్‌ఎస్, జింక్ కార్నర్ పాయింట్‌లను గుర్తించాలని, పాఠశాల రెసిడెన్షియల్ హాస్టల్లో విద్యార్థులకు పరిశుభ్రత, హ్యాండ్ వాషింగ్ గురించి అవగాహన కలిగించాలని, పరిసరాలు, కిచెన్, భోజనశాల ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ జీవరాజ్, డాక్టర్ సాయి బాబా, జిల్లా పరిధిలోని వైద్యాధికారులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను భూ కబ్జాదారుల నుంచి కాపాడాలి

- తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను ఆక్రమణదారుల నుంచి రక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక సంబంధిత అధికారులను ఆదేశించడం హర్షణీయమని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ అన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులతో ప్రభుత్వ భూములు పరిరక్షణ, చెరువుల ఆక్రమణల తొలగింపుపై ఎఫ్‌టీఎల్, లోపల, బఫర్ జోన్ ప్రాంతాలను ఆక్రమణల నుంచి రక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఏసీపీ స్థాయిలో రెండు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను నియమించాడాన్ని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం, మత్స్య జిల్లా అడోక్ కమిటీ హర్షం వ్యక్తం చేస్తుందని చెప్పారు. ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రాంతాలను కలిపి టీమ్ -1గా, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, షాద్‌నగర్, చేవెళ్లను కలిపి టీమ్–2గా టాస్క్ ఫోర్స్ బృందాలు ఉంటాయని చెప్పడం బాగుంది, కానీ జిల్లాలోని కల్వకుర్తి నియోజకవర్గంలోని 4 మండలాలు ఇందులో చేర్చాలన్నారు. వేసిన కమిటీలో మత్స్యకారుల సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. చెరువులు కుంటలు, ఫిరంగి కాలువలను అక్రమంగా కబ్జాలు చేసినా వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఎలాంటి ఒత్తిడిలకు గురికాకుండా పారదర్శకంగా చేయాలని జిల్లాలో ఉన్న అన్ని చెరువులు, కుంటలు, నదులు, సరస్సులు శాటిలైట్ ద్వారా సర్వేలు చేసి ఎఫ్‌టిఎల్ హద్దు రాళ్ల వేయాలని, చెరువులు కుంటల్లోకీ పరిశ్రమల నుంచి కార్పొరేట్ కంపెనీల నుంచి వచ్చే మురుగు, వ్యర్థ పదార్థాలు కలిసిన నీటిని పంపుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే చెరువులు, కుంటల్లోకి రాకుండా నీటి సుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ మత్స్య సొసైటీ తమ గ్రామల పరిధిలోని కబ్జాలు చేసినా వాటిపై టాస్క్ ఫోర్స్ కమిటీలకు దరఖాస్తులు పట్టుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులు కుంటలను జల వనరులను పెద్ద ఎత్తున కబ్జాలు చేస్తున్నారని చెప్పారు. కబ్జాలు చేసిన వారిపై చట్టరీత్యా ల్యాండ్ గ్రామింగ్ కేసులు నమోదు చేసి శిక్షించాలని కోరారు.



ఫార్మా బాధిత పట్టా భూమి రైతులకు అన్యాయం జరగనివ్వం

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- ప్రజాభవన్‌లో రైతులతో సమస్యలపై చర్చ
- నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం
- రైతులందరికీ న్యాయం జరిగేలా కృషి
- రైతులకు స్పష్టతనిచ్చిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-యాచారం

ఫార్మా బాధిత పట్టా రైతులందరికీ అన్యాయం జరగనీయబోనని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో యాచారం మండల పరిధిలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద నాలుగు గ్రామాల ఫార్మా బాధిత పట్టా రైతులతో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రంగారెడ్డి, జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డిలు కలిసి రైతులకు స్పష్టతనిచ్చారు. ఎట్టి పరిస్థితిలో పట్టా భూమి ఫార్మాకు తీసుకోబోదని రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు నేనిచ్చిన మాటకు కట్టుబడి ఉన్నానని అన్నారు. ఫార్మా బాధిత పట్టా రైతులను కాపాడుకునే బాధ్యత తన పైన ఉందని అన్నారు. సేకరించిన భూమిలో ఫార్మాసిటీ రాదని తెలిపారు. సేకరించిన భూముల్లో ఎడ్యుకేషన్ హబ్, మెడికల్ హబ్‌ను ఏర్పాటు చేసే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందని చెప్పారు. కంపెనీలు ఏర్పాటు చేసేటప్పుడు మధ్యలో భూమి ఉన్న రైతులను ఒప్పించి వేరేచోట భూమి ఇచ్చే ప్రతిపాదన ప్రభుత్వం తీసుకుంటుందని గుర్తు చేశారు. నాలుగు గ్రామాల ఫార్మా బాధిత రైతులు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పడం జరిగిందని అన్నారు. త్వరలోనే నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అదేవిధంగా రైతులందరికీ రైతుబంధు, రైతు బీమా, క్రాఫ్ లోన్, రిజిస్ట్రేషన్ల సౌకర్యం కల్పించి ఆదుకునే బాధ్యత కాంగ్రెస్ పార్టీదని ఆయన పేర్కొన్నారు. ఫార్మాసిటీ రద్దు చేస్తామని ప్రభుత్వం చెప్పిన నిర్ణయంపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు. కార్యక్రమంలో నాలుగు గ్రామాల ఫార్మా బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

జూలై 10న కోరికల దినం

- సీఐటీయూ జిల్లా నాయకురాలు స్వప్న
- ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో నిరసన



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

మధ్యాహ్న భోజన కార్మికుల కోరికల దినంలో భాగంగా ఇబ్రహీంపట్నంలో మధ్యాహ్నం భోజన కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో ప్లేటులు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిందన్నారు. గత 10 ఏండ్లుగా సాగించిన సంస్కరణలు, ప్రయివేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు మళ్ళీ ఉవ్విళ్ళూరుతుందన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని ప్రకటించిందన్నారు. బొగ్గు బ్లాకులను వేలానికి పూనుకుందని, వెంటనే రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడలు రద్దు చేయాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైపులైను రద్దు చేయాలన్నారు. కార్మికుల అందరికీ కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంగన్‌వాడీ ఆశ, మధ్యాహ్న భోజనం, ఐకేపీ, వివోఏ, వైద్యం ఆరోగ్యం రంగంతో పాటు, వివిధ స్కీమ్‌లలో పనిచేస్తున్న స్కీం వర్కర్లలను కార్మికులుగా గుర్తించి చట్టాలు అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల గడువు ముగిసిన వెల్ఫేర్ కార్డులను రెన్యువల్ చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే విధానాన్ని మానుకోవాలన్నారు. 20 ఏండ్లుగా ఈ పథకంలో పని చేస్తున్న కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీఐటీయూ మున్సిపల్ కన్వీనర్ చింతపట్ల ఎల్లేశ, మండల కన్వీనర్ బుగ్గరాములు, మధ్యాహ్న భోజన జిల్లా కోశాధికారి సరిత, శిరీష, అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ బాలమణి, యాదమ్మ, పుష్ప, ఆశ వర్కర్స్ యూనియన్, అనిత, జిల్లా నాయకులు సంతోష్ కుమార్, నవనీత, రాములమ్మ, పద్మా స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

పేదల కోసం పనిచేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ మండలానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి వికారాబాద్ నియోజకవర్గం ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని 26 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకులు తెలంగాణ రాష్ట్రాన్ని విధ్వంసం చేసి ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించారని, అయినప్పటికి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు మేనిఫెస్టోని సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పకుండా అమలు చేస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇస్తే గత ప్రభుత్వం లాగా మాయమాటలు చెప్పి ప్రజల్ని మోసం చేసి ఇచ్చిన మాట మర్చిపోయే ప్రభుత్వం కాదని కాంగ్రెస్ ఎల్లప్పుడూ పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతూ పేదలకు తోడుగా ఉంటుందని, మేనిఫెస్టులో చెప్పిన విధంగా ఆరుగ్యారెంటీ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికీ అందించే బాధ్యత తనదని అన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ ఎర్రవల్లి జాఫర్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచులు వెంకటరెడ్డి, నాయకులు పి మల్లేశం, బి రవీందర్, మోహన్ , నాయకులు శివయ్య , తుకారం బండెల్లి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో మోగిన డిల్లేం, కళ్లేం

నవతెలంగాణ-బొంరాస్‌పేట్



దేశ రాజధాని అయిన హస్తినలో తెలంగాణా ఒగ్గు కళాకారుల డిల్లెం కళ్లెం మోగింది. ఉమ్మడి పాలమూరు జిల్లా బొంరాస్‌పేట్ మండలం నందర్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీ మల్లికార్జున ఒగ్గుడోలు బృందం సభ్యులు ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ప్రదర్శించారు. తెలంగాణా రాష్ట్రం తరుపున బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మొదటి రోజు ఇండియా గేట్ వద్ద ఒగ్గుడొలు ప్రదర్శన అద్భుతంగా నిర్వహించామని అధ్యక్షులు ఒగ్గు బీరప్ప తెలిపారు.

తాండూరు జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

- రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో వసతులపై ఆరా తీసిన ఎమ్మెల్యే
- ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-తాండూరు



తాండూరు పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని బుధవారం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డయాలసిస్ వార్డు జనరల్ వార్డు, స్త్రీల మెడికల్ వార్డు, బ్లడ్ బ్యాంక్ జనరల్ వార్డులతో పాటు వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో గల వైద్య సేవలు, వసతులను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కేవియస్ మూర్తితో ఆస్పత్రిలో గల సమస్యలను, మెరుగైన వైద్య సేవలు కల్పించడానికై అవసరమైన వసతులు, ఖాళీగ ఉన్న పోస్టుల గూర్చి ఆరా తీశారు. ఆస్పత్రికి అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ అవసరం ఉందని సిబ్బంది ఎమ్మెల్యేకు చెప్పడంతో వెంటనే స్పందించిన మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మురళి కృష్ణగౌడ్ అంబులెన్స్‌ను ఆస్పత్రికి డొనేట్ చేస్తున్నట్టుగా ఎమ్మెల్యేకు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, నాయకులు కార్యకర్తలు ఆస్పత్రి డాక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల డిమాండ్లు అమలు చేయాలి'

నవతెలంగాణ-శంషాబాద్



కార్మికుల డిమాండ్స్ డే కార్యక్రమాన్ని బుధవారం శంషాబాద్‌లోని ఏఎల్‌ఓ ఆఫీస్ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏఎల్‌ఓకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జీ. కురుమయ్య జిల్లా కార్యదర్శి ఎస్ రామ్మోహన్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు నీరటి మల్లేష్ మాట్లాడారు. అడ్డా కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు పనితీరు మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం 1996 భవన, ఇతర నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టాలను రక్షించాలన్నారు. కనీస పెన్షన్ రూ. 10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి : జిల్లా కార్యదర్శి సునీత

ఆశ వర్కర్ల డిమాండ్ల డే పురస్కరించుకొని బుధవారం శంషాబాద్‌లో ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పారితోషిక విధానం రద్దుచేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కొత్తపల్లి మల్లేష్, మొగులయ్య, వెంకటయ్య, ఆశా మండల కమిటీ సభ్యులు నవనీత, శారదా, సునంద, మంజుల, సులోచన, సమంత తదితరులు పాల్గొన్నారు.

జీవో 121 న రద్దు చేయాలి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేను కలిసిన పూర్వ వీఆర్వోలు

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి



జీవో 121 రద్దుచేసి పూర్వ వీఆర్వోల సమస్యలను పరిష్కరించాలని పలువురి తెలంగాణ వీఆర్వోల వర్కింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు ఎదుర్కుంటున్నా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రభుత్వం దృష్టికి తీసుకపోవాలని కోరారు. గత ప్రభుత్వం వీఆర్వోలను వాడుకొని తమ జీవితాలను నాశనం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 121 తీసుకువచ్చి 5576 మంది వీఆర్‌ఓ కుటుంబాలను వీధి పాలు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో పూర్వ వీఆర్వో సంఘం నాయకులు శ్రీరాములు, జగదీష్, దయానంద, గణేస్, నగేష్, యాదగిరి, దశరథ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వికారాబాద్
గురువారం | జులై 11 2024 | www.navatelangana.com

జోనల్ కమిషనర్‌ను కలిసిన కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి సర్కిల్ జోనల్ కార్యాలయంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపేందర్ రెడ్డిని మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్‌తో కలిసి కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొండాపూర్ డివిజన్ పరిధిలోని నెలకొన్న పలు సమస్యలను తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, ఇంకా మిగిలిన పలు అభివృద్ధి పనులు గూర్చి వివరించారని ఆయన తెలిపారు.

సీసీరోడ్డు పనులను పరిశీలన
కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి డివిజన్‌లోని ఆదర్శ్ నగర్ కాలనీలో నూతనంగా చేపట్టే సీసీ రోడ్డు పనులను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ స్థానిక వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. దాదాపుగా రోడ్లు పూర్తవ్వగా మిగిలిన సీసీరోడ్ల పనులు ప్రారంభించామన్నారు. సీసీరోడ్డు పనులలో నాణ్యతాప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన పనులను పూర్తిచేయాలని సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, ఆదర్శ్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ బిల్లులను రద్దు చేయాలి
- సీఐటీయూ శేరిలింగంపల్లి కన్వీనర్ కృష్ణ



నవతెలంగాణ-మియాపూర్

కార్మికుల హక్కులను బీజేపీ కాలరాస్తున్నదని నాలుగు లేబర్ కోడ్ బిల్లను రద్దు చేయాలని సీఐటీయూ శేరిలింగంపల్లి కన్వీనర్ కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కార్మికుల హక్కులను కాలరాసే విధంగా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. 4 లేబర్ కోట్ల బిల్లును రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగానే 'కోరికల దినం' అనే పేరుతో వినతిపత్రం అందించారని తెలిపారు. ప్రతి రంగంలోనూ ప్రయివేటీకరణను ప్రోత్సహించి కార్మికుల హక్కులు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని ఆయన విమర్శించారు. గతంలో సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఇచ్చిన తీర్పును ఇప్పటివరకు అమలు చేయలేదని ఆయన గుర్తుచేశారు. వీటిపై దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తున్నామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిపారు. తమ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కా ర్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

'ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు పూర్తి చేయాలి'



నవతెలంగాణ-మంచాల

లోయపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు వెంటనే పూర్తి చేయాలని లోయపల్లి బీజేపీ గ్రామ కన్వీనర్ మోర శ్రీశైలం అధికారులను కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లోయపల్లి గ్రామంలో మూడేండ్ల కింద చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు ఇప్పటివరకూ పూర్తి చేయకుండా అసంపూర్తిగా నిలిపివేశారని తెలిపారు. దీనికి గల కారణాలు తెలుపాలని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు బండి రాజు, మాజీ మండల అధ్యక్షులు మాదగోనీ రాజు, ఓబీసీ మండల ఉపాధ్యక్షులు కలగొని శేఖర్, నాయకులు కారింగు రాజు, గ్రామశాఖ మాజీ కర్నాటి సురేష్, బూత్ ప్ర ధాన కార్యదర్శి మాద గోనీ ముకేష్ తదితరులు ఉన్నారు.

'మైనార్టీ గురుకుల హాస్టల్ నీటి సమస్యను పరిష్కరించాలి'



నవతెలంగాణ-మియాపూర్

మైనార్టీ గురుకుల హాస్టల్ నీటి సమస్యను పరిష్కరించాలని బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మియాపూర్ డివిజన్‌లో మయూరినగర్ ఉన్న హెచ్ఎండబ్ల్యుఎస్ వినతిపత్రాన్ని అందజేశారు. మాదాపూర్ డివిజన్ పరిధిలో గోకుల్ ఫ్లాట్స్‌లో ఉన్న మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల 400 మంది పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకుంటున్నారు. రోజు వారిగా వారికి వస్తున్న తాగునీరు సరిపోవడం లేదు. దీంతో అక్కడి పిల్లలు తీవ్రఇబ్బంది పడుతున్నారు. నీటి కొరత వల్ల స్నానానికి రోజు వారి కృత్యాలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తద్వారా విద్యార్థులకు అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రతిరోజూ అదనంగా నాలుగు ట్యాంకర్ల తాగు నీటిని మానవతా దృక్పథంతో పంపించాగరలని హెచ్ ఎండబ్ల్యు ఎస్ మయూరినగర్ వాటర్ ఆఫీస్‌లో హఫీజ్‌పేట్ సెక్షన్ మేనేజర్ పూర్ణేశ్వరిని కలిసి వినతి పత్రం అందించారు. సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీ ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లెమురళి, ఎఐ ఎఫ్‌డీవై నాయకులు ఎండీ సుల్తానా బేగం, ఇస్లావత్ దశరథ్ నాయక్, గూడ లావణ్య, ఎండీ రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

'మహిళలకు మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ'

నవతెలంగాణ-యాచారం

మండల పరిధిలోని మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో నరేందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 ఏండ్లలోపు మహిళలకు ఉన్నతి కార్యక్రమంలో భాగంగా మగ్గం పనుల్లో 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఉపాధి హామీలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేసి ఉండాలని తెలిపారు. 10వతరగతి అర్హతుండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉపాధి హామీ ద్వారా రోజుకు రూ. 300లు ఉపకార వేతనం, ఉచిత భోజనం సమకూర్చనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు రేషన్ కార్డు ఆధార్ కార్డు విద్యార్హత ధ్రువపత్రాలు 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఈనెల 20లోపు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తయిన అనంతరం సంబంధిత ధ్రువపత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. అవకా శాన్ని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


సాయిపూర్‌లో కట్ట మైసమ్మ ఉత్సవాలు



నవతెలంగాణ-తాండూరు

తాండూరు పట్టణంలోని 9వవార్డ్ సాయిపూర్‌లోని వీరాశివాజీనగర్ కాలనీలో బుధవారం శ్రీరాయికుంట కట్టమైసమ్మ దేవాలయం పునర్నిర్మాణం సందర్భంగా బుధవారం గోపూజ, అలయప్రవేశం, గణపతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పట్లోళ్ల దీపా నర్సింలు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

12న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం
- రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమా వేశం ఈ నెల 12న శంషాబాద్‌లో జరగనుందని బీజేపీ జిల్లా అధ్య క్షులు బొక్క నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం శంషాబాద్‌లో మల్లిక కన్వెన్షన్ హాల్‌ను బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరగనున్నట్టు తెలిపారు. సమావేశాల ద్వారా తెలంగాణ సమాజానికి కృతజ్ఞతలు తెలపడం జరుగుతుందన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలు బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తారని పేర్కొన్నా రు. కార్యవర్గ సమావేశం ఏర్పాట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్, రాష్ట్ర నాయకులు కొప్పు బాషా, ప్రేమ్ రాజ్ యాదవ్, అంజన్ కుమార్ గౌడ్, మల్లారెడ్డి, శ్రీధర్, జక్కా రవీందర్ రెడ్డి,నరేందర్ రెడ్డి,యాదయ్య గౌడ్, పగడాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కబ్జా గురైన సాలిచెరువు నాలా





- వర్షపు నీళ్ళు పోకుండా మట్టిని నింపిన వైనం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- ఊర చెరువుకు వర్షపు నీరు వెళ్లే నాలా కబ్జా

నవతెలంగాణ-యాచారం

మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్త సాలి చెరువు నుంచి ఊర చెరువుకు వర్షపు నీరు వెళ్లే ప్రధాన నాలా కబ్జాకు గురైంది. ఏకంగా నీళ్ల పోకుండా భూమి యజమాని నాలాలో యథేచ్ఛగా మట్టిని నింపాడు. మల్కీజ్ గూడ మధ్య మేడిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి కింద నుంచి సాలి చెరువు నిండిన అనంతరం వర్షపు నీరు కింద చెరువు వెళ్లడానికి ఏర్పాటు చేసిన గుణాలపైన ఏకంగా భూమి యజమాని మట్టిని నింపి ఏకంగా ఫెన్సింగ్ వేసుకున్నాడు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు చూసుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. నాలా కబ్జాకు గురైందాక ఇరిగేషన్ అధికారులు ఏం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ముందే వర్షాకాలం కావడంతో చెరువులు నిండితే నీళ్ల ఎక్కడి నుంచి పోతాయని స్థానిక ప్రజలు అడుగుతున్నారు. అసలే సాలి చెరువు నుంచి ఈ నాలా ద్వారా వర్షపు నీరు ఊర చెరువులో వస్తుందని స్థానికులు తెలిపారు. భూ యజమాని నిర్లక్ష్యంగా ప్రధాన నాలాలో ఉన్న పైపుల పైన మట్టినివ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కబ్జా గురైన నాలాను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందజేయాలి







- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి వి.వెంకటయ్య
- ఆమనగల్ గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఏటీడీఓ

నవతెలంగాణ-ఆమనగల్

ఆమనగల్ పట్టణంలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని బుధవారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి ఉడుతనూరి వెంకటయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వసతి గృహ రికార్డులను, పరిసరాలను, విద్యార్థులకు సిద్ధం చేసిన వంటకాలను, మరుగుదొడ్లు, మూత్రశాలలను, గదులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకొన్నారు. అనంతరం వసతి గృహ అధికారి రామచంద్రయ్యకు పలు సలహాలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వసతి గృహ అధికారి రామచంద్రయ్యకు సూచించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వెంకటయ్య తెలిపారు. ప్రయివేటు కార్పొరేట్‌కు ధీటుగా ఆశ్రమ పాఠశాలలో ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల వ్యక్తిగత శుభ్రత పై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విమల, కవిత, జ్యోతి, సల్మా కీర్తి, సాంబవి, సునీత, పద్మ, సంతోష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'స్కాలర్ షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్‌విడుదల చేయాలి'



నవతెలంగాణ-చేవెళ్ల

పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, బి.శంకర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22న చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని చేవెళ్ళ పట్టణ కేంద్రంలో కళాశాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, బి.శంకర్‌లు మాట్లాడుతూ..6 ఏండ్లుగా స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. జి ల్లా వ్యాప్తంగా సుమారు రూ.730కోట్లు విడుదల చేసేవి ఉన్నాయన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 7నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. నేటికీ విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యాశాఖ మంత్రి లేకుండా విద్యారంగ పరివేక్షణ ఎలా జరుగుతదని ప్రశ్నించారు. జిల్లాలో విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.730 కోట్లు తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చరణ్, శ్రీకాంత్, సహాయ కార్యదర్శులు శ్రీకాంత్ స్టాలిన్, అరుణ్ జిల్లా కమిటీ సభ్యులు వంశీ, శ్రీను, డివిజన్ నా యకులు సాయి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

'సైబర్ నేరాలపట్ల జాగ్రత్త అవసరం'



నవతెలంగాణ-కొత్తూరు

సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలని కొత్తూరు సీఐ నరసింహారావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని కొత్తూరు తాండ, పలు గ్రామాలలో నూతన చట్టాల పట్ల అవగాహననా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. 'మీ ఫోన్‌కు వచ్చిన ఓటీపీలను బ్యాంకులు ఎప్పుడు అడగవని ఎవరికి షేర్ చేయవద్దు' అని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు జి శ్రీనివాస్, కే శ్రీనివాస్, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నవతెలంగాణ-తాండూరు

తాండూరు మున్సిపల్ పరిధిలోని పాత తాండూర్ 15వవార్డులో నివసిస్తున్న నీరటి సుశీలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. విషయాన్ని నీరటి బాలకృష్ణ రాంచేందర్ నీరటి రమేష్ ద్వా రా తెలుసుకున్న బీఆర్ఎస్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు నీరటి హన్మంతు బివిజి ఫాండెషన్ వ్యవస్థాపకులు డా క్టర్ సంపత్ కుమార్‌కు తెలపడంతో ఆయన వెంటనే స్పందించి మృతురాలు కుటుంబానికి రూ.3వేలను ఆర్థిక సాయాన్ని అందించారు. కుటుంబసభ్యులు బీవీజీ ఫాం డెషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్ కుమార్‌కి కృతజ్ఞ తలు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ, నీరటి రమేష్, బాల కృష్ణ, రాంచేందర్, రామలింగం, శేఖర్ మున్సిపల్ కార్మికుడు వెంకటేష్ పాల్గొన్నారు.

'ఆశాకార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి'



నవతెలంగాణ-కుల్కచర్ల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించి వారికి గౌరవ వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించలని సీఐటీయు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన 'కోర్కెల దినం' నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారంమండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురళీధర్‌కు ఆశా కార్యకర్తలు వినతి పత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ... ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి వారికి కనీస వేతనాన్ని రూ.26 వేలు నిర్ణయించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందించే పీఎఫ్, ఈఎస్ఐ, తదితర చట్టబద్ధ సౌ కర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలకు పే కమిషన్‌న్ను ఎర్పాటు చేయాలని, వైద్య సిబ్బందికి కల్పిస్తున్న సౌకర్యాలను ఆశా కార్యకర్తలకు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సుజాత, నర్సమ్మ, రాధిక, స్వరూప, జంగమ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పై జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు
- టీపీసీసీఎస్‌సీసెల్ ఉపాధ్యక్షులు జల్పల్లి నరేందర్



నవతెలంగాణ-శంషాబాద్

తన భూమితనకు దక్కకుండా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్‌గౌడ్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని బుధవారం టీపీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు జల్పల్లి నరేందర్ అన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో చైర్మెన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి జల్పల్లి యాదయ్యకు శంషా బాద్ మండల పరిధిలోని సమోతం సాతంరాయి గ్రామం సర్వేనెంబర్ 17లో 1978 సంవత్సరం అప్పటి ప్రభుత్వం 12 ఎకరాల భూమి వ్యవసాయం చేసుకోవడానికి ఇచ్చిందని తెలిపారు. అప్పటినుంచి తన తండ్రి వ్యవసాయ పన్ను కట్టుకుంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తూవస్తున్నారని అప్పట్లో పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా ఇచ్చారని తెలిపారు. తర్వాత కబ్జాకాలంలో తన తండ్రి పేరు తొలగించడం వల్ల ఆయన వివిధ శాఖలలో ఫిర్యా దు చేశారని తెలిపారు. ఎమ్మెల్యే పట్ల తాను వ్యతిరేకంగా ఉండి ఆయనపై రాజకీయ పోరాటం చేస్తున్నందుకు దురుద్దేశంతో తన ఇబ్బందులకు గురిచేస్తున్నారని బలవంతంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అనవసరంగా తనభూమి వ్యవహారాలలో జో క్యం చేసుకుంటున్న ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామాలలో సమస్యలు తలెత్తకుండా చూడాలి



- ఎంపీడీవో నరేందర్ రెడ్డి
- తక్కళ్ళపల్లితండా, అయ్యవారిగూడలో నర్సరీల పరిశీలన

నవతెలంగాణ-యాచారం

గ్రామాలలో సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చూడాలని ఎంపీడీవో నరేందర్ రెడ్డి కోరారు. బుధవారం యాచారం మండల పరిధిలో తక్కళ్ళపల్లి తండా, ఏనెకిందితండా, అయ్యవారిగూడల్లో పర్యటించి మొక్కలు నాటే విధానం, డ్రయినేజీ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ఎప్పటికప్పుడు తాగునీరు, వీధి దీపాల నిర్వహణ, డ్రయినేజీ సాఫీగా సాగేందుకు చర్యలు, పరిసరాల పరిశుభ్రత వంటి వాటిపై దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామాలలో దోమల నివారణకు ఫాగింగ్, వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. నర్సరీల ద్వారా పెంచుతున్న మొక్కల సంఖ్యను పెంచాలని చెప్పారు. వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో ఉన్న ఖాళీ ప్రదేశాలలో ఎక్కువ సంఖ్యలో మొక్కలను నాటించాలని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ చొరవతో
లక్ష్మీనగర్ తాండలో బోర్ వేసిన నాయకులు





నవతెలంగాణ-ధారూర్

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాటకు కట్టుబడి స్పీకర్ వికారాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే, గడ్డం ప్రసాద్ కుమార్ మండల కేంద్రంలోని లక్ష్మీనగర్ తాండ గ్రామ పంచాయతీలో నీటి ఎద్దడిని గుర్తించి కాంగ్రెస్ మండల నాయకుల ఆధ్వర్యంలో బోరు వేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో ఎక్కడైతే నీటి ఎద్దడితో గ్రామస్తులు ఇబ్బందుల గురవుతున్నరో అక్కడ గుర్తించి బోర్ వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు వైస్ ప్రెసిడెంట్ ముజఫర్ బాబా ఖాన్, యూనిస్ అశోక్ బుజ్జిగౌడ్ అశోక్ ముదిరాజ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజనాయక్ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'మితిమీరిన వేగం ప్రమాదకరం'



నవతెలంగాణ-శంకర్‌పల్లి

మితిమీరిన వేగంతో వాహనాలను నడిపితే ప్రాణాలు పోవడమే కాక జీవితాంతం నరకం అనుభవించేలా అంగవైకల్యం కూడా ఏర్పడుతుందని రోడ్ సేఫ్టీ ట్రస్టు చైర్మెన్ శ్రీరాంశర్మ, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వాసవి వొకేషనల్ కళాశాలలో సేవా ఫౌండేషన్ అధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్లక్షంగా, అతి ఉత్సాహంగా వాహనాలు నడిపితే మీతో పాటు ఎదుటి వాహనదారుల ప్రాణాలకూ హాని కలుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రాంచందర్, కరెస్పాండెంట్ ప్రియాంక మాట్లాడుతూ మేజర్లు కాకుండా వాహనాలు నడిపితే చట్ట రీత్యా జైలుకు వెళ్లాల్సి రావడమే కాకుండా కుటుంబ పరువుకు భంగం కలిగించిన వారవుతారని హెచ్చరించారు. అనంతరం రోడ్ సేఫ్టీ ట్రస్ట్ చైర్మెన్ శ్రీరాంశర్మ హై కోర్ట్ న్యాయవాది కాబట్టి విద్యార్థులకు చట్టాల పట్ల అవగాహన కలించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సీ.జైరాంరెడ్డి, సభ్యులు రవి యాదవ్, సన్ని పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ





నవతెలంగాణ-ఆమనగల్

కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన వనపర్తి ఆర్ డబ్ల్యు ఎస్ డీఈ దానయ్య మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం దానయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అదేవిధంగా ఆమనగల్ పట్టణంలో ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందిన అరబిందో స్కూల్ నిర్వాహకులు వర్కాల రమణారెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. అంతకు ముందు రమణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షులు చుక్క అల్లాజీ గౌడ్, సీనియర్ నాయకులు వస్పుల జంగయ్య, అవ్వారి శివలింగం, అప్పం శ్రీను, రవీందర్ నాయక్, ఖాదర్ ఖాద్రి, కడ్తాల్‌లో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, మాజీ కో-ఆప్షన్ జహంగీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి వెంకన్నను దర్శించుకున్న మాజీ సర్పంచ్ కేశవులు



నవతెలంగాణ-ఆమనగల్

ఆమనగల్ మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ కేశవులు దంపతులు బుధవారం తిరుపతి వెంకన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల్లో నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులుగా మల్లురవి అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని తిరుపతి వెంకన్నను మొక్కుకున్న సందర్భంగా ఆ మొక్కును చెల్లించుకునేందుకు తిరుపతి వెంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించినట్టు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా పాడి పంటలతో సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని వేడుకున్నట్టు పేర్కొన్నారు.

ఎస్ఐ ని సన్మానించిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ-ఆమనగల్

ఇటీవల ఆమనగల్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన బీ. వెంకటేష్ ను బుధవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షులు తెల్గమల్ల జగన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఎస్ఐ వెంకటేష్ ను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వస్పుల మానయ్య, నాయకులు కష్ణ నాయక్, వస్పుల శ్రీశైలం, సురేష్, బాబా, ఫరీద్, అబ్దుల్ ఖాదర్, నాజర్, మహేష్, ఫిరోజ్, అశోక్, శేఖర్ గౌడ్, మైసయ్య, కాలే మల్లయ్య, మల్లేష్ నాయక్, రఫీ, శివ, గోపాల్, హరిలాల్, సురేష్ నాయక్, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ ఉరేసుకుని రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-కేశంపేట

అనారోగ్యంతో బాధపడుతూ, మనస్తాపం చెందిన ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన కేశంపేట మండలం దత్తాయపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం దత్తాయపల్లి గ్రామానికి చెందిన యార బాల్‌రాజ్ (58) కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఆయనకు జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి. రాజ్ కుమార్ తెలిపారు.



కస్తూర్బా భవనం వెంటనే ప్రారంభించాలి

- డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా

నవతెలంగాణ-ఆమనగల్

కడ్తాల్ మండల కేంద్రంలో విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించిన కస్తూర్బా పాఠశాల భవనాన్ని వెంటనే ప్రారంభించాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్, కడ్తాల్ మండలాల పీఏసీఎస్ చైర్మెన్ గంప వెంకటేష్ గుప్తా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆమనగల్ పట్టణంలో ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వ హయాంలో రూ.3.50 కోట్లతో నిర్మించిన కస్తూర్బా పాఠశాల భవనాన్ని వెంటనే ప్రారంభించి విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆయన ఎమ్మెల్యేకు విన్నవించారు. అద్దె భవనంలో కొనసాగుతున్న కస్తూర్బా పాఠశాలను ఖాళీ చేయడంతో కందుకూరు, ఆమనగల్ కస్తూర్బా పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పాఠశాల భవనం ప్రారంభిస్తామని హామీనిచ్చారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ



నవతెలంగాణ-శంకర్‌పల్లి

ఇటీవల జరిగిన ఉపాధ్యాయ సాధారణ బదిలీల్లో భాగంగా షాబాద్ మండలంలోని ప్రాథమిక పాఠశాల మన్మరికి బదిలీ అయిన ఉపాధ్యాయులు మర్పల్లి అశోక్ బుధవారం తన కూతురు సుదీక్ష పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు వెంకటమ్మమర్పల్లి అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశలోనే లక్ష్యంతో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. వాటిని సాధించేందుకు ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను నిత్య పఠనను ఆచరణలో పెట్టిడే ఆశయ సాధన సులభమవుతుందన్నారు. అందుకు చక్కటి క్రమశిక్షణను కలిగి బాగా చదువుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు బాగా చదువుకుంటే, వారికి చదువుకు అవసరమైన సామాగ్రి దాతల సహకారంతో మరింత సమకూరుస్తానని ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మొసలి కన్నీరు కార్చడమెందుకు?

- కాంగ్రెస్ పట్టణ నాయకులు సీహెచ్. ప్రశాంత్



నవతెలంగాణ-శంకర్‌పల్లి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినప్పుడు లేని ఆలోచన బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్‌కు, హరీశ్‌రావుకు ఇప్పుడెందుకు వస్తుందని కాంగ్రెస్ పట్టణ నాయకులు సీహెచ్. ప్రశాంత్ అన్నారు. బుధవారం శంకర్‌పల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొనుగోలు చేశారో అందరికీ తెలిసిన విషయమేనన్నారు. వారు చేస్తేనేమో ఒప్పు, ఇతరులు చేస్తే తప్పా అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్‌ను నామరూపం లేకుండా చేయాలనుకున్న మాజీ సీఎం కేసీఆర్ ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ లేకుండా పోతుంటే ఆ పార్టీ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్, కేసీఆర్ కుటుంబం మాత్రమే ఉండాలనే దురుద్దేశ్యంతో ఇతర పార్టీ ఎమ్మెల్యేలను విచ్చలవిడిగా బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని అన్నారు. చట్టాలు చేసే ముందు ఇతర పార్టీ సభ్యులతో చర్చించడం చూశాం కానీ, పార్టీలో చేరమని ఒత్తిడి చేసే పార్టీని చూడలేదన్నారు. అలాంటి సంస్కృతిని మొదలు పెట్టిందే బీఆర్ఎస్ పార్టీయనీ, ఇప్పుడు తమ పార్టీకి నష్టం జరుగుతుందని మొసలికన్నీరు పెట్టడమెందుకుని నిలదీశారు.


హనుమాన్ ఆలయ నిర్మాణానికి విరాళం



నవతెలంగాణ-తాండూరురూరల్

తాండూరు మండలం అంతారం గ్రామంలో హనుమాన్ ఆలయ పున నిర్మాణానికి తాండూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీపానర్సింలు రూ.లక్షా16 వేల చెక్కును బుధవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాలయ నిర్మాణానికి తమవంతు సహాయంగా విరాళం అందించినట్టు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ వడ్డే శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శాంతప్ప, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఆమనగల్

మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన శెట్టిపల్లి పెంటయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక తాజా మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తనవంతు తక్షణ సహాయంగా వారికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యా, వైద్యం, ఉపాధికి పెద్దపీట

- కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఆమనగల్ పట్టణంలో ఆస్పత్రి భవనం నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-ఆమనగల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యం, ఉపాధి రంగాలకు పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయా శాఖల అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆమనగల్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణం త్వరలో తీరనుందన్నారు. ఈ ప్రాంతంలోని పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆస్పత్రి భవనం శీఘ్రంగా పూర్తయ్యేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పుకొచ్చారు. నాలుగు మండలాలకు ముఖ్య కూడలిగా ఉన్న ఆమనగల్ పట్టణంలో ఆరు అంతస్తులతో అధునాతనమైన ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. భవనం నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.17.50 కోట్లతో పాటు అదనంగా మరో రూ.10 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా ఆమనగల్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం, డిగ్రీ కళాశాలతో పాటు పాలిటెక్నిక్ కళాశాల, ఐటీఐ తదితర విద్యాలయాల ఏర్పాటుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లుతున్నట్టు ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు కావలసిన స్థలాన్ని గుర్తిస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. అదేవిధంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎస్‌బిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. జంగారెడ్డి పల్లి నుంచి నాగిళ్ళ వరకు పెండింగ్ లో ఉన్న డి 82 కాల్వ పనులను సెప్టెంబర్ నుంచి డిసెంబర్ 25 వరకు పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. అగష్టు 1 లోపు రూ.2 లక్షల వరకు ఒకే విడతలో రైతు రుణ మాఫీ అమలు చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల అభిప్రాయం సేకరణ అనంతరం రైతు భరోసా పథకం అమలు జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



-ప్రకటించిన విధంగానే పరీక్షలు..

ఉద్యోగాల నోటిఫికేషన్‌లో పొందు పరిచిన విధంగానే పరీక్షలు ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. గత పదేండ్లల్లో నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం నేడు గ్రూప్ వన్ పరీక్షకు సంబంధించి కాలయాపన కోసం 1:100 పిలవాలని కుట్రలు చేస్తుందని ఆయన ఆరోపించారు. అదేవిధంగా గత 14 ఏండ్లుగా ప్రమోషన్లు బదిలీలు లేక ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు అన్నివిధాలా న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ కమిటీ సభ్యులు బాలాజీ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత, వైద్య విధాన పరిషత్ డీఈ రవీందర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, మున్సిపల్ చైర్మెన్ నేనావత్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మెన్ భీమనపల్లి దుర్గయ్య, కౌన్సిలర్లు లక్ష్మణ్, విజయ్ కృష్ణ, కృష్ణ యాదవ్, చెన్నకేశవులు, కృష్ణ నాయక్, రాధమ్మ వెంకటయ్య, సోనా జైరామ్ నాయక్, రాములు, కోఆప్షన్ శ్రీధర్, వైద్య అధికారులు పరీక్షిత్ నరేందర్, డాక్టర్ నాగరాజు, హెచ్ఈఓ తిరుపతి రెడ్డి, నాయకులు వస్పుల జంగయ్య, నిట్ట నారాయణ, ప్రభాకర్ రెడ్డి, తెల్గమల్ల జగన్, వస్పుల మానయ్య, అప్పం శ్రీను, రామకృష్ణ, కృష్ణ నాయక్, శ్రీశైలం, భాస్కర్ రెడ్డి, వేణు పంతులు, విజయ్, మెకానిక్ బాబా, విజయ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీను నాయక్





నవతెలంగాణ-షాద్‌నగర్

మున్సిపల్, గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించండని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీను నాయక్ అన్నారు. కార్మికుల కోరికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఫరూఖ్ నగర్ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ కార్మికుల అందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్ కార్మికులకు చెల్లించాలని 73 షెడ్యూల్లో పరిశ్రమల జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలన్నారు. అనేక సంవత్సరాలుగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, లేనిచో కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిఘటించి పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజు, యాదయ్య, కిష్టయ్య, వెంకటయ్య, కమలమ్మ, లక్ష్మమ్మ, అంజమ్మ, యాదయ్య, రాములమ్మ సత్యమ్మ, లక్ష్మమ్మ, జ్యోతి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముద్దెంగూడ-ఎర్రోనిగూడ నక్ష బాట విడిపించాలి

- ముద్దెంగూడ-ఎర్రోనిగూడ గ్రామస్తుల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-షాబాద్

ముద్దెంగూడ గ్రామం నుంచి ఎర్రోనిగూడ గ్రామానికి వెళ్లే నక్షబాటకు దారి ఇవ్వాలని ముద్దెంగూడ గ్రామస్తులు తహసీల్దార్ అన్వర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ..ఎర్రోనిగూడ గ్రామానికి వెళ్లే దారి పక్కన ఉన్న భూమి సర్వే నెంబర్ 1480లో ఒగ్గు చిన్నయాదమ్మ ఏడు ఎకరాల 38 గుంటలు, ఒగ్గు శివకుమార్‌కు 2 ఎకరాల 26 గుంటలు, ఒగ్గు సంపత్‌కుమార్‌కు 2ఎకరాల 26 గుంటల భూమి ఉంది. అయితే అదే దారి గుండా గ్రామానికి చెందిన వారి పొలాలు కూడా ఉన్నాయి. వారి పొలాలకు వెళ్లాలంటే ఈ నక్షబాట నుంచే వెళ్లాలి. ఈ నక్షబాట నుంచి వెళ్లకుండా అడ్డంగా కంచెను వేశారని గ్రామస్తులు ఆరోపించారు. పక్క దారిలో శ్మశాన వాటిక ఉంది. కావున నక్షబాటకు అడ్డంగా వేసిన కంచెను తీసి గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అలాగే నక్ష బాటను కబ్జా చేసిన వారిపై తగిన చర్య తీసుకుని గ్రామస్తులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎం. నర్సింహులు, బి.సురేష్, కె. వెంకటయ్య, ఎస్. లింగం, పి.నర్సింహులు, కె.సుదర్శన్, బి.వెంకటేష్ గౌడ్. టి.మల్లయ్య, రాంచంద్రయ్య, శివకుమార్, తదితరులున్నారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన దుండగులు

నవతెలంగాణ-కేశంపేట

గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని హుండీ తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన కేశంపేట మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం శ్రీ దవళగిరి వెంకటేశ్వర స్వామి గుట్టపై ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో గుర్తుతెలియని దుండగులు ఉండి తాళాన్ని పగలకొట్టి అందులోని డబ్బులను దోచుకువెళ్లారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో, చెర్ల మైసమ్మ అమ్మవారి వద్ద ఉన్న హుండీల తాళాలను కూడా దుండగులు పగలగొట్టేందుకు ప్రయత్నించారు. ఎస్ఐ రాజ్ కుమార్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజారిగా విధులు నిర్వహిస్తున్న దిదియాల బ్రహ్మచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.రాజ్‌కుమార్ తెలిపారు.



విలేకర్ల సంఘం అధ్యక్షుడిగా వహీద్



నవతెలంగాణ-కొందుర్గు

కొందుర్గు మండల విలేకర్ల సంఘం అధ్యక్షుడిగా ఆంధ్రప్రభ రిపోర్టర్ ఎండీ వహీద్ అహమ్మద్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ వివరాలు గౌరవ అధ్యక్షుడిగా కె.కృష్ణయ్యగౌడ్, అధ్యక్షుడిగా ఎండి వహీద్ అహ మ్మద్, ఉపాధ్యక్షుడుగా కె. శంకర్‌జీ, ప్రధాన కార్యదర్శిగా పంబళ్ల వెంకటయ్య, కోశాధికారిగా కె.శేఖర్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీని మీడియా సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ శ్రీ వినాయక గ్యాస్ ఏజెన్సీ యజమాని బి. అశోక్‌రెడ్డి, పాత్రికేయులు బి.లక్ష్మీనారాయణ, జి. బాలయ్య, ఈ సత్యనారాయణ, డి.లక్ష్మణ్, బాలేశ్వర్, బి. మల్లేష్, రవి, రాములు, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆశాలకు చట్టబద్ధత సౌకర్యాలు కల్పించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బీసా సాయిబాబు
- డిప్యూటీ తహసీల్దార్ జంగయ్యకు వినతిపత్రం అందజేత
- సీఐటీయూ ఆధ్వర్యంలో కోర్కెల దినోత్సవం

నవతెలంగాణ-కొత్తూరు

ఆశా వర్కర్ల చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బిసా సాయిబాబు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జరిగే కోరికల దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన ఆశా వర్కర్లతో కలిసి కొత్తూరు, నందిగామ మండల రెవెన్యూ కార్యాలయాలలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆశాల కనీస వేతనం 26 వేలకు పెంచి, పీఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యాలను కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎన్ హెచ్ స్కీంకు బడ్జెట్ పెంచి ప్రయివేటీకరణ చేయవద్దన్నారు. ఆశా వర్కర్లకు నష్టం కలిగించే పరీక్షలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలిపారు. ఆశా వర్కర్లకు ప్రతినెలా రూ. 10 వేల పెన్షన్ సౌకర్యం కల్పించి, స్కీం వర్కర్లకు కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో 15 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు మాధవి, బుజ్జి, చిట్టి, లక్ష్మి, ఇందిరా, అనిత, అమీనా బేగం, శశిరేఖ, జహీర్ బి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా నిరసన

నవతెలంగాణ-మొయినాబాద్

దేశవ్యాప్తంగా కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా బుధవారం నాగిరెడ్డిగూడ గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం మొయినాబాద్ మండల అధ్యక్షులు ముంజగల ప్రభుదాస్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిందనీ, గత పదిహేను ఏండ్లుగా సాగించిన సంస్కరణలు ప్రయివేటీకరణ విధానాలను తొందరగా అమలు చేసేందుకు ఆరాటపడుతుందని దుయ్యబట్టారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని బీజేపీ ప్రభుత్వం ప్రకటించేసేందుకు సిద్ధమవుతోందన్నారు. కార్పొరేట్ మతోన్మాద విధానాలను అమలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు జులై 10న కోరికల దినోత్సవాన్ని జరుపుతూ నిరసన తెలియజేసినట్టు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు రమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా టీపీసీసీ సభ్యులు, అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆమనగల్

ఆమనగల్, కడ్తాల్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం టీపీసీసీ కార్యవర్గ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలో మండల అధ్యక్షులు సబావత్ బిచ్యానాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో కేక్‌ను డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్, తదితరులు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు కేతావత్ హీరాసింగ్ నాయక్, మాజీ సర్పంచ్లు పోతుగంటి శంకర్, నరేందర్‌నాయక్, నాయకులు జహంగీర్ అలి, లక్ష్మయ్య, మల్లేష్‌గౌడ్, తులసి రామ్‌నాయక్, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

-ఆమనగల్ పట్టణంలో కాంగ్రెస్ అధ్యక్షులు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షులు వస్పుల మానయ్యల ఆధ్వర్యంలో శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పార్టీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖలీల్, ధనుంజయ, మండ్లి రాములు, కృష్ణ నాయక్, వస్పుల శ్రీశైలం, సురేష్, బాబా, ఫరీద్, అబ్దుల్ ఖాదర్, నాజర్, మహేష్, ఫిరోజ్, అశోక్, శేఖర్ గౌడ్, మైసయ్య, కాలె మల్లయ్య మల్లేష్ నాయక్, రఫీ, శివ, గోపాల్, హరిలాల్, సురేష్ నాయక్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



'రక్తదానం ప్రాణదానం'



నవతెలంగాణ-మొయినాబాద్

రక్తదానం ప్రాణదానంతో సమానమని చైతన్య యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తం రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్ నగర్ లో ఉన్న చైతన్య యూనివర్సిటీలో రక్తదాన శిబిరాన్ని కొటేక్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తం రెడ్డి పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఆపదలో ఉన్న వారికీ, శిబిరాల ద్వారా సేకరించిన రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించిందని ఆయన తెలిపారు . ఈ కార్యక్రమంలో కోటెక్స్ ఆస్పత్రి డాక్టర్ శ్రీకాంత్, అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డి, డాక్టర్ పవన్ కుమార్, శంకర్, కుమారస్వామి, వై. గాయత్రి, గోపీనాథ్, గాదే రాంబాబు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట నూతన ఎస్ఐగా టి. రాజ్ కుమార్



నవతెలంగాణ-కేశంపేట

కేశంపేట నూతన ఎస్ఐగా టీ.రాజ్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన కొప్పుగిరి లింగం హైదరాబాద్ లోని కూకట్‌పల్లికీ బదిలీపై వెళ్లారు. శంషాబాద్ నుంచి వచ్చిన రాజ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. న్యాయపరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- అయ్యవారిపల్లి, తంగేడుపల్లి వంతెనల నిర్మాణ పనులు పరిశీలన



నవతెలంగాణ-కొందుర్గు

షాద్‌నగర్ నియోజకవర్గంలో ఆయా గ్రామాలకు మధ్య నిర్మిస్తున్న వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ శ్రేణులు కలిసి ఆయన వంతెనల నిర్మాణాలను పరిశీలించారు. నియోజకవర్గంలోని ఫరూక్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామంలో రూ. 4.5 కోట్ల నిధులతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అదేవిధంగా కొందుర్గు మండలం తంగేడుపల్లి వద్ద 3.8 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న మరో వంతెన పనులను కూడా ఆయన పరిశీలించారు అనంతరం ఎమ్మెల్లే స్థానిక ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత తొందరగా వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసే విధంగా అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వాగులు పొంగి పొర్లిన సమయంలో ఆయా గ్రామాల మధ్య రవాణాతో ఇబ్బందులు తొలగించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తున్న వంతెనల విషయంలో అధికారులు శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ రెండు వంతెనలు అందుబాటులోకి వచ్చే విధంగా ఉన్నతాధికారులతో కాంట్రాక్టర్లతో మాట్లాడుతానని ఎమ్మెల్యే స్థానికులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొందుర్గు మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

' నేడు శంకర్‌పల్లి మున్సిపల్‌లో వన మహెూత్సవ కార్యక్రమం'



నవతెలంగాణ-శంకర్‌పల్లి

సీడీఎంఏ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఎమ్మెన్నార్ వెంచర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మెన్, కౌన్సిలర్లు కో-ఆప్షన్ సభ్యులు తదితరులు హాజరుకావాలని కోరారు. ప్రతి సంవత్సరం జూలై నెలలో మొక్కలు నాటే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. చెట్లు లేకపోవడం వల్ల వర్షాలు కూడా సకాలంలో రావడం లేదనీ, అందువల్ల ప్రతి ఒక్కరూ నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించి, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

పనికి తగ్గ వేతనం అమలు చేయాలి

- సీఐటీయూ ఏరియా కన్వీనర్ జే.పెంటయ్య



నవతెలంగాణ-ఆమనగల్

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పనికి తగ్గ వేతనం అమలు చేయాలని సీఐటీయూ ఆమనగల్ ఏరియా కన్వీనర్ జె.పెంటయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆమనగల్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ప్లకార్డులు పట్టుకుని కార్మికుల డిమాండ్స్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా కన్వీనర్ పెంటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. జీఓ నెంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అదేవిధంగా అదేవిధంగా మున్సిపల్, గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు నెలనెలా చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వనమహెూత్సవానికి నాటే మొక్కలు సిద్ధం చేసుకోవాలి

- రంగారెడ్డి జిల్లా డీఆర్డీవో అధికారి శ్రీలత

నవతెలంగాణ-మొయినాబాద్

వనమహెూత్సవ కార్యక్రమానికి మొక్కలు నాటేందుకు నర్సరీలలో ఎదిగిన మొక్కలను జాగ్రత్తగా చూసుకోవాలని రంగారెడ్డి జిల్లా డీఆర్డీవో అధికారి శ్రీలత, అడిషనల్ డీఆర్‌డీవో జిల్లా అధికారి సుభాషిని అన్నారు. బుధవారం మండల పరిధిలోని కనకమామిడి నర్సరీ వన పార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలలో ఉన్న మొక్కలను పరిశీలించి వారు మాట్లాడుతూ ప్రభుత్వం వనమహెూత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉన్న నర్సరీల ఎదుగుదలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ప్రభుత్వం సూచించిన వెంటనే మొక్కలు నాటే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సంధ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పదవులు శాశ్వతం కాదు..వ్యక్తిత్వం ముఖ్యం





- కోట్ పల్లి ప్రాజెక్టు ద్వారా 10వేల ఎకరాలకు నీరందించేందుకు మరమ్మతులు
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లకు సన్మానం

నవతెలంగాణ-పెద్దేముల్

వ్యక్తికి పదవులు శాశ్వతం కాదని, వ్యక్తిత్వమే ముఖ్యమని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇటీవల జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పదవి బాధ్యతలు ముగింబ చడంతో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. మండల మాజీ జడ్పీటిసి ధారాసింగ్, పెద్దేముల్ మాజీ ఎంపీటీసీ న్యాయవాది అంబరయ్య, హన్మా పూర్ మాజీ ఎంపీటీసీ లోంక నీలు, మంబాపూర్ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్,తట్టేపల్లి మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్, పాషాపూర్ మాజీ ఎంపీటీసీ కమిలి భాయి, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు నసీర్, బుద్దారం మాజీ సర్పంచ్ రేగోండి లక్ష్మి తదితరులను తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు రమేష్ మహారాజ్‌లు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మా నించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు వారికి జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల కోసం నిరంతరం పనిచేయాలని, పార్టీలో పని చేసే వ్యక్తికి మాత్రమే గుర్తింపు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు ఐక్యతగా ఉండి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రజల్లో గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ధారాసింగ్ ప్రజా సేవలో మరింత ముందుకు నడవాలని సూచించారు. గత 35 ఏండ్లు బాధ్యతగా పార్టీని అన్ని విధాలుగా అభివృద్ధికి కృషఇ చేసిన వ్యక్తి ధారాసింగ్ అని అభినందించారు. రాజకీయ నాయకులకు సన్మానించడం చాలా అరుదుగా ఉంటాయన్నారు. 10 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని విమర్శించారు. కోట్ పల్లి ప్రాజెక్టు ద్వారా అదనంగా మరో 800 ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రాజెక్టు ద్వారా 10వేల ఎకరాలకు నీరు అందించే సామర్థ్యంతో కోట్ పల్లి ప్రాజెక్టుకు మరమ్మతులు చేపడుతున్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ రియాజ్, పార్టీ మండల అధ్యక్షులు గోపాల్, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ అంజయ్య, వైస్ చైర్మెన్ మంబాపూర్ నారాయణరెడ్డి, జిల్లా మాజీ చైర్మెన్ నారాయణరెడ్డి, మురళి గౌడ్, జిల్లా నాయకులు ఎల్లారెడ్డి, మైపాల్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా, మాజీ జడ్పీటీసీ రాకేష్, రాష్ట్ర నాయకులు ఉత్తమ్ చంద్, డాక్టర్ సంపత్ కుమార్, తాండూర్ ఏ బ్లాక్ అధ్యక్షులు లోంక నర్సింలు, ఎన్ఎస్‌యూఐ మాజీ జిల్లా అధ్యక్షులు రాములు నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ బుజ్జమ్మ, గ్రామ కమిటీల అధ్యక్షులు మైపూజ్, డివై నర్సింలు, మాజీ సర్పంచులు తారాబాయి, వెంకటయ్య, బాబు సింగ్, శివరాం, మాజీ ఉపసర్పంచ్ గోపాలకృష్ణ, నేతలు డీవై నర్సింలు, రవిశంకర్, ఆనంద్ చారి,కోళ్ల గోపాల్, సామేల్, మల్లప్ప, రాజు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ముడిమ్యాల అటవి ప్రాంత అభివృద్ధికి రూ.26 కోట్లు మంజూరు

- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి

నవతెలంగాణ-చేవెళ్ల

ముడిమ్యాల అటవి ప్రాంత అభివృద్ధికి రూ.26 కోట్లు మంజూరైనట్టు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ మాజీ అధ్యక్షులు పడాల వెంకటస్వామి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి, ముడిమ్యాల సహకార సంఘం చైర్మెన్ గోనె ప్రతాప్ రెడ్డిలతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల మండలం లోని ముడిమ్యాల అటవి ప్రాంతం అభివృద్ధికి రూ.26 కోట్లు మంజూరు కాగా ఇందులో రూ.13 కోట్లు అటవీశాఖ, రూ.13 కోట్లు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ద్వారా కేటాయింపు జరిగినట్టు తెలిపారు. హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ఈనెలాఖరులోగా ప్రారంభమవుతాయని అన్నారు. బీజపూర్ హైవే విస్తరణ పనులకు అడ్డంకులు తొలగిపోయాయన్నారు. ఇన్ని రోజులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పనులు జరగలేదని గుర్తుచేశారు. హైదరాబాద్-బీజాపూర్ హైవే పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఫారెస్ట్ అభివృద్ధి చెందితే చేవెళ్ల ప్రాంతం అభివృద్ధి చెందుతుందనీ చుట్టుపక్కల గ్రామాల యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, భీమయ్య, గోపాల్ రెడ్డి, మధుసూదన్ గుప్తా, ప్రభాకర్, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, ఓబీసీ మండల సెల్ అధ్యక్షులు సూర్యపేట్ శ్రీనివాస్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, నాయకులు పాండుయాదవ్, మల్లారెడ్డి, జనార్ధన్, మాణిక్యం తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్‌రావు



నవతెలంగాణ-షాద్‌నగర్

రాష్ట్రంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం లేబర్ అడ్డ దగ్గర నిర్వహించిన కార్మికుల కోర్కెల దినాన్ని కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మైలారం జంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని, మాట్లాడుతూ గత పదేండ్లు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై నిరసిస్తూ, ప్రజా సంఘాల కార్మికుల ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించినట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతరాష్ట్ర వలస కార్మికుల చట్టం 1996 భవన నిర్మాణ కార్మికుల సమగ్ర చట్టాలను రక్షించాలనీ, వాటిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్‌కోడ్‌ను వెంటనే రద్దు చేసి, ప్రభుత్వ సంస్థలు ప్రయివేటీకరించొద్దని డిమాండ్ చేశారు. భవన నిర్మాణంలో వినియోగించే ఇసుక, ఇటుక, సిమెంట్, స్టీలు, పెయింట్ వంటి ముడి సరుకులు ధరలు నియంత్రించాలన్నారు. భవన కార్మికులు ప్రమాదంలో మృతి చెందితే ఇస్తున్న రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ పెంచాలన్నారు. అదే విధంగా సహజ మరణం సంభవించిన కార్మికులకు ఇస్తున్న రూ. లక్షా నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలిపారు. లేని యెడలా కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి ఐక్య ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్, భవననిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కావలి రవికుమార్, రాజునాయక్, వందనం శ్యామ్, మల్లేష్, శ్రీరాములు, రమేష్, గోపాల్, యాదయ్య, చెన్నయ్య, శ్రీశైలం, విజయ్ కుమార్, వెంకటేష్, రాములు, పాండు, కృష్ణయ్య పాల్గొన్నారు.



కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస చంద్రయ్య

నవతెలంగాణ-కొడంగల్

అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ కార్మికుల కోరికలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస చంద్రయ్య అన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రములోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి, కోరికల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ వర్కర్స్ రంగాల కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగస్తులను గుర్తించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. గత 40 ఏండ్ల నుంచి పేదలందరికీ అనేక సేవలు చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సేవలతోనే ఈ దేశంలో బడుగు, బలహీన వర్గాలు మరణాల రేటు తగ్గిందన్నారు. గ్రామ పంచాయతీ వర్కర్లకు వేతనాలు ఆరునెలలుగా అందక, పూట గడవడం కూడా కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులు గ్రామాలు పరిశుభ్రతలో కీలక పాత్ర వహిస్తారని తెలిపారు. తక్షణమే కనీస వేత నాలు రూ.26 వేలు అమలు చేసి, ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పాలకులు వాటికి తూట్లు పొడుస్తున్నారని తెలిపారు. తక్షణమే స్కీం వర్కర్ల అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరికల దినం సందర్భంగా డిమాండ్ చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు నర్సింగమ్మ, కవిత, పద్మ మటూర్ రాములు, దస్తప్ప, పకీరప్ప, బీములు, మల్కప్ప పాల్గొన్నారు.

నేవీ పోలీసుకు ఎన్నికైన నవీన ఆదర్శ పాఠశాల విద్యార్థి అభితేజ గౌడ్



నవతెలంగాణ-కొడంగల్

నవీన ఆదర్శ పాఠశాల విద్యార్థి నేవీ పోలీసుగా రవితేజ గౌడ్ ఎన్నిక కావడం చాలా సంతోషమని నవీన ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్ రాజ్ అన్నారు. కొడంగల్‌లోని నవీన ఆదర్శ పాఠశాలలో చదువుకున్న విద్యార్థి నేవీ పోలీసుగా ఎన్నికైన అభిలాష్ గౌడ్‌ను, ఆయన తల్లిదండ్రులను నవీన ఆదర్శ పాఠశాల ఫౌండర్ వెంకటయ్య, ప్రిన్సిపాల్ నరేష్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయ బృందం, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నవీన్ ఆదర్శ పాఠశాల నరేష్ మాట్లాడుతూ నవీన ఆదర్శ పాఠశాలలో 2023లో పదోవ తరగతి అభితేజగౌడ్ పూర్తి చేసినట్టు తెలిపారు. 17 సంవత్సరాల వయసులోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించిన అభితేజగౌడ్‌కు అభినందనలు తెలిపారు. అభితేజను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, జనార్ధన్, మహేందర్, శకుంతల, సంగీత, మీరాజ్ బేగం, సనాబేగం, గౌసియా బేగం, ఫాతిమా నాజియా, అరుణ జ్యోతి, అరుణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలి

- రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్‌రావు

నవతెలంగాణ-తలకొండపల్లి





ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలని, డిజిటల్ క్లాసులను క్రమం తప్పకుండా బోధించాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్‌రావు అన్నారు.బుధవారం తలకొండపల్లి మండల పరిధిలోని పాఠశాలలను చంద్రధన ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలోని, వెల్జాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల, బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల కొరతున్న దగ్గర బాలికలు, బాలుర పాఠశాలలు ఒకే కాంపౌండ్ వాల్‌లో ఉన్నప్పుడు ఉమ్మడి టైం టేబుల్ తయారు చేసుకుని బోధించాలన్నారు. మధ్యాహ్న భోజనం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంగ్లీష్ మీడియం ఈ ఏడాది నుంచి ప్రతీ పాఠశాలలో ప్రవేశపెడుతున్నామని తెలిపారు. 18 ఏండ్లు నిండిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. బాలికలతో ఆయన మాట్లాడుతూ 'మీ ఇంట్లో అన్నయ్యలను, తమ్ములు, ఎక్కడ చదువుతున్నారనీ ఆరా తీశారు. వారిని ప్రయివేట్ పాఠశాలలకు పంపిస్తున్నట్టు' తెలిపారు. ఆడ, మగ అనే తేడా లేకుండా సమానంగా చూడాలన్నారు. డిజిటల్ తరగతులు, సైన్స్‌ల్యాబ్, గ్రంథాలయం, టాయిలెట్స్, పాఠశాల పరిసరాలు పరిశుభ్రతపై, రన్నింగ్ వాటర్ ఉన్నదా లేదా అని పరిశీలించారు. భోజన విషయంలో విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి, మధ్యాహ్న భోజనం, డిజిటల్ క్లాసెస్, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు టాయిలెట్స్, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, హరితహారం, పాఠశాలలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించి పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేజీబీవీ పాఠశాలలో మెనూ పరిశీలించి విద్యార్థులతో పాఠాలు చదివించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ సర్దార్‌నాయక్, విద్యాధికారి కడ్తాల్ మండల నోడల్ అధికారి జంగయ్య, అమన్‌గల్ నోడల్ ఆఫీసర్ పాండు తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ బి.రాజేష్



నవతెలంగాణ-ఆమనగల్

శంషాబాద్ డీసీపీ బి.రాజేష్ బుధవారం ఆమనగల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు పరిసరాలను పరిశీలించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి వాటి నిర్వహణకు పలు సలహాలు సూచనలు తెలిపారు. కేసుల నమోదు, పరిష్కారం అయిన కేసుల వివరాలను సీఐ ప్రమోద్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాజీ లేకుండా విధులు నిర్వహించాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్, తలకొండపల్లి ఎస్ఐలు వెంకటేష్, శ్రీకాంత్, ఏఎస్ఐలు యాదయ్య, బాల్ రెడ్డి, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్ సీఈసీలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం




కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రత్యేక అధికారిణి దేవి

నవతెలంగాణ-కుల్కచర్ల

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో తెలుగు మీడియం మొదటి సంవత్సరం సీఈసీ గ్రూప్‌లో మిగిలిన 10 సీట్ల భర్తీకి ఆసక్తిగల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రత్యేక అధికారిణిదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత వెనుకబడిన పేదవిద్యార్థిను లు, తల్లిదండ్రులు లేని పిల్లలు, ఒంటరిగా ఉన్న పిల్లలకు ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. ఈ నె ల 31లోపు దరఖాస్తులను అందజేయాలని సూచించారు. మరింత సమాచారానికి 955033 5857 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

రేపు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

తహసీల్దార్ మురళీధర్



నవతెలంగాణ-కుల్కచర్ల

మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో శుక్రవారం కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారన్నారు. లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

రహదారులు పరిశుభ్రంగా ఉండాలి



- జడ్సీ ఉపేందర్‌రెడ్డి

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

రహదారులను శుభ్రం చేసే విషయంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది మరింత శ్రద్ధగా పనిచేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి సూచించారు. వ్యర్థాలను వెను వెంటనే తొలగించాలని అందులో ఎటువంటి నిర్లక్ష్యమూ వద్దని స్పష్టం చేసారు. శేరిలింగంపల్లి జోన్ పరిధి లో బయో డైవర్సిటీ, కొత్తగూడ కూడళ్ల, రాడిసన్ హెూటల్ రోడ్, రోలింగ్ హిల్స్, మస్జీద్ బండ, కొండాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాలలో జడ్సీ ఉపేందర్‌రెడ్డి బుధవారం పర్యటించి పారిశుద్ధ్య పనులతో పాటు రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ కూడళ్ల నిర్వహణను మరింతగా మెరుగు పరచాలని, రహదారుల పక్కన ఇసుక మట్టి పేరుకొనకుండా ఎప్పటికపుడు శుభ్రం చేయాలని సూచించారు. సర్కిల్‌లో డీసీ స్థాయి నుంచి కింది స్థాయి వరకు పర్యవేక్షక అధికారులు రోజువారీ పారిశుద్ధ్య పనులను పరిశీలించాలని, ఎటువంటి లోటు ఉన్నా తక్షణ సవరణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొత్తగూడ కూడలిలో ఏఎంబీ మాల్ రోడ్‌లో రహదారిపై ఉన్న ఎత్తు పల్లాలను తక్షణమే సరి చేయాలని సూచించారు. జడ్సీ వెంట ఇతర అధికారులు పాల్గొన్నారు.

60 ఏండ్లు పైబడిన వీఆర్ఏ వారసులకు నియామకాలు చేపట్టాలి

- వీఆర్ఏల వారసుల సంఘం పరిగి అధ్యక్షుడు సి.యాదయ్య



నవతెలంగాణ-పరిగి

60 ఏండ్లు పైబడిన వీఆర్ఏ వారసులకు నియామకాలు చేపట్టాలని 61 ఏండ్ల పైబడిన వీఆర్ఏల వారసుల సంఘం పరిగి అధ్యక్షుడు సి యాదయ్య అన్నారు. 60 ఏండ్ల పైబడిన వీఆర్ఏల వారసులకు నియామకాలు చేపట్టాలని బుధవారం పరిగి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కా ర్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తూ కారుణ్య ని యామకాల కోసం జీఓఎంఎస్ నెం.81, 85 ప్రకారం 3,797 సంవత్సరాలు పైబడిన వారి వారసుల కోసం జీవో విడుదల చేసిందన్నారు. ఇప్పటి వరకు 17 మంది వీఆర్ఏలు మరణించారని అన్నారు. 'మా కుటుంబాల ఆర్థిక స్థితిగతి బాగోలేదు' అని అన్నారు. కాబట్టి 'మాకు నియామకాలు చేపట్టాలి' అని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్య, గణేష్, బాలు, మహేష్, నర్సింలు, భాస్కర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌కు బదిలీపై వెళ్లిన ఎస్సై ప్రసాద్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-యాచారం

హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ పోలీస్ స్టేషన్ నుంచి ఎస్సై వి ప్రసాద్ సీసీఎస్ ఎల్బీనగర్‌కు బుధవారం బదిలీ అయ్యారు. పోలీస్ స్టేషన్లో సీఐ నర్సింగారావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఎస్సై ప్రసాదును శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం సీఐ మాట్లాడుతూ హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అందించిన సేవలు మరువలేని కొనియాడారు. యాచారం మండల పరిధిలోని రెండు పోలీస్ స్టేషన్లో పనిచేశారని గుర్తు చేశారు. దాదాపు రెండున్నర ఏండ్లుగా ప్రజలకు సేవలు అందించారని తెలిపారు. ఉద్యోగరీత్యా బదిలీ అనేది తప్పదని చెప్పారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో శాంతి భద్రతలపై పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు కే మాధవరెడ్డి



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కలయాపన చేయడానికి బీజేపీ కిషన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు కే మాధవరెడ్డి మాట్లాడుతూ..ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పేరుతో ఇచ్చిన హామీని నెరవేర్చగా పోవడం దురదృష్టకరమని మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అమలు చేయాలన్నారు. రెండు లక్షల వ్యవసాయ రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఏర్పడి 200 రోజులు గడుస్తున్న రైతులకు భరోసా ఇవ్వకపోవడం కౌలు రైతులకు వ్యవసాయ కూలీలకు స్పష్టమైన హామీ రుణమాఫీ కారణంగా బ్యాంకుల్లో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు కౌలు రైతులకు వ్యవసాయ కూలీలకు ఆర్థిక తోడ్పాటు విషయంలో సరైన అవగాహన లేకపోవడం దుర్మార్గమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పంటల బీమా అమలు చేయకుండా రైతులను ఇబ్బందుల పాలు చేసిందని తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమగ్ర పంట బీమా పథకాన్ని అమలు చేస్తామని గొప్పలు చెప్పిన రాష్ట్ర సర్కారు నేటికీ ఆ దిశగా కార్యచరణ లేకపోవడం సౌజన్యమని కిషన్ మోర్చా రైతుల పక్షాన కాంగ్రెస్ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను ఆక్షన్ లేకుండా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిషన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మారుతి కిరణ్, బసవలింగం, చంద్రశేఖర్, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి బ్రహ్మయ్య, మండల కన్వీనర్ చందు నాయక్
- 'కోరికల దినం' పురస్కరించుకొని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-యాచారం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెండ్యాల బ్రహ్మయ్య, మండల కన్వీనర్ చందు నాయక్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కోరికల దినోత్సవాన్ని పురస్కరించుకొని యాచారం మండలం తహసీల్దార్ అయ్యప్పకు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులందరికీ కలిసి కనీస వేతనాలు అమలు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను నిలువరించేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు మొదలుపెట్టిందని విమర్శించారు. పనిచేస్తున్న కార్మికులందరికీ రూ.26 వేల కనీస వేతనాన్ని అమలు చేయాలని తెలిపారు. సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రధాని మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రయివేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. 4 లేబర్ కోడ్‌లు అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తుందని గుర్తు చేశారు. బొగ్గు బ్లాక్ ల వేలానికి కొనుక్కుందని ఆరోపించారు. ఈపీఎఫ్ సకాలంలో చెల్లించని యజమాన్యాలకు విధించే జరిమానాను భారీగా తగ్గించిందన్నారు. కార్పొరేట్, మతోన్మాదులను ప్రసన్నం చేసుకొని వారికి లాభాలు కట్టపెట్టేందుకు నిశ్చయించుకుందని తెలిపారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి వారికి కనీస వేతనం ఇవ్వాలని చెప్పారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆశా వర్కర్లకు ఎగ్జామ్ రద్దుచేసి పారితోషకాలు కాకుండా కనీస వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఐకెపి వివోఏ, వైద్య రంగంలో పని చేస్తున్న స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి గుర్తి చట్టం ప్రకారం వారికి దక్కాల్సిన అన్ని హక్కులను కల్పించాలని వారు డిమాండ్ చేశారు. వారికి పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక యూనియన్ మండల అధ్యక్షుడు కృష్ణ, బీసీడబ్ల్యూ నాయకులు జంగయ్య, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు అండాలు, యాదమ్మ, శోభ, సరిత, వసంత, లలిత, బాలమని, అలివేలు, పద్మ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

సెక్రెటేరియట్ ముట్టడికి చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

తెలంగాణ ఉద్యమ పోరాట నాయకుడు రాజారామ్ యాదవ్ ఆధ్వర్యంలో జూలై 15న సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిస్తు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ కుల సంఘాల మద్దతు తెలుపాలని కోరుతు రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బుధవారం తెలంగాణ బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ సమక్షంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఐటీబీసీఎస్ విద్యార్థి నాయకులు ప్రవీణ్, శివకుమార్ యాదవ్, సురేష్, రాజులు కలిసి యూనివర్సిటీలో జులై 15వ తేదీన సెక్రటేరియట్ ముట్టడి చలో హైదరాబాద్ పోస్టర్ రిలీజ్ చేశారు. అందులో వారి డిమాండ్స్.

తక్షణమే సమగ్రకుల గణనా జరిపి స్థానిక సంస్థలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి. గ్రూప్-2లో అదనంగా 2000 ఉద్యోగాలను కలపాలి. అదేవిధంగా గ్రూప్-3లో కూడా 3000 ఉద్యోగాలను కలపాలి.డీఎస్సీని వాయిదా వేసి మెగా డీఎస్సీ ద్వారా 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. తక్షణమే ప్రభుత్వము రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలి. అదేవిధంగా గ్రూప్ -1లో 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను మెన్స్ కు ఎంపిక చేయాలి. డిమాండ్స్‌కి మద్దతుగా 15వ తేదీన సెక్రటేరియట్ ముట్టడి విజయవంతం చేయాల పేర్కొన్నారు. ఈ సందర్భంగా భేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ అన్ని విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అన్ని బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి శివ కుమార్‌కు గోదా నరేందర్ యాదవ్ తన తల్లిదండ్రు ల పేరిట రూ.10 వేలు విద్యా అవసరాల నిమిత్తం బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ సమక్షంలో అందించాడు. ఈ సందర్భంగా గోదా నరేందర్ యాదవ్ మాట్లాడుతూ..విద్యార్థులకు సహాయం చేయడాన్ని ఒక మొక్కకు నీళ్ల పోసిన విధంగా భావించాలన్నాడు. ఆ మొక్క ఎదిగి చెట్టుగా మారి కొంత మందికి ఫళ్ల రూపంలో నీడ రూపంలో ఇంకా ఎన్నో విధాలుగా సహాయ పడితే అంతకంటే గొప్ప ఇంకేముంటుందన్నారు. ఈ సమాజంలో మనిషికి మనిషే సాయపడాలని విద్యార్థి శివకుమార్ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ ..విద్యార్థులకు విద్యాదానం చేయడం గొప్ప గుణం అని అన్నారు. ఈ గొప్ప గుణం ఉన్న గోదా నరేందర్ యాదవ్‌కు అభినందనలు తెలిపారు. ప్రతి ఏటా 'నేను నా తల్లిదండ్రులు పేరిట విద్యార్థులకు నా వంతు కృషి చేస్తూనే ఉన్నానని నా మిత్రుడు గోదా నరేందర్ యాదవ్ కూడా ఇటువంటి సేవలు చేస్తున్నందున నాకు గర్వంగా ఉంది' అని అన్నారు. విద్యార్థి శివకుమార్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఉన్నత చదువులు చదవాలని అన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. మీరు ఇచ్చిన ప్రోత్సాహంతో చక్కగా చదువుకొని మంచి ఫలితాలు సాధిస్తానని సమాజానికి ఆదర్శంగా నిలుస్తానన్నారు. తనకు ఈ సాయం చేసిన గోదా నరేందర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకుంటు న్నానన్నాడు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా గొర్రె మేకల పెంపకం దారుల జిల్లా అధ్యక్షులు మధు యాదవ్, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు ప్రవీణ్ కురుమ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఐదేండ్లలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాం



- మండల పరిషత్ ఆత్మీయ వీడ్కోలు జిల్లా చైర్మెన్ అనితా రెడ్డి



నవతెలంగాణ-మహేశ్వరం

ఐదేండ్లలో ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామని చైర్మెన్ అనిత రెడ్డి అన్నారు. మండల పరిషత్ ప్రాంగణంలో ఐదేండ్ల పదవీ విరమణ సందర్భంగా ఎంపీడీవో శైలజ రెడ్డి, శాలువా కప్పి పూలమాలతో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మెన్ అనిత రెడ్డి మాట్లాడుతూ పదవి ఉన్నా లేకున్నా ఎల్లప్పుడు ప్రజల్లోనే ఉంటానని అన్నారు. గడిచిన ఐదేండ్లలో ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామ న్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో జిల్లా పరి షత్ నిధులతో సీసీరోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వసతులు ఇచ్చామన్నారు. మండల్‌లోని సర్పంచ్ల ఎంపీటీసీల సహకారంతో కలిసికట్టుగా పనిచేసి ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రజలు ఇచ్చి న గౌరవాన్ని దృష్టిలో ఉంచుకొని మారుమూల గ్రామాలకు సైతం అభివృద్ధి పనులు చేశామన్నారు. గ్రామాలలో ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకు వచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పం చులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



- సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్

నవతెలంగాణ-రాజేంద్రనగర్

తెలంగాణ రాష్ట్రంలో వివిధ రంగాల్లో కార్మికుల ఎదుర్కొంటున్న అనేక సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి పరిష్కరించాలని సీ ఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కురుమయ్య అన్నారు. బుధవారం కార్మికుల డిమాండ్ డే సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ ప్రాంతాల్లోని వివిధ ప్రాంతాల్లో కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని నిరసనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ కురుమయ్య మాట్లాడుతూ..ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నామమాత్రపు మెజార్టీతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు మతోన్మాదులకు పెద్దపీట వేస్తూ బీజేపీ ప్రభుత్వం తమ పాలన కొనసాగిస్తుందన్నారు. రాష్ట్రంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 6 నెలలు అవుతున్న ఇంకా ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తూనే ఉంటామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాస్కర్, స్వామి, ఇమ్రాన్, పార్వతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వాలి

- వీఆర్ఏ సంఘం నాయకులు కే. సంగమేశ్వర్
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ 81, 85 2003 ప్రకారం 3,797 మంది 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు త్వరితగతిన నియామక ఉత్తర్వులు ఇప్పించాలని శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏ సంఘం నాయకులు సంగమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తూ వారసత్వ నియామకాల కోసం జీవో నెంబర్ ఎంఎస్ 81, 85 ప్రకారం 3797 మంది 61 సంవత్సరాలు పైబడిన వారి వారసులకు ఉద్యోగ నియమాకుల కోసం జీవోలు జారీ చేయబడ్డాయని ఇట్టి జీవుల పైన స్టే ఉన్న కారణంగా నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని 2023 నవంబర్ 21న హైకోర్టు డివిజన్ బీచ్ ఉత్తర్వుల ప్రకారం స్టే ఎత్తివేసిందన్నారు. 5 నుండి 10 ఏండ్లుగా 61 ఏండ్లు దాటిన వీఆర్ఏ వారసులము ఉన్నత విద్యా అర్హతలున్నామని 'మా సేవలను తహసీల్దార్ కార్యాలయంలో అందిస్తూనే ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిపోవడానికి తమ వంతు కృషి చేస్తున్నాం' అని ఆయన అన్నారు వీఆర్ఏ కుటుంబాలను ఆదుకోవాలని వారి ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మానసికంగా ఎంతో ఇబ్బందులు పడుతున్నారని 17 మంది వీఆర్ఏలు మరణించారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి 'మాపై కరుణ చూపి మమ్ములను ఆదుకోవాలి' అని కోరారు. కార్యక్రమంలో బి రాజు, హనుమంత్, హైమద్ మర్పల్లి మండల వీఆర్ఏ లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



- సీఐటీయూ మండల కన్వీనర్ ఏర్పుల శేఖర్

నవతెలంగాణ-మహేశ్వరం

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ ఏర్పుల శేఖర్ అన్నారు. కేంద్రంలో 3వసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అన్ని మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో "డిమాండ్స్‌డే" పాటించాలని సీఐటీయూ పిలుపు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీఐటీయూ మండల కన్వీనర్ ఏర్పుల శేఖర్ పాల్గొని మాట్లాడుతూ. స్కీం వర్కర్లలో భాగమైన ఆశాలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26లు, పీఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలన్నారు. 45వ ఐఎల్సి తీర్మానం చేసింది. రాష్ట్రంలో ఆశాలకు ఫిక్సిడ్ వేతనం రూ.18 వేలు నిర్ణయించాలని ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమ్మె సందర్భంగా బీఆర్ఎస్ ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఒక కమిటీ వేస్తామని హామీనిచ్చిందని. ఈ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చాకలి చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులు ప్రారంభం



- దోమల నివారణా చర్యలు చేపడుతున్నాం
- శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి డివిజన్‌లోని చాకలి చెరువులో పెరిగిన గుర్రపు డెక్క తొలగింపు ప్రక్రియను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఎంటమాలజీ ఏఈ కిరణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..గుర్రపు డెక్క పెరగడం వల్ల దోమలు విపరీతంగా వృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. దోమల నివారణకు ఒకవైపు చర్యలు తీసుకుంటూనే మరోవైపు గుర్రపుడెక్క తొలిగింపు పనులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దోమలు ఉత్పత్తి కాకుండా ఉండేందుకుగాను లార్వా దశలోనే నిర్మూలించేందుకు చెరువులో స్ప్రే చేయిస్తున్నామన్నారు. స్థానిక వాసులు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఎలాంటి వైరల్ ఇన్ఫెక్షన్స్ రాకుండా నివారించవచ్చు అని సూచించారు. ఎంటమాలజీ అధికారులతో చర్చించి దోమల బారిన ప్రజలు ఇబ్బందులను పడుతున్నారని, వైరల్ ఇన్ఫెక్షన్స్ వచ్చే అవకాశం ఉన్నందున త్వరితగతిన గుర్రపు డెక్కను తొలగించామని ఆదేశించగా వారు స్పందించి పనులు ప్రారంభించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ. ఎంటమాలజీ ఏఈ కిరణ్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, గోపినగర్‌బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి





- ఆశా వర్కర్లు

నవతెలంగాణ-మర్పల్లి

కొంతకాలంగా ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కొంతకాలంగా ఆందోళన చేస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిం చాలని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ గణేష్‌కి వినతిపత్రం అందించారు మండలంలోని ఆయా గ్రామాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

- తండ్రి, ముగ్గురు పిల్లలను కాపాడిన స్థానికులు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

ఓ కారు చెరువులోకి దూసుకెళ్లగా.. స్థానికుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. కారులో ఉన్న ముగ్గురు పిల్లలు, తండ్రిని స్థానికులు తాడు, ట్యూబ్ సాయంతో బయటకు తీసుకొచ్చి ప్రాణాలను కాపాడారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామపంచాయతీ పరిధిలోని బైరాన్‌కాన్ చెరువులో బుధవారం జరిగింది. సీఐ అంజిరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం బీఎన్.రెడ్డికి చెందిన అశోక్ తన ముగ్గురు పిల్లలతో కలిసి కారులో ఇనాంగూడ చెరువు వైపు వస్తుండగా వాహనం చెరువులోకి దూసుకెళ్లింది. ఆ ప్రాంతానికి దగ్గరలో తాటి చెట్టు పై ఉన్న కల్లు గీత కార్మికుడు పాండుగౌడ్ గమనించి.. వెంటనే అతని కుమారుడికి సమాచారం ఇచ్చాడు. అతను తాడు, ట్యూబ్‌ను తీసుకురాగా చెరువులోకి దూకి.. స్థానికుల సహకారంతో ముగ్గురు పిల్లలు, తండ్రిని సురక్షితంగా బయటకు తీశారు. కొద్దిపాటి ఆలస్యమైనా పెను ప్రమాదం జరిగేది. ఈ ఘటనకు సంబంధించిన కేసును మీర్‌పేట పోలీసు స్టేషన్‌కు బదిలీ చేసినట్టు సీఐ అంజిరెడ్డి తెలిపారు.

శభాష్ గౌడన్న..

కారు చెరువులోకి దూసుకెళ్లగా ప్రాణాలను తెగించి వారిని కాపాడిన స్థానిక గీత కార్మికులు పాండు గౌడ్, అతని కుమారుడు సాయి కుమార్ గౌడ్‌ను పలువురు ప్రశంసించారు. స్థానికుల నుంచి, సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి అభినందనలు వస్తున్నాయి. శభాష్ గౌడన్న అంటూ పోస్టులు వైరలవుతున్నాయి. అయితే ఆర్థిక సమస్యలతో అశోక్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.

పెయిడ్ ఆర్టిస్టులతో ధర్నాలు చేయిస్తారా?

- ఉద్యోగం కోసం వారు దరఖాస్తు కూడా చేయలేదు : బీఆర్ఎస్ నేతలపై ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ నేతలు పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతం ఫైరయ్యారు. ధర్నాలు చేస్తున్న వారిలో కొంత మంది ఉద్యోగం కోసం కూడా దరఖాస్తు చేయలేదని ఆరోపించారు. ఇలాగే చేస్తే బట్టలూడదీసి ఉరికేయాల్సి వస్తుందని హెచ్చరించారు. తన పదవి, రాజకీయం వదిలి మీ ముందుకు వస్తానని సవాల్ విసిరారు. 'జరిగే పడతాం, మీ ముందుకు వస్తాం. దొర దగ్గరే ఉండాలా? ఉద్యోగాలు రావద్దా? ఉద్యోగాలు వస్తున్నాయి అంటే మీకు కడుపులో మంట' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు విద్యార్థులను రెచ్చగొడుతున్నారని చెప్పారు. ఆపార్టీ నేతలు గాదరి కిశోర్, బాల్క సుమన్ పరుష పదజాలంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జాబ్ క్యాలెండర్‌ను ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. తాము బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తమపై కేసులు పెట్టారని విమర్శించారు. గత పదేండ్లలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ ఎందుకు వేయలేదని నిలదీశారు. ఇప్పుడు తాము నోటిఫికేషన్ వేస్తే బీఆర్ఎస్ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ఫైరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డిపై పరుషంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మాజీ సీఎం కేసీఆర్ సిగ్గు లేకుండా దళితులను ముందు పెట్టి మాట్లాడిస్తున్నారని తెలిపారు. ఆయన ఎంగిలి మెతుకుల కోసం కొందరు మాట్లాడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులపై మాట్లాడటానికి బీఆర్ఎస్‌కు నైతిక అర్హత లేదని చెప్పారు.

ఏనుగును పంపేందుకు కర్నాటక అటవీశాఖ అంగీకారం

- ఫలించిన మంత్రి కొండా సురేఖ ప్రయత్నాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బోనాల ఉత్సవాల్లో అమ్మవారి అంబారీ ఊరేగింపు, మొహర్రం పండుగ(బీబీ కా ఆలం అంబారీ ఊరేగింపు) నిమిత్తం రూపవతి(ఏనుగు)ని తెలంగాణకు పంపేందుకు కర్నాటక అటవీశాఖ అంగీకారం తెలిపింది. కర్నాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేతో మంత్రి కొండా సురేఖ పలుమార్లు చర్చించారు. ఏనుగు తరలింపునకు ఆమోదం తెలిపేలా చర్యలు చేపట్టారు. దీంతో కర్నాటక దావణగిరెలోని పాంచాచార్య మందిర ట్రస్టు నుంచి ఏనుగు తీసుకొచ్చేందుకు మార్గం సుగమమైంది. అటవీ చట్టాల అనుసరించి ఏనుగు తరలింపులో పాటించాల్సిన జాగ్రత్తలు, పర్యవేక్షణ తదితర అన్ని రకాల మార్గదర్శకాలను అనుసరించి ఏనుగును రాష్ట్రానికి తీసుకురానున్నట్టు మంత్రి సురేఖ తెలిపారు. ఏనుగు రాష్ట్రానికి చేరుకున్న తర్వాత పోషణ, విశ్రాంతి తదితర అంశాలకు సంబంధించి అటవీ చట్టాల మార్గదర్శకాలను పాటించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ క్లాసులు



- చిన్నారులకు యూనిఫామ్‌లిస్తాం
- అమ్మమాట-అంగన్‌వాడీ బాట పేరుతో ప్రత్యేక డ్రైవ్
- ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు
- పౌష్టికాహార తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం
- అధికారులు వారానికో సెంటర్‌ను సందర్శించాలి
- నాసిరకం వస్తువులు సరఫరా చేస్తే కఠిన చర్యలు : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ క్లాసులను ప్రారంభించబోతున్నట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ప్రకటించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆ కేంద్రాలకు వచ్చే పిల్లలకు యూనిఫారాలు అందజేస్తామన్నారు. ఈ నెల 15 నుంచి వారంపాటు అమ్మమాట-అంగన్‌వాడీ బాట పేరుతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబోతున్నట్టు తెలిపారు. పౌష్టికాహార తెలంగాణే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ, ఇతర ఉన్నతా ధికారులతో కలిసి జిల్లా సంక్షేమ అధికారులు, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారులతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా భద్రత, దత్తత, చైల్డ్ కేర్ వంటి అంశాలపై చర్చించారు. అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డిని సీతక్క సచివాలయంలో ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీతక్క మాట్లాడుతూ..పిల్లలకు తొలి ఒడి అమ్మ అయితే మలిఒడి అంగన్‌వాడీ కేంద్రాలేనని చెప్పారు. కేంద్రాల్లో ఇస్తున్న సరుకులు, సేవల నాణ్యతను పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాసిరకం కోడిగుడ్లు, పాల ప్యాకెట్ల సరఫరా కట్టడి విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలనీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వారానికో ప్రాంతంలో పర్యటించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. పేద పిల్లలకు పౌష్టికాహారం, విద్య, భద్రత అందేలా చూడాలన్నారు. అమ్మ స్థానంలో ఉన్న అంగన్‌వాడీ సిబ్బంది..పిల్లలకు అమ్మ ప్రేమను పంచేలా చూడాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ అంగన్‌వాడీ కేంద్రాలు నిలవాలని ఆకాంక్షించారు. కేంద్రాలకు పెయింటింగ్ పనులు పూర్తిచేయించాలని ఆదేశించారు. చాటు మాటుగా దత్తత తీసుకుని ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా నిబంధనలకు అనుగుణంగా పిల్లలను త్వరితగతిన దత్తత తీసుకునేలా సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు చేరే విధంగా ప్రచార కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మహిళలపైనా, చిన్నారులపైనా దాడులు, అఘాయిత్యాలు జరిగితే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యునిసెఫ్ సౌజన్యంతో రూపొందించిన న్యూట్రిషియన్ ఛాంపియన్ పుస్తకాన్ని, న్యూట్రిషియన్ కిట్లను మంత్రి సీతక్క ఆవిష్కరించారు.

తెలంగాణలో ఉన్నామా? సమైక్య రాష్ట్రంలోనా?

- బాల్క సుమన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అన్ని వర్గాలను దగా చేసే పాలనగా మారిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు.బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులపై పోలీసుల దాడి చూస్తుంటే తెలంగాణలో ఉన్నామా? సమైక్య రాష్ట్రంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతుందని తెలిపారు. కడప వెళ్లి షర్మిల కోసం ఊరూరా తిరుగుతా అంటూ సీఎం రేవంత్ సమైక్యవాదుల కోసం తాపత్రాయపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్లలో కలుషిత ఆహారం సమస్యలు, యూనివర్సిటీల్లో నియామకాల్లేక సిబ్బంది కొరత, దళిత ఎస్సై ఆత్మహత్య, ఎస్సీ, బీసీ మంత్రులకు అడుగడుగునా అవమానాలతో కాంగ్రెస్ పాలనలో సామాజిక న్యాయం కొరవడిందని దుయ్యబట్టారు. కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల్లోనే సామాజిక న్యాయమంటున్నారే తప్ప చేతల్లో లేదని ఎద్దేవా చేశారు. జర్నలిస్టులకు పోలీసుల చేతిలో అవమానాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంగా తనకొచ్చిన అవకాశాన్ని మంచి చేయడానికి ఉపయోగించుకోవాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో 15 మంది ఐపీఎస్‌ల బదిలీలు

- శాంతి భద్రతల అదనపు డీజీగా మహేశ్ భగవత్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో 15 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకట్రెండ్రోజుల్లో మరికొంత మంది నాన్‌క్యాడర్ ఎస్పీలను బదిలీ చేయటానికి రంగం సిద్ధం చేసింది. ఐపీఎస్‌ల బదిలీలు ఈ విధంగా ఉన్నాయి.

పేరు	ప్రస్తుత పోస్టింగ్	కొత్త పోస్టింగ్
మహేశ్ భగవత్	అదనపు డీజీ రైల్వే పోలీస్	అదనపు డీజీ రాష్ట్ర శాంతి భద్రతలు
సంజయ్ కుమార్ జైన్	అదనపు డీజీ రాష్ట్ర శాంతి భద్రతలు	అదనపు డీజీ టీజీఎస్పీ
స్వాతి లక్రా	అదనపు డీజీ టీజీఎస్పీ	అదనపు డీజీ ఆర్గనైజేషన్స్, హెూంగార్డ్స్
స్టీఫెన్ రవీంద్ర	అదనపు డీజీ	అదనపు డీజీ గ్రేహౌండ్స్, అక్టోపస్
విజయ్ కుమార్	అదనపు డీజీ, గ్రేహౌండ్స్ అండ్ అక్టోపస్	అదనపు డీజీ పర్సనల్, ఫోర్స్ అండ్ వెల్ఫేర్
చంద్రశేఖర్ రెడ్డి	ఐజీ పర్సనల్	ఐజీ మల్టీజోన్-1
సత్యనారాయణ	ఐజీ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్	ఐజీ మల్టీజోన్-2
సుధీర్‌బాబు	ఐజీ మల్టీజోన్	కమిషనర్, రాచకొండ
తరుణ్‌జోషి	కమిషనర్ రాచకొండ	డైరెక్టర్, ఏసీబీ
కె. రమేశ్ నాయుడు	వెయిటింగ్	ఐజీ రైల్వే
రక్షిత కె.మూర్తి	ఎస్పీ, వనపర్తి	డీసీపీ, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్
డి. ఉదయ్ కుమార్‌రెడ్డి	డీసీపీ, సౌత్‌వెస్ట్ జోన్	ఎస్పీ, మెదక్
బి.బాలస్వామి	ఎస్పీ, మెదక్	డీసీపీ, ఈస్ట్‌జోన్ సిటీ
ఆర్. గిరిధర్	డీసీపీ, ఈస్ట్‌జోన్	ఎస్పీ, వనపర్తి
జి.చంద్రమోహన్	డీసీపీ, టాస్క్‌ఫోర్స్	డీసీపీ, సౌత్‌వెస్ట్ సిటీ

డీసెట్‌కు 85.96 శాతం హాజరు

- రెండువారాల్లో ఫలితాలు
- కన్వీనర్ శ్రీనివాసాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2024-26 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్ ప్రవేశ పరీక్ష బుధవారం ఆన్‌లైన్‌లో ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్, మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డీసెట్‌కు 17,655 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 15,150 (85.96 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని తెలిపారు. తెలుగు మాధ్యమంకు 9,698 మంది దరఖాస్తు చేస్తే, 8,189 (84.44 శాతం) మంది హాజరయ్యారని వివరించారు. ఇంగ్లీష్, ఉర్దూ మీడియంకు 7,957 మంది దరఖాస్తు చేయగా, 6,961 (87.48 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. ఈనెల 15న ప్రాథమిక కీని www.deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా విడుదల చేస్తామని తెలిపారు. రెండు వారాల్లో ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.



లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసి, వినతిపత్రాలు అందజేశారు.

హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కరాములు మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేయకముందే మతోన్మాద - కార్పొరేట్ శక్తులకు లాభాలు ఒడిసి పట్టేందుకు బీజేపీ రంగంలోకి దిగిందన్నారు. కార్మికుల ఈపీఎఫ్ బకాయిల చెల్లింపులో యాజమాన్యా లకు విధించే జరిమానాలను భారీగా తగ్గించిందని తెలిపారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపీ) పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను లీజుకివ్వడం, అమ్మేయడం, ప్రయివేటీకరణ చేయడం లాంటివి మరింత వేగవంతం చేస్తామని ప్రకటించిందన్నారు. అందులో భాగంగానే మంచిర్యాల జిల్లా లోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను బహిరంగ వేలం వేస్తున్నారని తెలిపారు. అయితే, కార్మికులకు కనీస వేతనం రూ.26,000, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పర్మినెంట్, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అత్యధిక పెన్షన్ చెల్లింపు, ఓపీఎస్ రద్దు, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తింపు వంటి అంశాలపై మాత్రం కేంద్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదని విమర్శించారు

పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు ఉద్యోగ, కార్మికులకు అనేక హామీలిచ్చిందని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఇచ్చిన హామీల గురించి ఊసే లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పారిశ్రామికవేత్తలు, ఐటీ అధిపతులు, ఫార్మా యాజమాన్యాలతో పాటు మధ్యతరగతి పరిశ్రమల యజమానులు, కాంట్రాక్టర్లతో అనేకసార్లు సమావేశాలు జరిపారు కానీ రాష్ట్ర కార్మిక సంఘాలకు కనీసం అపాయింట్‌మెంట్స్ కూడా ఇవ్వడం లేదని తెలిపారు. కార్మిక సంఘాలతో సీఎం సమావేశమై కార్మిక సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా బీజేపీ బాటలో పయనిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గుతోందని అన్నారు. ఇటీవల 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పని చేస్తున్న కార్మికులకు కొత్త జీఓలను విడుదల చేసింది కానీ ఆ జీఓలలో ఒక్క పైసా కూడా వేతనం పెంచలేదన్నారు. కేంద్ర బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, అందుకు పోరాటాలు తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, భూపాల్, జె.మల్లికార్జున్, ఎస్.రమ, పి.జయలక్ష్మి, కె.ఈశ్వర్‌రావు, వి.ఎస్.రావు, టి.వీరారెడ్డి, కళ్యాణం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, కూరపాటి రమేష్, ఎ.ముత్యంరావు, బి.మధు, బీరం మల్లేష్, ఎ.జె. రమేష్, ఎం.వెంకటేష్, కె.గోపాలస్వామి, రాగుల రమేష్, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల్లో..

నల్లగొండ జిల్లా కేంద్రంలోని భాస్కర్ టాకీస్ అడ్డా ప్రదేశంలో కార్మికులు, ఐసీడీఎస్ ఆఫీసు ఎదుట అంగన్వాడీలు నిరసన తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ బాసిత్‌కు వినతిపత్రం అందజేశారు. మునుగోడు మండలంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల జెండాతో కార్మికులు నిరసన తెలిపారు. తిప్పర్తి మండలంలో కార్మికులు మార్కెట్ యార్డ్ నుంచి తహసీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా, అనంతరం ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. భువనగిరి జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్, ఇతర రంగాల కార్మికులు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. మెదక్, సిద్దిపేట పట్టణాల్లో ఆశా వర్కర్లు ధర్నాలు నిర్వహించారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు, ఆశాలు, వివిధ రంగాల కార్మికులు కలెక్టరేట్, మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు, నిరసన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లో మున్సిపల్ టౌన్ హాల్ నుంచి క్లాక్‌టవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మున్సిపల్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఏఎల్‌ఓ లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. గద్వాల జిల్లాలోని ధరూర్ మండల కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



ఖమ్మం కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని, అక్రమ ప్రమోషన్లు నిలుపుదల చేయాలని, కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని కోరుతూ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. గేటు ముందు బైటాయించి కమిషనర్ బయటకు రావాలని నినాదాలు చేశారు. అనంతరం ఆందోళన వద్దకు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ వచ్చి సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఏన్కూర్ పీహెచ్‌సీ ఎదుట ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో సీఐటీయూ నాయకులు శ్రామిక భవనం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పాల్వంచలో కార్మికులు భారీ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా చేశారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి బండి దత్తాత్రి, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కుమురంభీం ఆసిఫాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.



కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున కార్మికులు ధర్నా చేశారు. అనంతరం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. హుజూరాబాద్ పట్టణంలో గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశా వర్కర్లు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ధర్నా చేశారు. ఉమ్మడి రంగారెడ్డి, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లోనూ ధర్నాలు జరిగాయి.

గన్నీ బ్యాగుల ధరలపై సమీక్షలేవి?

ఏడేండ్లలో రైతులకు రూ. 40కోట్ల మేర నష్టం

- జీవో 396 అమలు చేయాలని డిమాండ్
- మూడు గోదాముల్లో మూలుగుతున్న 5 లక్షల గన్నీ సంచులు
- మార్కెట్ ఆదాయానికి భారీగా గండి





నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కి తమ మిర్చి, పత్తి పంటలను తెచ్చిన రైతులకు గన్నీ సంచులకు ఆ పంటలు కొనుగోలు చేసిన వ్యాపారులు మార్కెట్ చార్జీల కింద డబ్బులు చెల్లిస్తారు. సదరు చెల్లింపులు రెండేండ్లకు ఒకసారి జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్మెన్, జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సమావేశమై చార్జీలను సమీక్షించి పెరిగిన ధరలకు అనుగుణంగా కొత్త ధరలు నిర్ణయించి అమలు చేయాలి. ప్రభుత్వ ఉత్తర్వులు జీవో 396తో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ-2 ప్రస్తుతం మార్కెట్‌లో రైతుల గన్నీ సంచులకు వ్యాపారులు రూ.30 చెల్లిస్తున్నారు. ఇది ఆనాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న దయానంద్ 04-07-2017న జరిగిన సమావేశంలో నిర్ణయించి ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారమే చెల్లిస్తున్నారు. ఇందులో పాడైన పేరుతో కొన్ని సంచులకు వ్యాపారులు డబ్బులు ఇవ్వడం లేదు. అంటే ఏడేండ్ల నుంచి రైతుల గన్నీ సంచులకు చెల్లించవలసిన చార్జీలను సమీక్షించి ధరలను పెంచలేదు. ప్రభుత్వ ఉత్తర్వుల జీవో నెంబర్ 396 ప్రకారం చార్జీలను 2019-2021, 2023లలో సమీక్షించి నిర్ణయించినట్లయితే రైతులకు ఇప్పుడు గన్నీ సంచికి రూ.60 వచ్చి ఉండేది. దాంతో రైతులు సుమారు రూ.35 నుంచి 40 కోట్ల మేర నష్టపోయినట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా రైతులకు రావలసిన చార్జీలను సమీక్షించి గన్నీ సంచుల ధరలను పెంచాలని రైతులు కోరుతున్నారు.

మూడు గోదాముల్లో మూలుగుతున్న 5లక్షల గన్నీలు


2012-2013 సీజన్‌కు సంబంధించి 21 లక్షలా 31వేల పైచిలుకు గన్నీ బ్యాగులను సీసీఐ కొనుగోలు చేసింది. ఇందులో 5 లక్షలా 31వేల పైచిలుకు బ్యాగులు ఏనుమాముల మార్కెట్‌లోని మూడు గోదాముల్లో ఉంచినట్టు వారు తెలిపారు. మార్కెట్లోని మూడు గోదాముల్లో గన్నీ బ్యాగులు నిల్వ ఉంచడం వల్ల మార్కెట్ ఆదాయానికి భారీ ఎత్తున గండిపడుతుందని తెలంగాణ రైతు సంఘం అనేకసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

వ్యాపారులతో మార్కెట్ అధికారుల కుమ్మక్కు

2015 ఆగస్టులో నాటి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ 10,19,550 గన్నీ బ్యాగులకు టెండర్ పెట్టగా వ్యాపారులు సిండికేట్‌గా మారి బ్యాగుకు రూ.7.50 వరకు పాట పాడారు. మళ్లీ టెండర్ నిర్వహించినా వ్యాపారులు మరోసారి సిండికేట్‌గా మారి రూ.7.30కు పాడారు. దాంతో కలెక్టర్ జీవన్ పటేల్ జోక్యం చేసుకొని రైతుల గన్నీ బ్యాగుకు వ్యాపారులు రూ.

15 చెల్లించాలని ఆదేశించారు. ఇదే విషయంపై 2023లో నాటి జిల్లా కలెక్టర్ గోపి నిర్వహించిన సమావేశంలో వ్యాపారులు రైతుల గన్నీ బ్యాగుకు రూ. 25 ఇవ్వాలని నిర్ణయించారు. 2015 నాటికి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని 15 మిల్లుల్లో 9,72,448 గన్నీ బ్యాగులు ఉన్నాయని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కలెక్టర్‌కు నివేదిక ఇచ్చింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి మార్కెట్‌లో రైతుల గన్నీ సంచులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ. 30ను రూ. 60కు పెంచి ప్రతి బస్తాకు చెల్లింపులు చేసే విధంగా తగిన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.


గోదాముల కిరాయి రైతు సంక్షేమానికి ఖర్చు చేయాలి



\- మోర్తాల చందర్ రావు, రైతు సంఘం నాయకులు

ఏనుమాముల మార్కెట్‌లో 12 ఏండ్ల నుంచి మూడు గోదాముల్లో నిల్వ ఉన్న గన్నీ బ్యాగులను కోర్టు అనుమతితో ఓపెన్ చేసి అందులో ఉన్న సంచులను అమ్మి ఆ డబ్బును కోర్టులో డిపాజిట్ చేయాలి. గోదాముల కిరాయి మార్కెట్ కమిటీ కోల్పోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన మార్కెట్ అధికారుల జీతాల నుంచి కానీ, సీసీఐ నుంచి కానీ వసూలు చేసి మార్కెట్‌కు సమర్పించాలి. అలా వచ్చిన ఆదాయాన్ని రైతు సంక్షేమానికి ఖర్చు చేయాలి. కొనుగోలుదారులు రైతులకు ప్రతి బస్తాకు రూ. 60 చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటాం



\- గుగులోతు రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి

రైతుల గన్నీ బ్యాగుల చార్జీల చెల్లింపుల విషయం ఇటీవలే రైతు సంఘం నేతలు నా దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తాం.

తేనెతో ఇలా...

తేనెలో ఔషధ గుణాలు బోలెడున్నాయి. దానికి తోడు అదిరిపోయే రుచి. అది ఎనర్జీని కూడా ఇస్తుంది. అలాంటి తేనె ఉపయోగాలేమిటో తెలుసుకుందాం.



- దగ్గు వస్తోందా ఓ టీస్పూన్ తేనెను నిమ్మరసంలో కలిపి తాగండి. ఇక దగ్గు మటాష్. పగటి వేళల్లో తేనె, పాలు కలిపి తాగితే.. శరీర అలసట తగ్గుతుంది. ఎనర్జీ పెరుగుతుంది.
- శరీరంలో ఎక్కడైనా గాయాలుంటే.. తేనెను అక్కడ రాసి, నెమ్మదిగా మసాజ్ చెయ్యాలి. తేనె సహజమైన యాంటీబయోటిక్. రోజూ గాయంపై రాస్తుంటే, ఆటోమేటిక్‌గా నయమై పోతుంది. కాలిన గాయాల మీద తేనెను రాయాలి. అంతే.. మచ్చ కూడా లేకుండా గాయం మాయమవుతుంది.
- ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారా.. మీరు తాగే టీలో ఓ స్పూన్ తేనె కలపండి.. టేస్ట్ ఆస్వాదిస్తూ తాగండి.. టెన్షన్ పరార్.

తినరా మైమరచి...

దోశ అంటే ఇష్టపడని వారుండరు... దీనిని వివిధ రకాలుగా తయారు చేసుకుంటూ ఉంటారు. ఉల్లి దోశ, మసాల దోశను తినేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. రోజూ తినే సాధారణ దోశలే కాకుండా.. పాలకూర, కొత్తిమిర, పుదీన, కరివేపాకుతోపాటు, జొన్నలు, స్వీట్‌కార్న్, పన్నీర్ వంటి వాటిని ఉపయోగించి వెరైటీ దోశలను చేసుకోవచ్చు. ఇవి శరీరానికి పోషకాలు అందించటమే కాకుండా... ఎంతో రుచిగానూ ఉంటాయి. ఇలాంటి ఆరోగ్యకరమైన దోశల రెసిపీలు నేటి మానవిలో...



పాలకూరతో..

పాలకూరలో ఉండే ఐరన్, కాల్షియం, విటమిన్లు వంటి పోషకాలు శరీరానికి బోలెడు లాభాలను అందిస్తాయి. అంతేకాకుండా ఇందులో ఫైబర్ కూడా లభిస్తుంది. ఇది శరీర బరువు, రక్తపోటును అదుపులో ఉంచేందుకూ కీలక పాత్ర పోషిస్తుంది.

కావలసిన పదార్థాలు : దోశ పిండి - నాలుగు కప్పులు, పాలకూర - రెండు కప్పులు, పచ్చిమిర్చి - నాలుగు, చిన్న అల్లం ముక్క, దోసెలు



వేసేందుకు - నెయ్యి లేదా నూనె, పసుపు - కొద్దిగా, ఉప్పు - రుచికి సరిపడా.

తయారీ విధానం: ముందుగా ఒక గిన్నెను స్టౌవ్‌పై పెట్టుకుని నాలుగు కప్పుల నీరు పోసి వేడు చేసుకోవాలి. అందులో పసుపు పొడి వేసి బాగా మరిగించాలి. నీరు మరుగుతుండగా.. అందులో శుభ్రంగా కడిగిన పాలకూర, పచ్చి మిర్చి అల్లం వేసి 3 నుంచి 4 నిమిషాలు ఉడికించాలి. ఉడికిన తర్వాత నీటి నుంచి పాలకూరను తీసి చల్లారనివ్వాలి. ఆ తర్వాత పాలకూర, పచ్చి మిరపకాయలు, అల్లంను మెత్తని పేస్టులాగా మిక్సీ వేసుకోవాలి. ఈ పేస్టును దోశ బ్యాటర్‌లో వేసి బాగా కలపాలి. పిండిని బాగా కలిపిన తర్వాత పెనం వేడి చేసి, 1/2 టీస్పూన్ నెయ్యి లేదా నూనె వేసి దోశను వేసుకొవాలి. దోశ లేత గోధుమ రంగు వచ్చేంత వరకు రోస్ట్ చేసుకోవాలి. అంతే పాలక్ దోశ రెడీ! మీకు నచ్చిన చట్నీతో సర్వ్ చేసుకోండి.

జొన్న పిండితో..

జొన్న పిండి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నిజానికి డయాబెటిస్ బారిన పడినవారు సాధారణ దోశల కంటే జొన్న పిండితో చేసిన దోశలు తినడం చాలా మంచిది. ఈ జొన్న దోశలు క్రిస్పీగా రుచిగా ఉంటాయి. దీన్ని ఎప్పటికప్పుడు ఇన్‌స్టెంట్‌గా తయారు చేసుకోవచ్చు.

కావలసిన పదార్థాలు : జొన్న పిండి - అరకప్పు, బియ్యంపిండి - పావు కప్పు, కొత్తిమీర తరుగు - రెండు స్పూన్లు.

తయారీ విధానం : ముందుగా ఒక గిన్నెలో జొన్న పిండిని తీసుకోవాలి. ఉండలు కట్టకుండా బాగా కలుపుకోవాలి. అందులోనే బియ్యంపిండిని కూడా వేసి బాగా కలపాలి. ఇప్పుడు నీళ్ల పోసుకుని దోశలు వేయడానికి సరిపడేలా పలుచగా ఉండేటట్టు పిండిని అడ్జస్ట్ చేసుకోవాలి. ఉండలు లేకుండా చూసుకోవాలి. ఈ మిశ్రమంలోనే సన్నగా



తరిగిన ఉల్లిపాయలు, సన్నగా తరిగిన కొత్తిమీర, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, రుచికి సరిపడా ఉప్పు, జీలకర్ర, కరివేపాకు తరుగు వేసి బాగా కలుపుకోవాలి. ఒక పది నిమిషాలు పక్కన పెట్టాలి. ఇప్పుడు స్టవ్ మీద పెనాన్ని పెట్టి నూనె వేయాలి. నూనె వేడెక్కాక ఈ పిండిని దోశలాగా పలచగా వేసుకోవాలి. రవ్వ దోశలు ఎలా వేస్తారో అలా పలుచగా వేసుకుంటే ఇవి క్రిస్పీగా వస్తాయి. రెండు వైపులా ఎర్రగా కాలాక కొబ్బరి చట్నీతో తింటే చాలా రుచిగా ఉంటాయి.

సోయాతో..

డయాబెటిక్ పేషెంట్ల కోసం కొన్ని ప్రత్యేక బ్రేక్ ఫాస్ట్ రెసిపీలు ఉన్నాయి. అందులో సోయా దోశ ఒకటి. దీన్ని తినడం వల్ల శక్తి వస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. పైగా రుచిగా కూడా ఉంటుంది. దీన్ని చేయడానికి ఎక్కువ సమయం కూడా పట్టదు.

కావలసిన పదార్థాలు : సోయా పాలు - ఒక కప్పు, కొత్తిమీర తరుగు - ఒక స్పూను, ఉప్పు - రుచికి సరిపడా, పచ్చిమిర్చి తరుగు - ఒక స్పూను, ఉల్లిపాయ తరుగు - అరకప్పు, నూనె - సరిపడినంత, గోధుమపిండి - పావు కప్పు, బేకింగ్ సోడా - చిటికెడు,

తయారీ విధానం : ఒక గిన్నెలో గోధుమపిండి, సోయా పాలు వేసి బాగా కలపాలి. సన్నని పచ్చిమిర్చి తరుగు, ఉల్లిపాయ తరుగు,



కొత్తిమీర తరుగు, బేకింగ్ పౌడర్, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. కొద్దిగా నీళ్ళను వేసి దోశ పిండిలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పావుగంటపాటు నాననివ్వాలి. పెనం మీద రవ్వ దోసెలా వేసుకొని రెండు వైపులా ఎర్రగా కాల్చుకోవాలి. దీన్ని కొబ్బరి చట్నీతో, టమాటో చట్నీ, సాంబార్.. .ఇలా దేనితో తిన్నా చాలా టేస్టీగా ఉంటుంది.

స్వీట్ కార్న్‌తో

స్వీట్ కార్న్ మార్కెట్లో అధికంగానే లభిస్తుంది. దీన్ని చేయడం చాలా సులువు. పిల్లలు ఇష్టంగా తింటారు. ఎప్పుడు ఒకేలాంటి దోశ తిని బోర్ కొట్టిన వారికి ఈ స్వీట్ కార్న్ దోశ నచ్చడం ఖాయం. దీన్ని సులువుగా ఎలా చేయాలో చూద్దాం.

కావలసిన పదార్థాలు : బియ్యం - ఒక కప్పు, స్వీట్ కార్న్ - ఒక కప్పు, జీలకర్ర - కొద్దిగా, పచ్చిమిర్చి - నాలుగు, ఉప్పు - రుచికి సరిపడా.

తయారీ విధానం : బియ్యాన్ని నాలుగు గంటల పాటు ముందుగానే నానబెట్టుకోవాలి. తర్వాత మిక్సీలో ఆ బియ్యాన్ని వేసి మెత్తగా రుబ్బుకోవాలి. అందులోనే స్వీట్ కార్న్, జీలకర్ర, పచ్చిమిర్చి, రుచికి సరిపడా ఉప్పును కూడా వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. దీన్ని పావుగంట సేపు పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద పెనం పెట్టి నూనె రాయాలి. ఈ పిండిని దోశలాగా



వేసుకోవటమే. రెండు వైపులా ఎర్రగా కాల్చుకొని సర్వ్ చేసుకోవాలి. టమాటా చట్నీతో, పల్లీల చట్నీతో తింటే చాలా బాగుంటుంది. పిల్లలకు ఇది మంచి బ్రేక్ ఫాస్ట్ రెసిపీ.

కొత్తిమీర, పుదీనాతో

కొత్తిమీర, పుదీనా, కరివేపాకులతో చేసే దోశ ఇది. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. హై బీపీతో బాధపడేవారు, డయాబెటిస్‌తో బాధపడేవారు కూడా ఈ దోశ తినవచ్చు. ఒకసారి దీన్ని చేసుకొని తిని చూడండి. ఇంటిల్లిపాదికి నచ్చుతుంది.

కావాల్సిన పదార్థాలు : కొత్తిమీర తరుగు - ఒక కప్పు, పుదీన - ఒక కప్పు, కరివేపాకులు తరుగు - అరకప్పు, బియ్యం - ఒక కప్పు, మినపప్పు - పావు కప్పు, మెంతులు - కొద్దిగా.

తయారీ విధానం : బియ్యం,



మినపప్పు, మెంతులు నాలుగైదు గంటల పాటు నానబెట్టుకోవాలి. తర్వాత వాటిని గ్రైండర్లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఆ మిశ్రమాన్ని తీసి ఒక గిన్నెలో వేసుకోవాలి. ఇప్పుడు కొత్తిమీర, పుదీనా, కరివేపాకులని మిక్సీ జార్లో వేసి మెత్తగా రుబ్బి... ఆ మిశ్రమాన్ని కూడా అందులో కలిపేయాలి. రుచికి సరిపడా ఉప్పును వేసి బాగా కలపాలి. పచ్చిమిర్చి, ఉల్లిపాయలను సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. దోశ పిండిలో జీలకర్ర వేసి బాగా కలపాలి. ఇప్పుడు స్టవ్ మీద పెనం పెట్టి నూనె రాయాలి. దానిపై దోశెలు వేసుకోవాలి. పైన ఉల్లిపాయ, పచ్చిమిర్చి తరుగును చల్లుకోవాలి. అంతే టేస్టీ గ్రీన్‌తో సహా రెడీ అయినట్టే. కొత్తిమీర, పుదీనా, కరివేపాకులు అధికంగా వేసాము. కాబట్టి ఇది ఆకుపచ్చని రంగులో వస్తుంది. ఆరోగ్యానికి ఇది ఎంతో మేలు చేస్తుంది. ■

పాలు విరిగిపోతున్నాయా.?

పాలు లేనిదే రోజు గడవదని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఉదయం లేవగానే ఇంట్లో పాలు ఉంటేనే పని ముందుకు సాగుతుంది. అప్పుడప్పుడు పాలు విరిగిపోతూ వుంటాయి. మనలో చాలా మంది ఇలాంటి సమస్యను ఎదుర్కొంటూనే వుంటాం. అయితే కొన్ని సహజ చిట్కాలు పాటించడం ద్వారా పాలు విరిగిపోకుండా చూసుకోవచ్చు.

పాలు విరిగిపోకుండా ఉండాలంటే ఎక్కువసార్లు వేడి చేయాలి. ముఖ్యంగా పశువుల నుంచి పాలు పితికిన కొద్ది గంటలకు వేడి చేయకపోతే... విరిగిపోతుంటాయి.



కాబట్టి పాలు పితికిన వెంటనే వేడి చేసుకోవటం మంచిది.

ఇక వేడి చేసిన పాలు చల్లారిన తర్వాత ఫ్రిజ్‌లో స్టోర్ చేయాలి. ఇలా చేస్తే పాలు విరగకుండా ఉంటాయి. ఫ్రిజ్ లేనివారు అయితే ప్రతీ ఆరేడు గంటలకు ఒకసారి పాలను వేడి చేసుకోవాలి. ఇలా చేస్తే పాలు విరిగిపోకుండా ఉంటాయి.

ఇక వేడి చేసిన తర్వాత పాలను గాలి చొరబడకుండా ఉండేలా బాటిల్స్ లేదా ఎయిర్ టైట్‌గా వుండే బాక్సుల్లో స్టోర్ చేయాలి. ఇలా చేయడం వల్ల కూడా పాలు విరిగిపోకుండా ఉంటాయి.

ఈ టిప్ అందరికీ తెలిసిందే. పాలను వేడి చేసే ముందు ఒక చిటికెడు బేకింగ్ సోడా వేసుకుని మరిస్తే పాలు విరగవు.

పాలను ఫ్రిజ్‌లో నిల్వ ఉంచే సమయంలో టెంపరేచర్ 32 డిగ్రీల ఫారన్‌హీట్ నుంచి 39.2 డిగ్రీల ఫారన్‌హీట్ మధ్యలో ఉండేలా చూడాలి. ఇలా చేస్తే పాలు చల్లగా ఉండి పగలకుండా వుంటాయి. ■

సహకార బలోపేతానికి కొత్త అవకాశాలు

(మొదటిపేజీ తరువాయి)

కాదని ఈ సందర్భంగా మోడీ పునరుద్ఘాటించారు. సమస్యలకు పరిష్కారాలు యుద్ధ రంగంలో లభించవన్నారు. చర్చలు, దౌత్యంతోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని నొక్కి చెప్పారు. తీవ్రవాదం ఏ రూపంలో వున్నా ఆమోదయోగ్యం కాదని, ఏ రకంగానూ దాన్ని సమర్థించలేమని మోడీ పేర్కొన్నారు. గత 40ఏండ్లలో భారత ప్రధాని ఆస్ట్రియాలో పర్యటించడం ఇదే మొదటిసారి. రష్యా-ఉక్రెయిన్ శాంతి ప్రక్రియకు సంబంధించి చూసినట్టైతే భారత్ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని, కావాలంటే తటస్థ దేశంగా తమ దేశంలో చర్చలు జరుపుకోవచ్చని నెహమార్ పేర్కొన్నారు. ప్రధానంగా ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధంపై కూలంకషంగా చర్చించామని చెప్పారు. ఈ యుద్ధంపై యురోపియన్ దేశాల ఆందోళనలు, ఇబ్బందులను భారత్‌కు తెలియచేసినట్టు చెప్పారు. అలాగే పశ్చిమాసియాలో ఘర్షణలపై కూడా సుదీర్ఘంగా చర్చించామన్నారు. ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, అందువల్ల శాంతి ప్రక్రియలు, భవిష్యత్ శాంతి సదస్సులకు సంబంధించి భారత్‌ది చాలా కీలకమైన పాత్ర అని నెహమార్ చెప్పారు.

ఐఎస్‌డబ్ల్యూఏఎస్ఐ ప్రతినిధులతో సీఎం భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్‌నేషనల్ స్పిరిట్స్, వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఐఎస్‌డబ్ల్యూఏఎస్ఐ) ప్రతినిధులతో బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఇతర అంశాలపై సీఎం వారితో చర్చించారు. ఐఎస్‌డబ్ల్యూఏఎస్ఐ అనే సంస్థ జాతీయ, అంతర్జాతీయ ప్రీమియం స్పిరిట్స్, వైన్ బ్రాండ్‌లను తయారు చేసే కంపెనీలకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రంలో కొత్తగా పలు లిక్కర్ కంపెనీలకు ఇటీవల అనుమతివ్వడం వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో వాటికి ప్రాతినిధ్యం వహించే సంఘం సీఎంను కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. త్వరలో రాష్ట్రంలో మరిన్ని కొత్త లిక్కర్ కంపెనీలు తమ పెట్టుబడులను పెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు

వారూ భరణానికి అర్హులే

న్యూఢిల్లీ : విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు భరణానికి అర్హులేనని సుప్రీంకోర్టు బుధవారం చారిత్రక తీర్పు ఇచ్చింది. ఏ మతం వారైనా విడాకులు తీసుకున్న మహిళలు సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 ప్రకారం భరణం పొందేందుకు అర్హులేనని స్పష్టం చేసింది. సీఆర్‌పీసీలోని 'రెలిజియస్ న్యూట్రల్' సెక్షన్ ప్రకారం ముస్లిం మహిళలు తన భర్త నుండి భరణం కోరవచ్చునని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసిహ్‌తో కూడిన డివిజన్ బెంచ్ తెలిపింది. న్యాయమూర్తులు వేర్వేరుగా తీర్పును రాసినప్పటికీ ఒకే విధమైన తీర్పు ఇచ్చారు. భరణం కోరేందుకు భార్యకు హక్కు ఉన్నదని ఈ నెల 1వ తేదీకి ముందు అమలులో ఉన్న సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 చెబుతోంది. ఈ సెక్షన్ ముస్లిం మహిళలకు కూడా వర్తిస్తుందని సుప్రీంకోర్టు తాజాగా తేల్చి చెప్పింది.

తీర్పులో ఏముంది?

'కేవలం వివాహిత మహిళలకు మాత్రమే కాకుండా సీఆర్‌పీసీ సెక్షన్ 125 మహిళలందరికీ వర్తిస్తుంది. అందువల్ల క్రిమినల్ అప్పీలును తిరస్కరిస్తున్నాము' అని తీర్పును వెలువరించిన సందర్భంగా జస్టిస్ నాగరత్న తెలిపారు. భరణం అనేది దాతృత్వం కాదని, అది వివాహిత మహిళలందరి హక్కు అని, మతం ఏదైనా వివాహిత మహిళలందరికీ అది వర్తిస్తుందని డివిజన్ బెంచ్ వివరించింది.

1986వ సంవత్సరపు ముస్లిం మహిళల (విడాకుల హక్కుల పరిరక్షణ) చట్టం సెక్యులర్ చట్టాన్ని అతిక్రమించదని తెలిపింది. భారతీయ వివాహిత మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యం లేదన్న వాస్తవాన్ని గుర్తించాలని అంటూ కాబట్టి తన భార్యకు ఆర్థిక మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత భర్తదేనని పేర్కొంది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 వివాహిత మహిళలకే కాకుండా సహజీవనం సాగిస్తున్న వారితో సహా మహిళలందరికీ వర్తిస్తుందని చెప్పింది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 కింద పిటిషన్ పెండింగులో ఉన్న సమయంలో ముస్లిం మహిళ విడాకులు తీసుకుంటే సదరు మహిళ సెక్షన్ 125 ప్రకారం కోర్టులో కేసును కొనసాగిస్తూనే 2019 నాటి ముస్లిం మహిళల (వివాహ హక్కుల రక్షణ) చట్టం కింద కూడా కోర్టును ఆశ్రయించవచ్చునని తెలిపింది.

కేసు పూర్వాపరాలు

పోషణకు సంబంధించి కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకునేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించిన నేపథ్యంలో దానిని సవాలు చేస్తూ మహమ్మద్ అబ్దుల్ సమద్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళ సీఆర్‌పీసీలోని

సెక్షన్ 125 ప్రకారం భరణం కోరేందుకు అర్హురాలు కాదని సమద్ వాదించారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది వాసిం ఖాద్రీ వాదనలు విన్న అనంతరం సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసులో న్యాయస్థానానికి సాయపడేందుకు గౌరవ్ అగర్వాల్‌ను అమికస్ క్యూరీగా నియమించింది.

సమద్ తన మాజీ భార్యకు భరణాన్ని ఇవ్వాల్సిందేనని కుటుంబ న్యాయస్థానం తీర్పు చెప్పింది. అయితే తాత్కాలిక నెలసరి భరణాన్ని రూ.20 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించింది. పిటిషన్ దాఖలు చేసిన తేదీ నుండి ఈ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించింది. దీనిపై సమద్ తెలంగాణ హైకోర్టుకు వెళ్లగా గత సంవత్సరం డిసెంబర్ 13న ఈ ఆదేశాలను న్యాయస్థానం కొట్టివేయలేదు. 2017లో ముస్లిం పర్సనల్ లా ప్రకారం విడాకులు తీసుకున్నామని, ఇందుకు సంబంధించి విడాకుల సర్టిఫికెట్ కూడా ఉన్నదని, అయితే దీనిని కుటుంబ న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదని హైకోర్టులో సమద్ వాదించారు.

డీజీపీగా జితేందర్

(మొదటిపేజీ తరువాయి)

ఏఎస్పీగా ఆయన తన కెరీర్‌ను ప్రారంభించారు. అనంతరం బెల్లంపల్లి ఏఎస్పీగా, గుంటూరు, మహబూబ్‌నగర్ జిల్లాల ఎస్పీగా, హైదరాబాద్ రేంజ్ డీఐజీగా, సీఐడీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జైళ్ల శాఖ అధిపతిగా, నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా, రాష్ట్ర శాంతిభద్రతల విభాగం అదనపు డీజీగా వివిధ హోదాల్లో బాధ్యతలను నిర్వహించి సమర్థుడైన పోలీసు అధికారిగా పేరు పొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలను నిర్వహించారు. హోంశాఖ ప్రత్యేక కార్యదర్శిగా డాక్టర్ రవిగుప్తా సచివాలయానికి వెళ్లి బాధ్యతలను స్వీకరించారు. డీజీపీగా నియమితులైన సమయంలో ఆయన ఇదే శాఖలో ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆరు నెలల్లో రాష్ట్ర డీజీపీగా ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా పనిచేశారు.

నేరరహిత రాష్ట్రమే లక్ష్యం : కొత్త డీజీపీ

తెలంగాణను నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమనీ, ఆ దిశగా రాష్ట్ర పోలీసు శాఖను ముందుకు నడిపిస్తానని కొత్త పోలీసు బాస్ జితేందర్ అన్నారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టాక ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో శాంతిని సుస్థిరంగా నెలకొల్పేలా తన చర్యలుంటాయని చెప్పారు. ఆ దిశగా ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. ముఖ్యంగా సైబర్‌నేరాలు, మాదకద్రవ్య పదార్థాల రవాణా, వినియోగం పెద్ద సవాలుగా మారిందనీ, వాటిని అరికట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ విషయంలో రాష్ట్ర పోలీసు శాఖ సమిష్టి బాధ్యతతో నడిచేలా చర్యలు తీసుకుంటాననీ, మాదకపదార్థాల నిరోధానికి నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఉన్నప్పటికీ దాంతో సమన్వయం చేసుకుని పనిచేస్తామని చెప్పారు. మావోయిస్టుల కార్యకలాపాలు రాష్ట్రంలో దాదాపు లేకుండా సమసిపోయాయనీ, అయినప్పటికీ ప్రభావిత రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ ఆ సమస్యపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని ఆయన తెలిపారు. అనంతరం ఆయన సచివాలయానికి వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఓయూలో కొనసాగుతున్న ఆందోళనలు

సీఎం దిష్టిబొమ్మ దహనానికి బీఆర్ఎస్‌వీ నాయకుల యత్నం

అరెస్టు చేసిన పోలీసులు

జర్నలిస్టు పట్ల పోలీసుల దురుసు ప్రవర్తన

ఓయూ పోలీస్ స్టేషన్ ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధుల నిరసన

నవతెలంగాణ- ఓయూ

డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని ఓయూలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఆందోళనల నేపథ్యంలో బుధవారం పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కవరేజ్‌కు వెళ్లిన ఓ న్యూస్ చానల్ రిపోర్టర్‌పై పోలీసుల దురుసుగా ప్రవర్తించడంతో కాస్త ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. నిరుద్యోగ విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్‌వీ నాయకులు ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకుని వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు కవరేజీకి వెళ్లిన ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ శ్రీచరణ్ పట్ల కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తూ అరెస్టు చేయడంతో యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మీడియా ప్రతినిధుల పట్ల పోలీసుల వైఖరిని నిరసిస్తూ పలు విద్యార్థి సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధులు ఓయూ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేశారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థుల పట్ల, మీడియా ప్రతినిధులపై పోలీసుల దౌర్జన్యాన్ని ఏఐఎస్ఎఫ్. పీడీఎస్‌యూ, టీజీవీపీ, ఓయూ జేఏసీ, బీఆర్ఎస్‌వీ నాయకులు తీవ్రంగా ఖండించారు. దురుసుగా ప్రవర్తించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి, వర్సిటీ పరిసర ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులను అరెస్టు చేయడం.. బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించడం మీడియా హక్కులను, స్వేచ్ఛను కాలరాయడమేనని, జర్నలిస్టులపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని మార్చుకోవాలని పలువురు విద్యార్థులు విద్యార్థి సంఘాల ప్రతినిధులు అన్నారు.

లీకు వీరుడు బేడీ రామ్

(మొదటిపేజీ తరువాయి)

బ్రజేష్ పాఠక్, కేశవ్ ప్రసాద్ మౌర్యలతో సహా సీనియర్ బీజేపీ నాయకులతో కలిసి ఉన్న ఆయన ఫోటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరలయ్యాయి. "మీకు ఏదైనా విభాగంలో ఉద్యోగం కావాలంటే, ఫారమ్ నింపిన తర్వాత బేడీ రామ్‌కి కాల్ చేయండి. ఆయన కొంత వరకు పరిష్కరించటం ఖాయం" అని ఎస్‌బీఎస్‌పీ చీఫ్ ఒ.పి రాజ్‌భర్ చెప్తున్నట్టుగా ఒక వీడియోలో ఉన్నట్టు ఒక ఆంగ్ల వార్త కథనం వివరించింది.

హిస్టరీ షీట్ ప్రకారం బేడీ రామ్‌పై లక్నోలో నాలుగు, జౌన్‌పూర్‌లో రెండు, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో రెండు, రాజస్థాన్‌లో ఒక కేసులు ఉన్నాయి. ఆయనపై వచ్చిన అభియోగాలలో ఐపీసీలోని సెక్షన్ 419, 420, 468, 120బి(నేరపూరిత కుట్ర)ల కింద కేసులు నమోదయ్యాయి. వీటితో పాటు బేడీ రామ్‌పై ఈ కింది అభియోగాలు కూడా నమోదయ్యాయి.

రాజస్థాన్ పబ్లిక్ ఎగ్జామినేషన్ (అన్యాయమైన మార్గాల నివారణ) చట్టం, 1992లోని సెక్షన్లు 4,6(ప్రశ్నపత్రాన్ని అనధికారికంగా కలిగి ఉండటం లేదా బహిర్గతం చేయటం), యూపీ-గ్యాంగ్‌స్టర్ చట్టం, 1986లోని సెక్షన్‌లు 2,3(నేరం చేయడానికి ముందు లేదా తర్వాత ముఠా సభ్యునికి చట్టవిరుద్ధంగా సహాయం చేసిన లేదా మద్దతు ఇచ్చిన పబ్లిక్ సర్వెంట్‌కు శిక్ష), ఉత్తరప్రదేశ్ పబ్లిక్ ఎగ్జామినేషన్ (అన్యాయమైన మార్గాల నివారణ) చట్టం, 1998లోని సెక్షన్లు 3,4,5,9,10(అనధికారికంగా స్వాధీనం చేసుకోవడం, ప్రశ్నపత్రాన్ని బహిర్గతం చేయడం, పరీక్షా పనిని అప్పగించిన వ్యక్తి ద్వారా లీకేజీ, రెండింటికీ జరిమానాలు, అన్యాయమైన మార్గాలు, వనరుల వినియోగం వంటివి ఉన్నాయి.

2022లో రిటర్నింగ్ అధికారికి సమర్పించిన బేడీ రామ్ ఎన్నికల అఫిడవిట్ ప్రకారం.. ఈ కేసులు రాజస్థాన్, లక్నోలో రైల్వే రిక్రూట్‌మెంట్ పరీక్షలు, భోపాల్‌లో ఎంపీపీఎస్సీ రిక్రూట్‌మెంట్ పరీక్షలు, జౌన్‌పూర్‌లో పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సంబంధించినవి. 2006 నుంచి 2016 మధ్య ఆయనపై ఈ కేసులు నమోదయ్యాయి. 2006లో రైల్వే ఎగ్జామ్ లీక్ కారణంగా బేడీ రామ్, మరో 15 మంది అరెస్టయ్యారు. 2006 సంవత్సరంలో, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఆర్ఆర్‌బీ) భారత్ అంతటా మూడు దశల్లో గ్రూప్-డి రిక్రూట్‌మెంట్ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించింది. రెండో దశ పరీక్ష 26 ఫిబ్రవరి 2006న జరగాల్సి ఉంది. అయితే, కొంత మంది ఈ ప్రశ్నపత్రాన్ని సంపాదించినట్టు పోలీసు అధికారి భగత్‌కు సమాచామందింది. అనంతరం నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పేపర్ లీకైనట్టు గమనించిన రైల్వే బోర్డు పరీక్షను రద్దు చేసింది. దాదాపు 16 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పోలీసులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. బేడీ రామ్ సహా 16 మందిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి అభ్యర్థుల ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు, అడ్మిట్ కార్డుల నకలు, ప్రశ్నపత్రం కాపీలు స్వాధీనం చేసుకున్నారు. 'గ్యాంగ్ లీడర్' బేడీరామ్‌ను విచారించినప్పుడు.. ప్రతి అభ్యర్థి నుంచి రూ. 1-1.5 లక్షలు తీసుకున్నట్టు ఒప్పుకున్నాడు.

'బేడీ రామ్‌పై చట్టపరమైన చర్యలు అవసరం'

రైల్వే లోకో పైలట్ పరీక్షలో పేపర్ లీకైందన్న ఆరోపణలపై బేడీ రామ్‌ను 2014, జులై 17న లక్నో నుంచి స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్టీఎఫ్) అరెస్టు చేసింది. యూపీ ఎస్టీఎఫ్ అధికారి త్రివేణి సింగ్ ఆ సమయంలో మాట్లాడుతూ.. "బేడీ రామ్ లొసుగులను ఉపయోగించుకోవటంలో నిపుణుడు. ఆయనకు రైల్వేలో బలమైన సంబంధాలున్నాయి. పరీక్షా పత్రాలను ప్రచురించటానికి టెండర్లు పొందిన ప్రింటింగ్ హౌస్‌ల గురించి ఆయనకు అవగాహన ఉన్నది" అని చెప్పారు.

'ఎంపీపీఎస్సీ, ఛత్తీస్‌గఢ్ పీఎంటీ పేపర్ లీక్‌లో బేడీ రామ్ పేరు'

మీడియా నివేదికల ప్రకారం.. బేడీ రామ్ 2006లో పేపర్ లీక్ కేసులో అరెస్టయిన తర్వాత సర్వీస్ నుంచి తొలగించబడే వరకు రైల్వే ఉద్యోగి(చీఫ్ టిక్కెట్ కలెక్టర్). 2008లో ఆర్ఆర్‌బీ లోకో పైలట్ పరీక్ష, 2009లో భోపాల్, జైపూర్‌లలో జరిగిన రైల్వే పరీక్షల ప్రశ్న పత్రాలను లీక్ చేసినట్టు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. 2013లో ఎంపీపీఎస్సీ, 2014, మేలో మధ్యప్రదేశ్‌లో జరిగిన ఆయుర్వేద వైద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాలను లీక్ చేయడంలో బేడీ రామ్ పేరు కూడా వినిపించింది. ఆయుర్వేద పరీక్ష రద్దు కాగా, ఎంపీపీఎస్సీ పరీక్షకు సంబంధించిన ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. బేడీ రామ్ ఒక్కో అభ్యర్థి రూ.30-40 లక్షలకు పేపర్లు విక్రయించినట్టు సమాచారం. 2012లో ఎంపీపీఎస్సీ ప్రశ్నపత్రాలను బీహార్‌కు చెందిన ముఠా ప్రింటింగ్ ప్రెస్ ద్వారా లీక్ చేసి 50 మంది అభ్యర్థులకు విక్రయించినట్టు మధ్యప్రదేశ్ ఎస్టీఎఫ్ దర్యాప్తులో తేలింది. బీహార్ గ్యాంగ్‌కు యూపీలో ఉన్న బేడీ గ్యాంగ్‌తో సంబంధం ఉన్నదని కొన్ని వార్త కథనాలు ఆరోపించాయి. 2011లో ఛత్తీస్‌గఢ్ పోలీసులు రాష్ట్ర పరీక్షా బోర్డు నిర్వహించిన ప్రీ-మెడికల్ టెస్ట్(పీఎంటీ) ప్రశ్నపత్రాలు లీక్ కావటంతో కేసు నమోదు చేశారు. 2015లో ఛత్తీస్‌గఢ్ కోర్టు 'కింగ్‌పిన్' బేడీరామ్‌తో సహా ఐదుగురు నిందితులను దోషులుగా నిర్ధారించి ఆరేండ్ల జైలు శిక్ష విధించింది. అయితే, అప్పుడు బేడీ రామ్ పరారీలో ఉన్నాడు. 2016 మే 25న మధ్యప్రదేశ్ ఎస్టీఎఫ్ గుర్గావ్ నుంచి ఆయనను అరెస్టు చేసింది.

'బేడీ రామ్‌పై ఆరోపణలు నకిలీ, నిరాధారం': ఎస్‌బీఎస్‌పీ

ఢిల్లీ పీఎంటీ పేపర్ లీక్ కేసులో బేడీ రామ్‌ను సీబీఐ 2012లో అరెస్టు చేసినట్టు యూపీ ఎస్టీఎఫ్ అధికారి త్రివేణి సింగ్ ఒక ఆంగ్ల వార్త సంస్థకు తెలిపారు. బెయిల్‌పై విడుదల కాకముందే తీహార్ జైలుకు తరలించినట్టు సమాచారం. అయితే, 2022 ఎన్నికల అఫిడవిట్‌లో బేడీ రామ్ ఈ విషయాన్ని ప్రస్తావించలేదు.బేడీ రామ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) చీఫ్ అఖిలేష్ యాదవ్ పిలుపునిచ్చారు. బేడీ రామ్‌పై వచ్చిన ఆరోపణలన్నీ అబద్దాలు, నకిలీ, నిరాధారమైనవని ఎస్‌బీఎస్‌పీ జాతీయ అధికార ప్రతినిధి అరుణ్ రాజ్‌భర్ అన్నారు. పాత కేసులను తవ్వేస్తున్నారన్నారనీ, బేడీ రామ్‌కు సీబీఐతో పాటు సుప్రీంకోర్టు కూడా అన్ని కేసుల్లో క్లీన్ చిట్ ఇచ్చిందని చెప్పారు. ఇది ప్రతిపక్షాల కుట్రగా అభివర్ణించారు.

సంకీర్ణమైనా సరళీకరణ విధానాలే

విస్తృత సమావేశంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఉన్నా సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాలే అమలవుతున్నాయని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. ఎన్డీయేకు మద్దతు ఇస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ కూడా సరళీకరణ విధానాలను వ్యతిరేకించబోరనీ, వాటికి మద్దతిస్తారని చెప్పారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం దేశానికి ఎంతో ప్రమాదకరమని అన్నారు. కార్పొరేట్ శక్తులకు సేవకుడిగా మోడీ వ్యవహరిస్తారని విమర్శించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, జాన్‌వెస్లీ, మల్లు లక్ష్మి, ఎండీ అబ్బాస్ అధ్యక్షవర్గంగా సమావేశం జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ విదేశీ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ భారత్ అభివృద్ధిని చూసి ప్రపంచమంతా దిగ్భ్రాంతికి గురవుతున్నదంటూ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఈ పదేండ్లలో అంత అభివృద్ధి జరిగితే బీజేపీకి 303 నుంచి 240కి సీట్లు ఎందుకు తగ్గాయని ప్రశ్నించారు. మోడీ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలిందని చెప్పారు. బీజేపీకి 370 సీట్లు, ఎన్డీయేకు 400కుపైగా సీట్లు వసాయన్నారనీ, చావు తప్పి కన్ను లొట్టబోయినట్టు ఆ పార్టీకి 240 సీట్లు వచ్చాయన్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో రాజకీయ పార్టీలను చీల్చిందనీ, ఇద్దరు సీఎంలను జైల్లో పెట్టిందనీ, ప్రతిపక్ష నాయకులను అణచివేసిందని విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్లలో 8 వేల కోట్లు బీజేపీకి వచ్చాయని చెప్పారు. 80 శాతం మీడియా, సోషల్ మీడియా, కార్పొరేట్ శక్తులు ఆ పార్టీకి వత్తాసు పలికాయని అన్నారు. అయినా బీజేపీ సీట్లు తగ్గాయని వివరించారు. ప్రధాని మోడీ మూడోసారి ప్రమాణస్వీకారం చేశాక అసలు పాలన ముందుందంటున్నారని చెప్పారు. ఈనెల 22 నుంచి పార్లమెంటు సమావేశాలున్నాయనీ, 23న కేంద్ర బడ్జెట్ ఉందని అన్నారు. సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాలను మోడీ ప్రభుత్వం ముమ్మరం చేస్తుందన్నారు.

ఉత్తరాదిన బీజేపీకి ఎదురుదెబ్బ

ఉత్తరాదిన బీజేపీకి సీట్లు తగ్గాయని రాఘవులు వివరించారు. యూపీ, మహారాష్ట్ర, బెంగాల్‌లో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని చెప్పారు. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా బీజేపీకి సీట్లు రావడంతో అధికారంలోకి వచ్చిందన్నారు. హిందూత్వ మతోన్మాదాన్ని దేశమంతా వ్యాపించినా సీట్లు తగ్గాయని విమర్శించారు. కేరళలో బీజేపీ ఒక్కస్థానంలో గెలిచిందని అన్నారు. అక్కడ సీపీఐ(ఎం), వామపక్షాల ఓట్లు చేరి ఆ పార్టీకి రావడం ఆందోళనకరమని చెప్పారు. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ గెలిచే అవకాశాలున్నా చేజేతులా పోగొట్టుకుందని వివరించారు. మిత్రపక్షాల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని మోడీ ఏర్పాటు చేసినా వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలను అణచివేస్తారని చెప్పారు. మతోన్మాద ప్రమాదం పొంచి ఉందన్నారు. దేశంలో బీజేపీ పెరుగుదలను ఇండియా బ్లాక్ నిరోధించిందని చెప్పారు. బీజేపీని వదిలించుకోవడమే కర్తవ్యమంటూ ఆ కూటమిలోని పార్టీలు పనిచేశాయనీ, ప్రజల్లో భరోసాను కల్పించాయని వివరించారు. ఇండియా బ్లాక్ విచ్ఛిన్నం కాకుండా సీపీఐ(ఎం) విశేష కృషి చేసిందన్నారు. కేరళలో సీపీఐ(ఎం)ను ఓడించాలంటూ రాహుల్, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ మాట్లాడారని గుర్తు చేశారు. తాము నష్టపోయినా దేశం నష్టపోకుండా సంయమనంతో వ్యవహరించామని చెప్పారు. మమతా బెనర్జీకి నష్టం కలగకుండా బెంగాల్‌కు కాంగ్రెస్ ముఖ్యనాయకులెవరూ రాలేదన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడ్డమే సీపీఐ(ఎం) లక్ష్యమని చెప్పారు. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉంటూనే దేశభక్తిని చాటుకున్నామని అన్నారు.

తెలంగాణలో బీజేపీని నిలువరించాలి

తెలంగాణలో నాలుగు నుంచి ఎనిమిది సీట్లకు బీజేపీకి పెరిగిందని రాఘవులు చెప్పారు. 19 నుంచి 35 శాతానికి ఓట్ల శాతం పెరిగిందన్నారు. బీజేపీ మతోన్మాదాన్ని సైద్ధాంతికంగా, రాజకీయంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ బాధ్యతను సీఎం రేవంత్‌రెడ్డి కూడా నెరవేర్చాలని కోరారు. ఫెడరల్ హక్కుల మీద కేంద్రం దాడి చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రాలకు నిధులను తగ్గించడం కోసం పనగారియా నేతృత్వంలో ఫైనాన్స్ కమిషన్‌ను నియమించిందని గుర్తు చేశారు. పన్నుల్లో 30 శాతం వాటాను రాష్ట్రాలకు కేంద్రం ఇస్తున్నదనీ, దాన్ని 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. తమ నిధుల కోసం కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు ఢిల్లీలో వేర్వేరుగా ధర్నా చేశాయని గుర్తు చేశారు. అదే తరహాలో కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. జీఎస్టీకి ఎక్కువ పన్నులు రాకుండా ఉండేందుకు కేంద్రం సెస్‌ల రూపంలో వసూలు చేస్తున్నదని చెప్పారు. అందులో రాష్ట్రాలకు వాటా లేదన్నారు. రాష్ట్రాలకూ సెస్ వసూళ్లలో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఆందోళనల్లో కాంగ్రెస్ ప్రభుత్వం భాగస్వామి కావాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లు, లేబర్ కోడ్‌లు కేంద్రం తెచ్చిందనీ, వాటిని అమలు చేయబోమంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. ఆశాలకు పరీక్ష పెట్టాలని కేంద్రం చెప్తే దాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని చెప్పారు.

ప్రజలకు నష్టం చేసే విధానాలను అమలు చేయబోమంటూ కేంద్రాన్ని ఎదిరించాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలంటూ రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం ఒత్తిడి తెస్తున్నదని అన్నారు. అప్పులు చేసుకోనివ్వకుండా ఆంక్షలు విధిస్తున్నదని విమర్శించారు. కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి రూ.ఐదు వేల కోట్లు అప్పు తెచ్చుకుందని గుర్తు చేశారు. మెదక్ జిల్లాలో బీజేపీ నాయకులు మైనార్టీల ఆస్తులను ధ్వంసం చేశారని చెప్పారు. ఆ ఘటనలను కాంగ్రెస్ ఖండించలేదన్నారు. ఇది రాష్ట్రాభివృద్ధికి హానికరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి పెంచేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని చెప్పారు. అసంతృప్తి రాకుండా హామీలను అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ హామీలపై చెప్పే కిషన్‌రెడ్డి కేంద్రం హామీలు, ప్రజలపై మోపే భారాలపై చెప్పే దమ్మూధైర్యం ఉందా?అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీని ఒంటరిపాటు చేసి నిలువరించాలని పిలుపునిచ్చారు.

మతోన్మాదంపై పోరాడాలి

'ఈ దేశానికి మతోన్మాదం పనికిరాదు. లౌకికవాదం కావాలి. నిరంకుశత్వం వద్దు. ప్రజాస్వామ్యం కావాలి. సనాతన ధర్మం సృష్టించే మనువాదం ఉండొద్దు. సమానత్వం కావాలి. కులవివక్ష ఉండొద్దు, సామాజిక న్యాయం కావాలి.'అని రాఘవులు చెప్పారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి మనువాద రాజ్యాంగాన్ని తేవాలని బీజేపీ కుట్ర చేస్తున్నదని విమర్శించారు. ఈ లక్ష్యాలు సాధించాలంటే కమ్యూనిస్టులతోపాటు రాజ్యాంగాన్ని, దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడే వారు కలిసి రావాలని కోరారు. సమస్య ప్రాతిపదికన కేంద్రానికి మద్దతుపై నిర్ణయం తీసుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించడం రాజకీయం కాదనీ, లొంగుబాటుతనం అవుతుందన్నారు. అవకాశవాదంతో వ్యవహరించడం సరైంది కాదని చెప్పారు. బీజేపీతో అంటకాగిన బీజేడీ, వైసీపీ పరిస్థితి ఏ విధంగా ఉందో చూడాలన్నారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్ ఉండాలంటే సమస్యలపై నిక్కచ్చిగా పోరాడాలనీ, మతోన్మాదానికి వ్యతిరేకంగా పనిచేయాలని చెప్పారు. అవకాశవాద రాజకీయాలను విడనాడాలని సూచించారు. దేశ సమైక్యత, సమగ్రత, సంక్షేమాన్ని కోరుకునే వారు కలిసి రావాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే ప్రభుత్వంపై పోరాడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, డిజి నరసింహారావు, పాలడుగు భాస్కర్, టి సాగర్, పి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటించాలి

- గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్
- విస్తృత సమావేశంలో తీర్మానం ఏకగ్రీవ ఆమోదం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఏడు నెలల పాలన పూర్తయిందనీ, మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం అమలవుతున్నదని చెప్పారు. గృహజ్యోతి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. రైతుభరోసా కింద పంట పెట్టుబడిసాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారని అన్నారు. పంటల బీమా పథకాన్ని రైతాంగానికి ఉపయోగపడేలా బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించి అమలు చేయాలని కోరారు. ధరణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి, ఇతర పంటలకు బోనస్ ఇవ్వాలని చెప్పారు. వ్యవసాయ ప్రణాళికను వెంటనే ప్రకటించాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలనీ, ఖాళీపోస్టులను భర్తీ చేయాలని కోరారు. హామీ ఇచ్చిన విధంగా నిరుద్యోగ భృతి ప్రకటించాలని చెప్పారు. పెన్షన్లు పెంచాలన్నారు. గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలివ్వాలనీ, ఇంటి నిర్మాణానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఆర్థిక సహాయం చేయాలని అన్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన వారందరికీ హక్కు పత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగులకు అన్ని రకాల పెండింగ్ బిల్లులను చెల్లించాలనీ, బకాయిలను విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని చెప్పారు. కార్మికుల కనీస వేతనాల జీవోలను పెరిగిన ధరలకను గుణంగా సవరించాలనీ, కొత్త జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్ బలపరిచారు. దాన్ని విస్తృత సమావేశంలో ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

హక్కుల కోసం కేంద్రంపై పోరాడాలి...

రేవంత్ సర్కారుకు ఎస్ వీరయ్య సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య చెప్పారు. ఇటీవల మెదక్‌లో జరిగిన కొన్ని మతోన్మాద ఘటనల పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

బక్రీద్ సందర్భంగా రాష్ట్రంలో చోటు చేసుకున్న ఘర్షణలను ప్రస్తావిస్తూ బీజేపీ మూడో సారి అధికారంలోకి వచ్చాకే ఇవన్నీ జరిగాయని గుర్తు చేశారు. మెదక్‌కు సంబంధించి ప్రభుత్వం స్పందించి, బాధ్యులపై కేసులు నమోదు చేసినప్పటికీ, అది సరిపోదని అన్నారు. ఈ ఘటనపై సీఎం రేవంత్,



మిగతా మంత్రులు నోరు మెదపకపోవటం శోచనీయమన్నారు. మతోన్మాదాన్ని నిలువరించాల్సిన బాధ్యత అధికార పార్టీగా కాంగ్రెస్‌కు, పీసీసీ చీఫ్‌గా రేవంత్‌కు లేదా? అని ప్రశ్నించారు.

బీజేపీ ఆర్థిక విధానాలతోపాటు దాని మతోన్మాదంపై కరకుగా ఉండాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. అప్పుడే బీజేపీని నిలువరించగలుగుతారని సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, గ్రాంట్లు, హక్కుల సాధనకు కేంద్రంపై పోరాడాలని సీఎం రేవంత్‌కు వీరయ్య ఈ సందర్భంగా సూచించారు. రాష్ట్ర విభజన అంశాలపై ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్ చర్చించటం మంచిదేననీ, అయితే రెండు రాష్ట్రాలకు సంబంధించి కేంద్రం పరిధిలోని అంశాలపై మోడీ సర్కారుపై ఒత్తిడి తేవాలనే ప్రతిపాదన వారిద్దరికీ లేకపోవటం శోచనీయమని అన్నారు.


బీజేపీని నిలువరించటమే మా కర్తవ్యం

- ఆ పోరాటంలో ఎవరు కలిసొస్తే వారిని కలుపుకునిపోతాం: సీపీఐ(ఎం) విస్తృత సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగానూ బీజేపీని నిలువరించటమే తమ పార్టీ ప్రధాన కర్తవ్యమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఇందుకు సంబంధించిన పోరాటంలో అన్ని శక్తులనూ కలుపుకునిపోతామని ఆయన చెప్పారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై తమ్మినేని మాట్లాడుతూ కేవలం ఎన్నికల సందర్భంలోనే గాక బీజేపీని, దాని మతోన్మాద భావజాలాన్ని అన్ని సమయాల్లోనూ నిలువరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణలో ఎనిమిది ఎంపీ



సీట్లను ఆ పార్టీ గెలుచుకున్న నేపథ్యంలో ప్రజలు దాని పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీజేపీ, దాని విధానాలకు వ్యతిరేకంగా పోరాడే అన్ని శక్తులనూ కలుపుకుని ముందుకు పోవాలని కార్యకర్తలను కోరారు. రాష్ట్రంలోని రేవంత్ సర్కారు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక పరిస్థితి, నిధుల కొరత పేరిట వాటి అమలును ఎగ్గొట్టే ప్రయత్నం చేయొద్దని కోరారు. రైతు భరోసా, రుణమాఫీ, పోడు భూములకు పట్టాలు, వ్యవసాయ కార్మికులకు ఆర్థిక సహాయం, ఇండ్లు, ఇండ్ల పట్టాలు, కార్మికులకు కనీస వేతనాల అమలు తదితర ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రేవంత్‌రెడ్డిని తమ్మినేని కోరారు.

ఎంఎస్‌ఎంఈలలో | అందులోనూ కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్యా సంఖ్యా ఎక్కువే

అసంఘటిత కార్మికులే అధికం



న్యూఢిల్లీ : 2023 జనవరిలో అప్పటి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈలు) మంత్రి నారాయణ్ రాణే ఎంఎస్‌ఎంఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (ఎస్ఐడీబీఐ) భాగస్వామిగా ఉంది. జీఎస్టీ అధికారుల వద్ద నమోదు కాని అనధికారిక సూక్ష్మ తరహా పరిశ్రమలకు ఉద్యం రిజిస్ట్రేషన్‌ను కల్పించడమే ఎంఎస్‌ఎంఈ ప్రాజెక్టు ఉద్దేశమని ఎస్ఐడీబీఐ తెలిపింది. ఉద్యం వేదిక కానీ, జీఎస్టీ కింద రిజిస్ట్రేషన్ కానీ అసలు సమస్యే కాదు. అయితే అనధికారిక, అధికారిక పరిశ్రమల రోజువారీ పనితీరుపై అవగాహన కోసం ఇవి ఉపయోగపడతాయి.

ఇటీవలి కాలంలో ఎంఎస్‌ఎంఈలు రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించాయి. ఎంఎస్‌ఎంఈలకు సంబంధించి ప్రభుత్వం అందించే సమాచారం ఉద్యం, జీఎస్టీపై ఆధారపడి ఉంటుంది. అసలు రిజిస్ట్రేషన్ల కారణంగా ఎవరు, ఎలా ప్రయోజనం పొందుతారో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆయా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సంబంధించిన వివరాలు ఈ రిజిస్ట్రేషన్ల ద్వారా తెలుస్తాయి.

చట్టప్రకారం ఏర్పడని సంస్థలపై 2016లో ఎన్ఎస్ఎస్ ఓ సర్వే నిర్వహించింది. దీని ప్రకారం సంవత్సరానికి రూ.25-50 లక్షల ఆదాయం ఉన్న పరిశ్రమల యజమానుల్లో 45% మంది వస్తు సేవల (జీఎస్టీ) వ్యవస్థలో నమోదయ్యారు. అయితే వారి ఉద్యోగుల్లో 65 శాతం మంది అనధికారికంగా పని చేస్తున్న వారే. వీరిలో 1.54 శాతం మందికి మాత్రమే పీఎఫ్ చట్టం వర్తిస్తోంది.

మూడు నుండి ఐదు కోట్ల రూపాయల వార్షిక ఆదాయం పొందుతున్న సంస్థల్లో 73 శాతం వ్యాట్ కింద నమోదయ్యాయి. కానీ ఆ సంస్థల్లో పనిచేస్తున్న మొత్తం కార్మికుల్లో 70 శాతం మంది అనధికారికంగా ఉంటున్న వారే. వీరిలో 42 శాతం మంది అధికారికంగా రుణాలు తీసుకుంటే 9 శాతం కంటే తక్కువ మందికి మాత్రమే పీఎఫ్ చట్టం వర్తిస్తోంది.

మూడు నుంచి ఐదు కోట్ల రూపాయల వార్షిక ఆదాయం పొందిన వారి కంటే 12 లక్షల రూపాయల కంటే తక్కువ ఆదాయం ఉన్న వారిలో అధికారిక వనరుల నుండి రుణం తీసుకున్న వారి సంఖ్య నాలుగు రెట్లు అధికంగా ఉంది. అనధికారికంగా ఉపాధి పొందుతున్న వారి దామాషా 46 శాతం నుంచి 59 శాతానికి పెరిగింది. సంవత్సరానికి రూ.12 లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం కలిగిన సంస్థలతో పోలిస్తే మూలధనాన్ని రుణంగా పొందే సంస్థల సంఖ్య నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది.

సంవత్సరానికి రూ.12 లక్షల కంటే తక్కువ ఆదాయాన్ని పొందుతున్న సూక్ష్మ తరహా పరిశ్రమల్లో 56 శాతం మంది కార్మికులు అనధికారికంగానే పనిచేస్తున్నారు. రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ ఆదాయాన్ని కలిగిన పరిశ్రమల్లో 65 శాతం మంది అనధికారికంగా పనిచేస్తున్నారు. కోటి రూపాయల నుంచి ఐదు కోట్ల రూపాయల వరకూ ఆదాయాన్ని పొందుతున్న పరిశ్రమల్లో సుమారు 68 శాతం మంది అనధికారిక ఉద్యోగులే. రూ.12 లక్షల లోపు ఆదాయాన్ని కలిగి, ఫ్యాక్టరీల చట్టం కింద నమోదు చేయబడిన పరిశ్రమల్లో 58 శాతం మంది కార్మికులు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు.

సంవత్సరానికి రూ.25 లక్షల నుండి రూ.50 లక్షల వరకూ ఆదాయం కలిగిన సంస్థల విషయానికి వస్తే కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య 50 శాతంగా ఉంటోంది. కోటి రూపాయల నుంచి ఐదు కోట్ల రూపాయల వరకూ ఆదాయాన్ని పొందుతున్న పరిశ్రమల్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్య సుమారు 45 శాతంగా ఉంది.

ఆటలు

మూడో టి20లోనూ గెలుపే..

- జింబాబ్వేపై 23పరుగుల తేడాతో ఘన విజయం
- సుందర్ ఆల్‌రౌండ్ షో



హరారే: ఐదు టి20ల సిరీస్ ఆడేందుకు జింబాబ్వే పర్యటనకు వెళ్లిన భారత యువ జట్టు అద్భుతంగా రాణిస్తోంది. తొలి టి20లో నిరాశపరిచినా.. రెండు, మూడు టి20ల్లో నెగ్గి సిరీస్ ఆధిక్యతలో నిలిచింది. హరారే వేదికగా జింబాబ్వేతో బుధవారం జరిగిన మూడో టి20లో టీమిండియా 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి 6వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. డియోన్ మైయర్స్(65నాటౌట్, 49 బంతుల్లో; 7ఫోర్లు, సిక్సర్), క్లైవ్ మథండె (37, 26 బంతుల్లో; 2ఫోర్లు, 2సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించారు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్‌కు మూడు, అవేశ్ ఖాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యతలో నిలిచింది. వాషింగ్టన్ సుందర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండి యాను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (66, 49 బంతుల్లో; 7ఫోర్లు, 3సిక్సర్లు), రుతురాజ్ గైక్వాడ్ (49, 28 బంతుల్లో; 4ఫోర్లు, 3సిక్సర్లు) రాణించారు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (36, 27 బంతుల్లో; 4ఫోర్లు, 2సిక్సర్లు) ఆకట్టుకున్నాడు. రెండో టి20లో సెంచరీతో కదం తొక్కిన అభిషేక్ శర్మ(10) నిరాశపరిచాడు. గిల్‌తో ఓపెనర్‌గా వచ్చిన జైస్వాల్ తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు, సిక్సర్‌తో తన ఉద్దేశాన్ని చాటాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot No. 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Published At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot.8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2015/60815